మార్చి 1984

149



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మార్చి 1984 | మాసపత్రిక | 149

'జానకి విముక్తి' పుస్తకసమీక్ష వచ్చేసంచికలోకూడా కొనసాగుతుంది.

నిర్వహణ	సృజన	ఈ సంచిక రు. 2
సాహితీ మిత్రులు	హనుమకొండ 506 001.	సంవత్సరచందా రు. 20

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd
Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Printed, Edited & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002

జారిస్టు రష్యా అనుభవంతో ముందేజాగ్రత్తపడి మనలెనిన్‌ను యవ్వనంలోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదం చంపేసింది- అని అన్నాడు ఒక చరిత్రరచయిత భగత్ సింగ్ ఉరితీతగురించి.

భగత్‌సింగ్ బతికివుంటే భారత స్వాతంత్ర్యపోరాటాన్ని, బూర్జువావర్గం చేతుల్లోంచి కార్మికవర్గం నాయకత్వంకిందికి తెచ్చేవాడా- అన్నది ఇవ్వాళ అభిమానంతో చెందే ఆవేదనగానే మిగలవచ్చుగానీ ఆయన భారతదేశంలో రావలసిన మార్పు కార్మికవర్గ అనుకూలమైనమార్పుఅని చాలత్వరలోనే గ్రహించాడని మాత్రం నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆయన అనుయాయులు, అభిమానులు, ఆయనతో ఉత్తేజాన్నిపొందిన యువతరం నాటినుంచి నేటివరకు భారతప్రజల విముక్తికి సాయుధపోరాటమే పరిష్కారమార్గంగా ఎంచుకుంటున్నారు. కనుక ఆయన లెనిన్ అయ్యేవాడా కాకపోయేవాడా అనే విచికిత్సకన్నా ఆయన 'లెనిన్'కు ('లెనినంటే విప్లవం') నేపథ్యాన్ని సమకూర్చాడన్నదిమాత్రం చారిత్రకసత్యం.

సూర్యోదయానికిముందు ఆయన వేగుచుక్క అయ్యాడు. ఆయనఅంటే ఆయనమాత్రమేకాదు నాటికే సశస్త్రపోరాటంలో విశ్వాసంవుంచి బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో రాజీలేని పోరాటంచేసిన టెర్రరిస్టులు, గదర్‌పార్టీ మొదలైనసంస్థలు, వ్యక్తులు ఆ సూర్యోదయంకోసం భారతాకాశంలో అలుముకొన్న గాఢాంధకారాన్ని తమ త్యాగాలరక్తంతో తుడిచివేసే కృషిచేసారు. ఆ త్యాగాలు వృథాకావు.

సామ్రాజ్యవాద హంతకస్వభావానికి బలియైన, తుపాకిగుళ్ళకు గురైన, ఉరికంబాలెక్కిన ఎందరెందరో స్వాతంత్ర్యయోధుల శ్వాసలు తెలంగాణ రైతాంగ సాయుధపోరాటమనే శాస్త్రీయపంథాకు రహదారులువేసినవి. రహస్తంత్రుల నిశ్శబ్దాన్ని అణువులోని విస్ఫోటనంలా ప్రతిధ్వనించినవి.

ప్రభుత్వాల నిర్బంధాలకు, బూర్జువాపార్టీలమౌన, ఉదాసీన, అనుకూలాల్యాలకు గతితార్కిక సంబంధంవుంటుంది. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఆనాడు, కయ్యూరు కామ్రేడ్స్‌ను ఆ తర్వాత, భూమయ్య కిష్టాగౌడ్‌లను ఈనాడు ఉరితీయడానికి గాంధీ, నెహ్రూ ఇందిరలు పరోక్ష ప్రత్యక్షబాధ్యులయ్యారంటే ఆ వర్గ పాలకవర్గాల అభీష్టంగనుక.

భగత్‌సింగ్‌ను, అనుహాయులను ఉరితీయడానికి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికి ఏ శిక్షాస్మృతి పనికొచ్చిందో అదే శిక్షాస్మృతి భూమయ్య కిష్టాగౌడ్‌లను ఉరితీయడానికి 'స్వతంత్ర' ఇండియాకుకూడ పనికొచ్చింది. సెషన్స్‌కోర్టు మొదలు సుప్రీంకోర్టువరకు వ్యక్తిగతకక్షలకు, అసూయా ద్వేషాలకు అవకాశంలేని 'రాజకీయచర్య'ను ఆమోదించలేకపోవడం అలావుంచి సహించలేకపోయాయి. భారతగణతంత్ర ప్రభుత్వ అధ్యక్షుడు 'క్షమించ'లేక పోయాడు.

'రాజకీయనేరం' అనేది ఆ కాలంలో అధికారంలోవున్న ప్రభుత్వందృష్టిలో మాత్రమే నేరమయ్యే అవకాశం చాలసందర్భాల్లో సత్యం. ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి అంతిమ సారాంశంలో భగత్‌సింగ్ శత్రువయినా తాత్కాలిక సందర్భాల్లో గాంధీ నెహ్రూలుకూడ అయిష్టులయ్యారు. ఈనాటికీ ఐరిష్ విప్లవకారులు పరమశత్రువులుగా వున్నారు. భుట్టో ఉరితీతకైనా, మఖ్బూల్ భట్ ఉరితీతకయినా అధికారంలోవున్న ప్రభుత్వాలే 'న్యాయ' నిర్ణేతలుతప్ప, అది సర్వజనామోదకరమైన చర్యఅని మౌనాన్నిబట్టి అయినా అంచనావేయలేం.

రాజకీయాల్లో ఒకరిదృష్టిలోని విద్రోహం మరొకరిదృష్టిలో విప్లవం కావచ్చు. ఒకరి 'మహాత్ముడు' మరొకరికి పాలకవర్గాల ఏజెంటుకావచ్చు. కాని ఒకప్రాణాన్ని బలిగొనేప్పుడు అదీ ముఖ్యంగా ఒకసంఘటిత 'నాగరిక' వ్యవస్థగావుండే ప్రభుత్వం చట్టబద్ధంగా ఒక శ్వాసను పుటుక్కున తెంచేయాల్సి వచ్చినపుడు న్యాయనిర్ణేతలెవరు? న్యాయం అంతనిష్పాక్షికమైన, నిరపేక్షమైన, నిర్గుణ, నిరాకార, సాపేక్షరహిత 'బ్రహ్మపదార్థ'మా? ముఖ్యంగా వర్గసమాజంలో. కాదనేది పెద్దలు బుకాయిస్తున్నా ప్రజలు గ్రహిస్తున్నసత్యం.

'రాజకీయచర్యలు' వ్యక్తిగత కక్షలతో కూడినవికావు కనుక ఇందులో 'స్వార్థ' ప్రయోజనాలు వుండేఅవకాశం లేదుగనుక వీటిని మామూలునేరాలుగా పరిశీలించే ఐపిసి, సిఆర్‌పిసి సెక్షన్‌ల వెలుగులోకాక సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యంలో విశ్లేషించి తీర్పుచెప్పాలని ఇంతా రమణారెడ్డి ఉరిశిక్షను రద్దుచేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఒక దశాబ్దంక్రితమే అభిప్రాయపడింది.

'రాజకీయహత్యలు' కనుకనే ఉరిశిక్షవేస్తున్నామని బర్ల యాదగిరిరాజు విషయంలో ఎమర్జెన్సీలో, సిపిఐఎం కార్యకర్తల విషయంలో ఇటీవల వరంగల్ సెషన్స్‌కోర్టు రెండుమార్లు (జడ్జిఒక్కరేకాదు) 'తీర్పు' చెప్పింది:

ఎంతో మానవతాదృక్పథం మాటల్లో ధ్వనించే కృష్ణయ్యర్ భూమయ్య కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష రద్దుచేయడం తనచేతుల్లోలేదని. 'క్షమాభిక్ష' పెట్టమనిమాత్రం రాష్ట్రపతి హృదయానికి ఎంతగానో అపీల్‌చేసాడు. ఈ వ్యవస్థలో కోర్టుకులేని 'హృదయం' రాష్ట్రపతికివుండే అవకాశంవుందని ఆశించేంత ప్రగతిభావుకుడాయన.

ఉరిశిక్షలురాసే రాజ్యాంగాలకు, నల్లచట్టాలుచేసే శాసనసభలకు, అవేకాదు అంతకన్న ఎంతోఎక్కువ అత్యాచారాలు నిత్యమూ కొనసాగించే ప్రభుత్వ యంత్రాంగానికి. చెవులేకాని కళ్ళుండవనుకునే 'న్యాయస్థానాలకు (చాల అర్థవంతంగా చేతిలో త్రాసుతో అంధన్యాయదేవత వరంగల్‌కోర్టులో న్యాయమూర్తి ధర్మాసనంవెనుకకాక గుమస్తాటేబిల్‌కింద పడివున్నది!) వర్గాతీతమైన సమదృష్టి వుంటుందనుకోవడం దోపిడీవర్గ న్యాయానికి మౌనంగానో, ఉదాసీనంగానో సేవ చేయడమే.

అందుకే బాంబులువేసిగానీ భగత్‌సింగ్ పార్లమెంటుకు బయటిప్రపంచ వాస్తవాలను చూపాలనుకోలేదు.

గుడ్డిప్రభుత్వాన్ని కూలదోయప్రయత్నిస్తే గుడ్డిన్యాయస్థానం శిక్షవేయకుండా ఊరుకుంటుందా? చూపున్నమనుషులంటే దోపిడీకి ఎప్పుడూభయమే. దోపిడీ ఎదుటివాళ్ళ కళ్ళయినాకప్పాలి. తనకళ్ళయినా మూసుకోవాలి. అందరూ చూడగా తానూ చూస్తూ నేరంచేయడం సాధ్యంకాదు. ప్రజల్ని మభ్యపుచ్చినంతకాలం సజావుగా తానుదోచుకోవచ్చు. ప్రజలు కళ్ళుతెరిచేక్రమంలో తనకళ్ళుకప్పుకపోయే పాశవిక అణచివేత అధికారాన్ని చేపట్టాల్సివస్తుంది. అపుడింక ముఖ్యమంత్రి హామీలు అసెంబ్లీ ఆవరణలోనే హరించుకపోతాయి. పైఅధికారులమాటలు కింది అధికారులు వినరు గుడ్డెద్దు చేనులోపడ్డట్టు కొట్టడంనేర్చిన లాఠీలకు అదుపునేర్పడం కష్టమవుతుంది.

అయితే ఇవేవీ పైకి కనిపించినంత విడిగాజరుగుతున్న సంఘటనలుకావు, వీటికన్నింటికీ అంతసూత్రం. భగత్‌సింగ్‌నుంచి భూమయ్య కిష్టగౌడ్‌లదాకా ఉరితీసిన, అల్లూరి సీతారామరాజునుంచి పల్లెకసుకయ్యదాకా 'ఎన్‌కౌంటర్' చేసిన ఈ వ్యవస్థ స్వభావంలోనేవున్నది.

మామూలుచూపుకు అక్రమంగాకనిపించే విషయాలలోకూడ వాటి గతితార్కిక స్వభావాలను ఆచరణవెలుగులో విశ్లేషిస్తే కనిపించేది ఈ క్రమమే.

భగత్‌సింగ్‌ను ఉరితీస్తే మౌనంవహించిన గాంధీ అనుయాయులే అధికారంలోకివచ్చి భూమయ్య కిష్టాగౌడ్‌లను ఉరితీసారు. అంటే మౌనం అధికారంలోకి వచ్చినపుడు తానేపక్షమో స్పష్టంగానే ప్రకటించింది. అధికారమిస్తే తమ ఏజెంట్లు తమకన్నా తమప్రయోజనాలను సమర్థంగా నిర్వహించగలరని నాడే గ్రహించారు గనుకనే వలసవాదులు 'శాంతియుతంగా' వెళ్ళిపోయారు.

అయితే ఉరిశిక్షలు ఉరిశిక్షనురద్దుచేయలేనట్లే ఉరికంబాలు ఎక్కేవాళ్ళశ్వాసల్ని కూడ శాసించలేకపోతున్నాయి. జనపదాలను శ్మశానాలుచేస్తే ప్రజలు భయపడతారనుకుంటే ఇంద్రవెల్లులు ఘడ్చరోలీలు కానేకావు. భూమయ్య కిష్టాగౌడ్‌లు ఈనాడు ప్రజాతంత్ర, విప్లవోద్యమాల ఊపిర్లయి 'భూమ్యాకాశాలు'గా విస్తరించనే విస్తరించరు.

హోచిమిన్ ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రకటించినట్లు నేల, అలలు, గిరులు, ఝరులు ఉన్నంతకాలం. ప్రజలు ఉన్నంతకాలం, 'చెరసాలలు ఉరికొయ్యలు వెలుగును బంధించలేవు. ప్రతినిముషం పోరాడే ప్రజలను భయపెట్టలేవు'

తెల్లవాడు నాడునిన్ను భగత్‌సింగ్‌వన్నాడు
నల్లవాడు నిన్ననేడు నక్సలైటువన్నాడు
ఎల్లవారు రేపునిన్ను వేగుచుక్క అంటారు
ఊగరా! ఊగరా! ఊగరా!
ఉరికొయ్యను అందుకొని ఊగరా!'

9-3-84

కవిత :

నగరం

కృష్ణ

నగరం నగరమంతా
కటకటాల వెనుకఉంది
ఆకాశం కటకటాలవెనుకే
పక్షులూ కటకటాల వెనుకే
వల్లని తారురోడ్డునాక్రమించుకుంటాయి
భూతాల్లా వ్యానులు
చెట్ల ఊపిరికూడ విషమయమై పోయింది
గాలే కలుషితమయింది ధూళే ఎర్రబారింది
భూమిభూమంతా కల్లోలితప్రాంతమయింది

తరగతిగదిలో కృష్ణశాస్త్రి స్వేచ్ఛాగీతికలు
గదిబయట ఇనుపటోపీవాళ్ళ కర్కశస్వరాలు
గదిలోంచి బయటికివచ్చి
మనం విడిపోతాం
నీకూనాకూ సంబంధంలేదు
ఇద్దరికీ ఒకరికొకరు తెలీదు
నీవునాతోమాట్లాడితే సెక్షన్లుయాక్టన్లు తీసుకుంటాయి
విద్యాలయాల్లో ఎవరూ ఎవరితో మాట్లాడుకోవద్దు
కళ్ళు వక్రంగాచూడాలి
సూటిగా చూడవద్దు
మాట తడబడాలి
స్వచ్ఛంగా మాట్లాడవద్దు
చరిత్రమోసుకొచ్చే
హత్యావార్తల్ని నిర్లిప్తంగావినాలి
చావులన్నీ సహజమైనవనే భావించాలి
దొరికిందితిని ఎక్కడో ఓచోటపడుకొని
కాలంవెళ్ళబుచ్చాలి
ఆకలికేకలేయవద్దు
ఆకలినే ప్రశ్నించవద్దు

నగరం కటకటాలవెనుక
బలవంతమౌనం వహిస్తున్నది
నగరం కటకటాలవెనుక
మవునసముద్రంలాఉంది

మార్చి 23 భగత్‌సింగ్ సంస్మరణ :

గత ఆగత చరిత్రగతి నిర్మాణం

మనిషి తన భవిష్యత్తునేకాదు, గతాన్నిగూడ నిర్మించుకుంటాడు. మనం ఒక దృక్పథంతో, ఒక అవగాహనతో. మనగతానికి రూపం ఇచ్చుకునేదాకా అది చరిత్ర కాదు. చరిత్రకు ముడిసరుకుమాత్రమే అవుతుంది.

భవిష్యత్తును నిర్మించేక్రమంలో ఒక్కొక్కసమయంలో ఒక్కొక్కవర్గానికి ఎక్కువప్రాముఖ్యతఉంటుంది. కాని గతాన్ని ఆవిష్కరించే 'బాధ్యత' మాత్రం ఇంతవరకు ఎప్పుడూ మేధావులమీదే ఉంటూవచ్చింది. శ్రామికజనం తమమాటలలో పాటలలో గతాన్ని పలికిస్తూవుంటారు, కాని అవి జ్ఞాపకాలేతప్ప క్రమబద్ధమయిన ఆవిష్కరణకాదు. ఒక్కొకసారి జ్ఞాపకాలుగూడకాదు, కేవలం చరిత్ర వదిలివెళ్ళిన ప్రతిక్షేపాలు మాత్రమే.

అందుకే మేధావులఅభిమానాన్నీ విశ్వాసాన్నీపొందడం పాలకవర్గాలకు అవసరం. అవి ఉన్నంతకాలం వాళ్ల పాలకవర్గాలకళ్లతో చరిత్రనుచూస్తారు. ఆ అభిమానాన్నీ విశ్వాసాన్నీకోల్పోతే ఆ తరువాత కేవలం మేధావులలోని అవకాశవాదులు మాత్రమే పాలకవర్గంకళ్లతో చరిత్రనుచూస్తారు. తక్కినవాళ్ల ఇతర దృక్కోణాల కోసం వెతకడం ప్రారంభిస్తారు.

భారతజాతీయ ఉద్యమచరిత్రరచన ఇప్పటివరకు మేధావులకు బూర్జువావర్గంమీద (నిర్దిష్టంగా చెప్పాలంటే కాంగ్రెస్‌పార్టీమీద) గల విశ్వాసంమీద ఆధారపడుతూ వస్తోంది. కాంగ్రెస్‌పార్టీ నాయకత్వంలో బూర్జువావర్గం దేశాన్ని బలమయిన ఆధునిక పారిశ్రామికదేశంగా మలచగలదని మేధావులలోవున్న విశ్వాసం వెనక్కి ప్రసరించి, జాతీయోద్యమ చరిత్రలోగూడ కాంగ్రెస్‌పుట్టుకా పురోగమనంతప్ప తక్కినవన్నీ అప్రధానమయిన విషయాలుగాకనిపించాయి. ఏపోరాటం ఎంత విస్తృతమయినది, ఏ పోరాటంలోని జాతీయత ఎంత, ఏ పోరాటాన్ని నడిపించెవరు, గొంతునొక్కించెవరు, ప్రజలలో సంఘటన, కదలిక, ఎంతమేరకు కాంగ్రెస్‌జెండాకింద వచ్చాయి, ఎంతమేరకు ఆ జెండాకు అతీతంగానో వ్యతిరేకంగానోవచ్చాయి—ఈ ప్రశ్నలన్నీ చులకనగా తిరస్కరించబడ్డాయి. ఇవ్వాళ్టివిశ్వాసం నిన్నటిప్రమాణాల్ని నిర్ణయించింది. నిన్నటిచరిత్రకున్న స్వాభావికమయిన ప్రమాణాలు లెక్కలోకిరాలేదు.

ఈ నిర్దిష్టమయిన నేపథ్యంలోపుట్టింది భారతజాతీయోద్యమచరిత్రకు సంబంధించిన బూర్జువాదృక్పథం.

ఈ చరిత్రను మూడుమాటల్లో చెప్పాలంటే. జాతియావత్తు అ చేతనంగా కాంగ్రెస్‌కోసం నిరీక్షించింది, కాంగ్రెస్ గాంధీకోసం నిరీక్షించింది, గాంధీ వచ్చాక అంతాసవాఫుగా స్వాతంత్ర్యంవైపు నడిచింది. 1919 నుండి మెల్లమెల్లగా ఖిలాఫత్ ఉద్యమం, సహాయనిరాకరణ, సైమన్ కమిషన్, రౌండ్‌టేబుల్ సమావేశం, ప్రొవిన్షియల్ ఎన్నికలు, క్విట్ ఇండియా ఉద్యమం, 1947లో స్వాతంత్ర్యం-అన్నీ ఒకదాన్ని వెంబడించి ఒకటివచ్చాయి.

ఈ చరిత్రను గురించి రెండురకాల అభ్యంతరాలు చెప్పొచ్చు. మొదటిది, అసలు ఏదేశచరిత్ర ఏకాలంలోనూ ఇంతసవాఫుగా సరళిగా వుండదు. చరిత్ర ఒక మలుపుతీసుకున్నతరువాత ఆ మలుపు చాలాసహజంగాను, అనివార్యంగాను కనిపిస్తుందిగాని ఆ సహజత్వం భ్రమమాత్రమే. మలుపుతీసుకోకముందున్న అన్వేషణ ఆవేదన, సంక్షోభం, సందిగ్ధం. ఇవన్నీగూడ చరిత్రలోభాగమే చరిత్రతీసుకునే ఏమలుపయినా అప్పటిపరిస్థితులలో అనివార్యంకాదా అంటే అనివార్యమే. కాని అందుకుముందున్న అన్వేషణ. ఆ అన్వేషణకు సాధనమయిన ఆచరణ. ఆ పరిస్థితులను నిర్ణయించేశక్తులలో భాగమే కాబట్టి. ఆ అనివార్యతను యాంత్రికంగా అర్థం చేసుకోగూడదు. చరిత్రను సంకల్లుతీసి సాపుచేస్తే అదిత్వరలోనే పురాణంస్థాయికి దిగజారే ప్రమాదంవుంది. దేశంసంగతీ జాతిసంగతీ పక్కనబెట్టి కాంగ్రెస్ సభ్యులనే తీసుకున్నా 1919లోగాని ఆ తరువాత చాలాకాలానికిగాని అందరూ గాంధి నాయకత్వాన్ని నిర్ద్వంద్వంగా ఆమోదించలేదు గాంధీమార్గం స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెడుతుందన్న నమ్మకం కాంగ్రెస్‌కుసహితం ఒకపటాన ఏర్పడలేదు. మనకు స్కూల్లోచెప్పే చరిత్రలోమాత్రం దేశంయావత్తూ గాంధీకోసమే కాచుకు కూర్చున్నట్లూ, ఆయనగారు ఆ యుగఆహ్వానాన్ని అందుకొని దక్షిణఆఫ్రికానుండి భారతదేశానికి తరలివచ్చినట్లూ, ముందు ఒకపథకంప్రకారం దేశపరిస్థితులను పరిశీలించి ఆ తరువాత రంగంలోకి దిగి నాయకత్వం స్వీకరించినట్లూ, ఆ పిదప ఏ అభ్యంతరాలూ ఒడుదుడుకులూ లేకుండ ఆయన నాయకత్వంకింద జాతీయోద్యమం నడిచినట్లూ చెప్తారు. ఈ పురాణానికి పరాకాష్ఠ అటెన్‌బరో తీసిన 'గాంధీ' చిత్రం.

రెండవ అభ్యంతరం ఏమిటంటే ఈ చరిత్ర ప్రకారం జాతీయోద్యమంలో కాంగ్రెస్‌తప్ప వేరేసంస్థగాని ఉద్యమంగానిలేవు. ఎవరోకొందరు 'టెర్రరిస్టులు' అని పిలవబడేవాళ్లు ఉన్నమాట వాస్తవమే. వాళ్లను గాంధీ ఆనాడు వ్యతిరేకించినా, ఈ నాడు విజేతకు ఉచితమయిన ఔదార్యంతో వాళ్ళను ఈ చరిత్ర దేశభక్తులుగా కాని

యాడే మాట వాస్తవమే. కాని వాళ్లు మనకళ్ళకుఎట్లా కనిపిస్తారంటే, విష్ణువు అవతారం ఎత్తి రక్షించేముందు రాక్షసులతో యుద్ధంచేయడానికి ప్రయత్నించి చావు దెబ్బలుతినే నిష్ప్రయోజకులయిన పౌరాణిక మునులలాగ. మంచివాళ్ళేపాపం, కాని దారీతెన్నూతెలీక కాలంప్రాణం వృధాచేసుకున్నారు. ఈ టెర్రరిస్టులయినా మధ్యతరగతి మనుషులుకాబట్టి వాళ్ళకు ఈపాటి ఆదరణఅయినా లభిస్తుంది. కాని కిసాన్ సంఘాలకూ కార్మికసంఘాలకూ జాతీయోద్యమంలో వున్నపాత్ర ప్రస్తావనకు గూడ రాదు.

కాని నిజానికి భారత జాతీయోద్యమం ఒకేఒక ప్రవాహంకాదు. అందులో ఎన్నో పాయలున్నాయి. పోనీ ఆ పాయలన్నింటినీ ఒకప్రవాహంలోకి తెచ్చినఘనతన కాంగ్రెస్‌కు దక్కుతుందా అంటే అదీలేదు. ప్రవహింపజేయడం అటుంచి ఆనకట్టలు కట్టడంలో గాంధీ నిపుణుడు. అసలు ఆ పాయలన్నీ ఒకేప్రవాహం ఎన్నడూ కాలేదు వివిధ ప్రాంతాలలో స్థానికంగా వివిధవర్గాల ప్రజలు ఎన్నోతిరుగుబాట్లు చేసారు. చాలాసార్లు కాంగ్రెస్‌తో ప్రమేయంలేకుండ చేసారు. ఒక్కొక్కసారి కాంగ్రెస్‌ను కాదనిచేసారు. ఒక్కొకసారి కాంగ్రెస్‌జెండాకిందే కాంగ్రెస్ అహింసా సత్యాగ్రహ సిద్ధాంతాలను పక్కనపెట్టి తమఇష్టంవచ్చినట్టు పోరాటం చేసారు 1930 ఏప్రిల్ నెలలో చిటగాంగ్ ఆయుధాగారంమీద సాయుధంగా దాడి చేసిన టెర్రరిస్టులు, గాంధేయమార్గానికి పూర్తిగా వ్యతిరేకమయిన పనిచేస్తూ 'గాంధీ రాజ్యం వచ్చింది' అన్న నినాదం ఇచ్చారట.

ఈ పోరాటాలలో కొన్నింటిని వ్యతిరేకించే ప్రయత్నం, కొన్నింటిని తన చెప్పుచేతల్లోకి తీసుకొని భూమిపోరాటం, కూలిపోరాటం మాన్పించి రాట్నంతిప్పించే ప్రయత్నం, కాంగ్రెస్‌చేసింది. ఈ ప్రయత్నాలు ఎప్పుడోగాని ఫలించలేదు. మరి కాంగ్రెస్‌పార్టీ ఘనత ఏమిటంటే : వికేంద్రీకృతమయి ముక్కలు ముక్కలుగా చీలిపోయిన భూస్వామ్యసమాజంలో ఒక్క బూర్జువావర్గం మాత్రమే దేశవ్యాపితంగా సంఘటితం కాగలిగింది. జాతివ్యాపితంగా సంఘటితమైన కారణంగా జాతికి నాయకత్వం వహించగలదనే భ్రమకలిగించింది. చాలామందిని ఆకట్టుకోగలిగింది. అక్కడక్కడ బలమయిన స్థానిక ప్రజాపోరాటాలను నడిపిన చాలామంది తమ పోరాటాలను దేశవ్యాపితం ఎలాచేయాలో తెలీక వాటిని కాంగ్రెస్‌చేతులలో పెట్టారు. అంతమాత్రంచేత కాంగ్రెస్‌చరిత్రే జాతీయ ఉద్యమచరిత్ర అంటే పూర్తిగాతప్పవుతుంది. కాంగ్రెస్ చరిత్రలో ఇమడనివి, ఒక ప్రత్యామ్నాయ ప్రవాహంగానడిచి

జాతివ్యాప్తంగా ప్రజాసంఘటనను సాధించలేకపోవడంవల్ల వట్టిపోయినవి, ఎన్నో ఉద్యమాలున్నాయి. వాటిలో 'టెరరిస్ట్' ఉద్యమం ఒకటి. ('టెరరిస్ట్ అన్నది నిందావాచకమే. కాని యశ్‌పాల్‌ద్వారా భుజంగరావుగారుచేసిన 'దౌర్జన్యవాదం' అనే అనువాదం అంతకంటె మెరుగ్గాలేదు. కాబట్టి ఇంగ్లీష్‌మాటనే ప్రయోగిస్తాను.) 1890నుండి 1935 వరకు సాగిన టెరరిస్ట్ ఉద్యమంలో రెండుతరాలున్నాయి. 'సింహావలోకనం' రెండవతరం ఆత్మకథ.

టెరరిస్టులలో మొదటితరానికీ రెండవతరానికీ చెప్పుకోదగ్గ తేడాలున్నాయి. మొదటితరం టెరరిస్టులు హిందూమత అభిమానులు. పరమతద్వేషులుగూడ. గత కాలంలో ఒక ఉన్నతమయిన హైందవసంస్కృతిని ఊహించుకొని ఆ సంస్కృతిని ముస్లింలూ ఇంగ్లీష్‌వాళ్లూ నాశనంచేసారని భావించిదాన్ని పునరుద్ధరించడానికి వాళ్లు ప్రయత్నించారు. వాళ్ల 'వందేమాతరం' నినాదంలో ఈనాడేకాదు ఆనాడుకూడ జాతీయతఎంతవుందో హైందవ దురభిమానం అంతవుంది. రెండవతరం టెరరిస్టులకు మతంపట్టింపులేదు. వాళ్ళలో ప్రముఖులు (భగత్‌సింగ్, యశ్‌పాల్, భగవతీ చరణ్, చంద్రశేఖర్ ఆజాద్, తదితరులు) నాస్తికులు. మార్క్సిస్టు భౌతికవాదం పట్ల మొగ్గుచూపారు. అంతేకాదు. మొదటితరం ఎక్కువగా సంపన్నవర్గాలనుండి వచ్చింది. తూర్పుబెంగాల్‌కుచెందిన 'అనుశీలన్', 'యుగాంతర్' (జు) బృందాలు అప్పటి టెరరిస్టుగ్రూపులలోకి పేరుకెక్కినవి. తూర్పుబెంగాల్‌లో రైతులు అత్యధికంగా ముస్లింలు, జమీందార్లు హిందువులు. 1890 నాటికి జమీందార్లలో చాలామంది చితికిపోయి తమ హోదాను, దర్జాను, నిలుపుకోలేకపోయారు. ఈ జమీందారీ భూస్వామ్య కుటుంబాలనుండి వచ్చినవారే మొట్టమొదటి బెంగాల్ టెరరిస్టులలో అత్యధికభాగం. రెండవతరం శ్రామికవర్గంనుండి వచ్చిందని చెప్పలేంగాని, చాలావరకు దిగువమధ్యతరగతి వ్యక్తులను ఆకర్షించగలిగింది. మొదటితరానికి వ్యక్తిగత హింసావాదమేతప్ప ప్రజాఉద్యమాలతో సంబంధంలేదు. వాళ్లలో కొందరిలో ప్రజావ్యతిరేక భావాలుగూడ వుండేవి. జాతీయఉద్యమంలో భాగంగా రైతులకు కౌలు నిరాకరణ కార్యక్రమాన్ని ఇవ్వడాన్ని అరవిందఘోష్ స్పష్టంగానిరాకరించాడు. ఎందుకంటే అది జమీందార్ల అవసరాలకు వ్యతిరేకం కాబట్టి అన్నకారణంచూపాడు. రెండవతరం టెరరిస్టులు తమపద్ధతుల కారణంగా ప్రజాఉద్యమాలతో సంబంధాన్ని నిలుపుకోలేకపోయారుగాని, మొదట్లో ప్రజాఉద్యమాలతో సంబంధంఉన్నవారే. దృక్పథంలోమాత్రం వాళ్ళది చివరిదాకా ఖచ్చితమయిన శ్రామికవర్గ దృక్పథం.

రైతుకూలీరాజ్యాన్ని తమ ఆదర్శంగా చాటుకున్నారు. వాళ్ల నిరసనతెలపడానికి ఎంచుకున్న అంశాలుగూడ వాళ్ళ ప్రజాస్వామిక దృక్పథాన్ని చాటుతాయి. 1929లో వాళ్లు బ్రిటిష్‌ప్రభుత్వం చట్టరూపం ఇవ్వబోతున్న రెండుబిల్లులపట్ల నిరసన తెలుపుతూ ఢిల్లీఅసెంబ్లీలో బాంబులువేస్తారు. ఆ బిల్లులలో ఒకటి నాసావంటి Public Safety Bill, రెండవది కార్మికుల సమ్మెహక్కును నిర్బంధించే Trades Disputes Bill.

ఈ తేడాలన్నిటికీగూడ భగత్‌సింగ్ చక్కటినిదర్శనం. భగత్‌సింగ్ జాట్ సిక్కుకులస్థుడు. జాట్ అన్నపదం తెలుగులో 'కాపు' లాంటిది. అదిఒక కులాన్నీ సూచిస్తుంది, రైతుఅన్న అర్థమూఇస్తుంది, భగత్‌సింగ్‌ది పశ్చిమ పంజాబులోని హోషియార్‌పూర్ జిల్లానుండి లయాల్‌పూర్ జిల్లాకు వలసవచ్చిన రైతుకుటుంబం ఆరోజులలో (అంటే 1920 ప్రాంతంలో) పశ్చిమ, మధ్య, పంజాబ్ లలోని జలంధర్, హోషియార్‌పూర్, లయాల్‌పూర్, అమృతసర్ జిల్లాలలో ఒక బలమైన సిక్కురైతాంగఉద్యమం నడిచింది. రూపంలో ఇది మతసంబంధమయిన ఉద్యమం, ఎందుకంటే సిక్కుల గురుద్వారాలను అవినీతిపరులయిన మహంత్‌ల చేతులనుండి రక్షించి ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలన్నది ఈ ఉద్యమంయొక్క ప్రధానమయిన మయిన డిమాండు. అయితే ఆ మహంత్‌లు మతంపేరుచెప్పి బాగాబలిసిన భూస్వాములు కావడంతో ఈ 'గురుద్వారా' లేక 'అకాలీ' ఉద్యమానికి రైతాంగ పోరాట స్వభావం బలంగావుండింది. 1921 నాటికి ఈ ఉద్యమం తీవ్రరూపం తీసుకొని శిస్తునిరాకరణ, వడ్డీవ్యాపారస్తులపై దాడులు, మొదలయిన పోరాటరూపాలను అవలంబించింది. టెర్రరిస్టు పద్ధతులనుగూడ అనుసరించింది. ఈ ఉద్యమంలో భగత్‌సింగ్ తండ్రి కిషన్‌సింగ్ చురుగ్గాపాల్గొన్నట్టు యశపాల్ చెప్తాడు. సరిగ్గా అదే సమయంలో రౌలట్‌బిల్లుకు వ్యతిరేకమయిన ఉద్యమం, గాంధీగారి ప్రథమ సహాయనిరాకరణ ఉద్యమం రావడంతో ఆ 'కాంగ్రెస్' ఉద్యమాలు పంజాబులో అత్యంత బలమయిన ప్రజాఉద్యమాల రూపంతీసుకున్నాయి. కాంగ్రెస్ కళ్ళకు ఇదంతా గాంధీగారి మహిమగాఅనిపించినా ఆశ్చర్యంలేదు, కాని వెనకవున్న సిక్కురైతాంగ ఉద్యమాన్నీ, అంతకుపూర్వంనుండివున్న గదర్‌పార్టీ ప్రభావాన్నీ, లెక్కలోకి తీసుకోకపోతే అప్పటిపంజాబ్‌లోని జాతీయ ఉద్యమం తీవ్రత అర్థంకాదు. భగత్‌సింగ్ తన తొమ్మిదవతరగతి చదువుమానుకొని సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1922లో చౌరీచౌరాదాటి ఫలితంగా గాంధీ సహాయనిరాకరణ ఉద్యమాన్ని విరమించుకున్నాడు, కాని పంజాబులో సిక్కురైతాంగ ఉద్యమంమాత్రం ముందుకుసాగింది.

అప్పుడు భగత్‌సింగ్ 'అకాలీ' అయ్యాడు. జుట్టుపెంచుకొని ఖడ్గంధరించి గురుద్వారాఉద్యమంలో పాల్గొన్నాడు. అయితే ఆ ఉద్యమం ముగిసిన తరువాత మళ్లీ ఎన్నడూ మతసంబంధమయిన ఆసక్తి చూపలేదు.

యశపాల్ గూడ మధ్యతరగతి రాజకీయకుటుంబానికిచెందిన వ్యక్తి ఆరోజులలో పంజాబీ అగ్రవర్గహిందువులమీద ఆర్యసమాజం ప్రభావం చాలావుండేది. ఆర్యసమాజం తాత్వికదృక్పథం ఎలాగున్నా, దానికి బ్రిటిష్‌వ్యతిరేక జాతీయస్వభావం ఉండేది. యశపాల్ తల్లి ఆర్యసమాజంలోను కాంగ్రెస్‌లోను కొంతకాలంపనిచేసింది యశపాల్ గూడ ఆర్యసమాజంవారి 'గురుకులం'లో మిడిల్‌స్కూల్‌దాకా చదువుకున్నాడు. అయితే భగత్‌సింగ్‌మీద అకాలీప్రభావం ఎంతదూరం నిలిచిందో యశపాల్‌మీద ఆర్యసమాజం ప్రభావం అంతే.

ఇద్దరుగూడ 1919-22 మధ్యకాలంలో ఖిలాఫత్ ఉద్యమంలోనూ సహాయనిరాకరణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. యశపాల్ ఉపన్యాసకుడయ్యాడు. వీళ్లిద్దరిలాగే ఎంతోమంది ఇల్లూవాకిలీవదలి ఉద్యమంలోకిదిగారు. 1922లో గాంధీ చౌరీచౌరా సంఘటనకుబెదిరి ఉద్యమాన్ని విరమించడంతో అందరుగూడ సందిగ్ధంలోపడ్డారు. "ఉత్సాహంగా ముందుకు ఉరుకుతున్నప్రజలలో నిరాశానిస్పృహలు వ్యాపించాయి. ఎందరోకార్యకర్తలు ఆంగ్లప్రభుత్వంతో తుదిపోరాటాన్ని సాగించడానికి ఇల్లూవాకిలీ వదిలి ఉద్యమంలోకి దూకారు. ఘోరనిరాశతోవాళ్లు దిక్కుతోచనిస్థితిలోపడ్డారు. ఇంక కాంగ్రెస్‌అంటే ఖద్దరునూ అహింసనూ ప్రచారంచేయడమేనాబోలు అన్నభావన కార్యకర్తలలో వ్యాపించింది. కార్యకర్తలను గ్రామాలకువెళ్లి కాంగ్రెస్ ఆదర్శాలను ప్రచారంచేయమన్నారు. ఖద్దరుప్రచారం చేయమన్నారు. కాంగ్రెస్‌మీద, గాంధీమీద, పూర్తి విశ్వాసాన్నిఉంచి ఖద్దరు ధరించితే, స్వరాజ్యం దానంతటదే వస్తుందన్నారు. ప్రజలు నిఖార్సయిన హిందూ ముస్లిం సిక్కుమతస్థులు కావాలన్నారు ఇవన్నీజరిగిననాడు స్వరాజ్యం వచ్చినట్టేనన్నారు."

గాంధీ ఈ ఎత్తుగడల్ని అవలంబించడం ఇది మొదటిసారేగాని కడసారికాదు. ఉద్యమానికి పిలుపివ్వడం, కొంతకాలం ఉద్యమాన్నిపెరగనివ్వడం, ఆ బెదిరింపుతో బ్రిటిష్ ప్రభుత్వం నుండి రాయితీలు సంపాదించడం, హఠాత్తుగా ఉద్యమాన్ని విరమించి కార్యకర్తలను రాజకీయాలు వదిలిపెట్టి అహింస, ఖద్దరు, మతసామరస్యం, దీనజనోద్ధరణ, మొదలయినవి ప్రచారంచేయమని గ్రామాలకు పంపడం-ఇదీ గాంధీ అవలంబించిన వ్యూహం. ఈ వ్యూహాన్ని కార్యకర్తలు ఎంతవరకు ఆమోదించారు?

"కార్యకర్తలకు కాంగ్రెస్ నాయకులు చెప్పిన పై విషయాలలో నమ్మకమూలేదు, ఆసక్తీ లేదు. కార్యకర్తలు విరామానిస్పృహల్లో తమలోతాము అనేకవిధాలతర్కించుసే వారు. ఇల్లూవాకిలీవదిలి తాము ఇలావచ్చింది మతప్రచారంచేయడానికా, పరప్రభుత్వంతో పోరాడి దేశాన్నిస్వాతంత్ర్యపరచడానికా?" ఎంతోమంది కార్యకర్తలు ఉద్యమాన్నివదిలి, వ్యవసాయమైనాచేసుకోవచ్చునని తమ గ్రామాలకు మరలిపోయారని యశపాల్ అంటాడు.

పోరాటంనిలిపేసిన తరువాత ఏసంస్థఅయినా త్వరలో దిగజారిపోతుంది. నాయకత్వం పిలుపునందుకొని కొంతమంది కార్యకర్తలతోకలిపి యశపాల్ గ్రామాలు తిరుగుతూ కాంగ్రెస్ ఆదర్శాలను ప్రచారంచేస్తూ ఉపన్యాసాలు ఇస్తాడు కొంతకాలం అయితే ప్రచారం చేయడానికి ఉద్యమంలేనికారణంగా వాళ్ళ ఉపన్యాసాలు త్వరలో రాజకీయాలను కోల్పోతాయి. ఒకడు వెకిలిజోకులువేయడం మొదలుపెడతాడు. మరొకడు మతసామరస్యాన్ని ప్రచారంచేస్తూ హిందువులకోసం 'హరహరమహదేవా' అని, ముస్లింలకోసం 'అల్లాహోఅక్బర్' అని, సిక్కులకోసం 'సత్‌శ్రీఅకాల్' అని, వేరువేరుగా నినాదాలిస్తాడు. యశపాల్ మాత్రం చాలా ఓపిగ్గా భారతదేశాన్ని బ్రిటిష్‌వాళ్లు ఏవిధందోపిడీ చేస్తున్నదీ గణాంకాల సహాయంతో వివరంగాచెప్తాడు. కాని పోరాటంలేని జనం ఆసక్తిచూపరు. చివరికి విసుగొచ్చి యశపాల్ ఉద్యమాన్ని వదులుకొని మళ్లీ చదువుకోవడానికి లాహోర్‌వెళ్తాడు. అక్కడ నేషనల్ కాలేజీలో భగత్‌సింగ్, యశపాల్, సుఖదేవ్, సహాధ్యాయులవుతారు. భగవతీచరణ్ వీళ్ళకు రెండేళ్లు సీనియర్. కాలేజీస్థాపకుడు కాంగ్రెస్ నాయకుడు లాలాలాజపత్‌రాయి వీళ్ళ అధ్యాపకులలో ఒకడు జయచంద్ర విద్యాలంకార్ అనేపాతతరం టెర్రరిస్టు. అప్పటికి పంజాబులో హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీ అనే టెర్రరిస్టుసంస్థవుంది. దాన్ని జయచంద్ర విద్యాలంకార్ తన స్వంతదుకాణంలాగ నడుపుతుంటాడు.

యశపాల్ సాహిత్యకారుడిగా కొంతపేరు సంపాదించుకుంటాడు. ఆ లోపల భగత్‌సింగ్, భగవతీచరణ్, కలిసి 'నౌజవాన్‌భారత్‌సభ' అనే ప్రజాసంఘాన్ని స్థాపిస్తారు. అందులో యశపాల్, ఎహసాన్‌ఇలాహి, సుఖదేవ్ తదితరులు చేరతారు. అది హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీకి ప్రజాసంఘంగా ఉద్దేశించబడింది. ఇటువంటి ప్రజాసంఘాలు పెట్టుకోవడమే టెర్రరిస్టులకు కొత్తపోకడ. ఈ అభివృద్ధిని గుర్తించాల్సిందే, కాని అంతమాత్రంచేత వాళ్లకు పార్టీకీప్రజాసంఘానికీ గల సంబంధాన్ని గురించి స్పష్టమయిన సైద్ధాంతిక అవగాహన ఉందనుకోవడానికి వీలులేదు. నిజానికి

లేపుస్తకాన్నిబట్టిపోతే వాళ్లకసలు సిద్ధాంతసంబంధమయిన కుతూహలం సహితం అంతగా ఉన్నట్టు అనిపించదు.

నౌజవాన్ భారత్‌సభ మొదటినుండీగూడా తనప్రత్యేకతను స్పష్టంచేసుకుంది. దాని ముఖ్యకార్యక్రమం ఏమిటం టే కాంగ్రెస్‌యొక్క దళారీరాజకీయాలను విమర్శించడం, ప్రజలభావాలను 'తీవ్రవాదరాజకీయాలకు' అనుగుణంగా మార్చడం సాయుధపోరాటంపట్ల ప్రజలకు సానుభూతికల్గించడం. అంతేకాకుండ మతసంబంధ మయిన భావాలను విమర్శించడంగూడ ఒక ముఖ్యకార్యక్రమంగా వాళ్లుపెట్టుకున్నారు. పైనచెప్పినట్టు కాంగ్రెస్ జెండు 'మతసామరస్యానికి' అర్థంఏమిటంటే ఏమతం వారిదగ్గర ఆ మతం వినాదాలివ్వడం. నౌజవాన్‌భారత్‌సభలో అందుకు సరిగ్గావిరుద్ధంగా జరిగేది. మతాన్ని విమర్శించడానికి పెట్టేమీటింగులలో ఏ మతంవారు ఆ మతాన్నే విమర్శించాలన్న నియమం పాటించేవారు.

ఆనాటికి టెరరిస్టుసంస్థలన్నీ చాలాబలహీనస్థితిలోవున్నాయి. పాత విప్లవ నాయకులంతా జెయిలులోనో లేక క్రియాశూన్యమయినస్థితిలోనోవున్నారు. టెరరిజంకు సామాన్యగుణమయిన పరస్పరనిందలూ ఆరోపణలూ వాతావరణాన్ని కలుషితంచేసాయి జయచంద్ర విద్యాలంకార్ తన క్రియాశూన్యతను కప్పిపుచ్చడానికి భగవతీచరణ్ మీద 'సిఐడి ఏజెంట్' అన్న ఆరోపణ ప్రచారంచేసాడు.

ఇటువంటి వాతావరణంలో భగత్‌సింగ్ పూనుకొని విప్లవసంఘాన్ని మళ్లీ పునరుద్ధరిస్తాడు. ఢిల్లీ, ఆగ్రా, కాన్పూర్, పాట్నా, కలకత్తానగరాలు తిరిగి విప్లవ మార్గం అంటే ఇష్టంఉన్నవాళ్లందరినీ కలుస్తాడు. 1928 సెప్టెంబర్ 8,9 తేదీలలో ఢిల్లీలో ఒక సమావేశంజరిపి హిందుస్తాన్ సామ్యవాద ప్రజాతంత్రసేన (Hindustan Socialist Republican Army) ఏర్పరచుకుంటారు. ఇది కొత్తతరానికి నాంది అనడానికి చాలాలక్షణాలున్నాయి. ఒకటి, పాతటెరరిస్టు 'దాదా' లెవ్వరికీ ఇందులో స్థానంలేదు. ముందునుండీ సాయుధపోరాటానికి అగ్రగామిగావుంటూ వచ్చిన బెంగాల్‌లోని 'అనుశీలన్', 'యుగాంతర్' బృందాలు HSRA లో చేరనేలేదు. నాయకులంతా (భగత్‌సింగ్, భగవతీచరణ్, ఆజాద్, సుఖదేవ్, తదితరులు) మూడు పదులు నిండనియువకులు. రెండవది 'సోషలిస్టు' అన్నపదం. గతంలోని టెరరిస్టుల ఆధ్యాత్మికవాదంస్థానే ఇప్పుడు సోషలిజం తమలక్ష్యంఅన్న భావన పుట్టుకొచ్చింది. ఈ పరిణామంలో పంజాబు విప్లవకారులు అగ్రభాగాననిలిచారు. దీనికి పంజాబులోని రైతాంగఉద్యమాలు కొంతకారణమయితే, ఎం. ఎన్. రాయ్ 1921లో తాష్కెంట్

లో స్థాపించిన ప్రవాస కమ్యూనిస్టు పార్టీకి పంజాబులోవున్న ప్రభావం కొంత కారణం. భగవతీచరణ్‌కు ఈ పార్టీతో సంబంధాలుండేవి. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ పట్టణానికిచెందిన శివవర్మ, విజయకుమార్ సిన్హా, అప్పటికే కాన్పూర్‌లో సంఘటితమయిన బట్టలమిల్లుల కార్మికులతో సంబంధంఉన్నవారు కావడంవల్ల వాళ్లు గూడ 'సోషలిజం' అన్నమాటకు సుముఖంగావున్నారు. అయితే ఈ కొత్తసంస్థను నిజమయిన విప్లవసంస్థగా భావించడానికి వీలులేదు. అందుకుకారణం యశపాల్ తానేచెప్తాడు. "మేము వర్గవిభేదాల్ని తెలుసుకున్నాము. రైతుకూలీరాజ్యంరావాలని మనసారకోరుకున్నాము. అయితే కార్మికకర్షకుల శక్తిని సంఘటితపరిచి, వర్గపోరాటాన్ని ఉజ్జీవింపజేసే వ్యావహారికపద్ధతి మాకుతెలీదు. మా ఆదర్శం రైతుకూలీరాజ్యమే, కాని మా మార్గం రైతుకూలీలకు సంబంధించిందికాదు". మరి వీళ్ల మార్గం ఏమిటి? "అమాయకులూ అజ్ఞానులూ పీడితులూ అయిన ప్రజలకోసం మేము మా ప్రాణాలను త్యాగంచేయడానికి సిద్ధం అవుతున్నామేగాని, వారిలో కలవడానికీ వారిలో చైతన్యం కలిగించడానికీ సిద్ధంకాలేకపోతున్నాం." ఇవన్నీ యశపాల్ 1951 నాటి తన చైతన్యంతో చెప్పినమాటలు. 1928లో ఈ తేడా తెలిసివుంటే అసలు ఆ లోపం సంభవించివుండేదేకాదు. తమ మార్గం టెరరిజంకాదనీ సాయుధవిప్లవమనీ అన్నారు కాని, ఈ తేడా ఏమిటన్నది అస్పష్టంగానే వుండిపోయింది.

ప్రజాఉద్యమాలనుండి ఈవిప్లవకారుల దూరమెంతో మొదట్లోనే బయటపడింది. కొత్తగాఏర్పడ్డ సంస్థకు డబ్బులుకావాలి. ప్రజాపునాదిలేని విప్లవసంఘాలు డబ్బులకోసం డెకాయిటీలు చేయకతప్పదు మొట్టమొదటి ప్రయత్నం భగత్‌సింగ్ చంద్రశేఖర్ అజాద్ కలిసి బెతియాపట్టణంలోచేసి విఫలమవుతారు. బెతియా ఉత్తరప్రదేశ్‌లో అప్పటికి కనీసం 8 సంవత్సరాలుగా సాగుతున్న కిసాన్ ఉద్యమానికి కేంద్రమయిన జిల్లాలలో ఒకటి. రైతుకూలీ రాజ్యాన్ని ఆదర్శంగాగల విప్లవకారులకు అటువంటిజిల్లాలో డబ్బుసంపాదించడానికి డెకాయిటీతప్ప మార్గంలేదంటే వాళ్ళకు ఆ రైతులనుండి ఆ కూలీలనుండి ఉన్న దూరమెంతో అర్థమవుతుంది.

ఈ విప్లవకారులకు సిద్ధాంతసంబంధమయిన కుతూహలం అంతగా వున్నట్టు లేదన్నాను. తమ సంస్థ ఏర్పరచుకున్నప్పుడు వీళ్లు ఒక మానిఫెస్టోలాంటిదేదీ తయారుచేసినట్టుకనిపించదు. తరువాత కాలంలో ఏదయినా 'చర్య' చేసినప్పుడుగాని, లేక గాంధీ తమమీదచేసిన విమర్శకు సమాధానంగాగాని, రాసినకరపత్రాలే వీళ్లకు మానిఫెస్టోలయ్యాయి. ఆ కరపత్రాలను జాగ్రత్తగ పరిశీలిస్తే, వీళ్లకు సమగ్రమయిన

విప్లవసిద్ధాంతంలేకున్నా, కొన్నివిషయాలలో ఉండవలసిన స్పష్టతఉన్నట్టుతోస్తుంది. 1929 డిసెంబర్ లో వైస్‌రాయి రైలుకింద బాంబుపెట్టినతరువాతరాసిన ఒక కరపత్రంలో తాముచేస్తున్న టెర్రరిస్టుచర్యలకూ నిజమయిన విప్లవపోరాటానికీగల తేడానుగురించి సంబంధాన్నిగురించి ఒక అవగాహనఇస్తారు. "దేశంలోని యువకులు నేడు విప్లవానికి సంసిద్ధులవుతున్నారు. మానసిక దాస్యమ్నుండి, మతపిచ్చి నుండి బయటపడుతున్నారు. ఈ దేశపుయువకులు విప్లవాన్ని అధ్యయనంచేస్తున్నారు. యువకులు విదేశీయుల దాస్యశృంఖలాలుతెంచుకోవడానికి సంఘర్షిస్తున్నారు. ఈ సంఘర్షణల్లోంచి విప్లవజ్వాలలు ప్రజ్వరిల్లుతాయి. ఆ జ్వాలల్లో దోపిడీవిధానంభస్మమైపోతుంది. అన్యాయానికీ, దోపిడీకీవ్యతిరేకంగా యువకుల హృదయాల్లో ప్రజ్వరిల్లిన క్రోధాగ్ని టెర్రరిజంగా అక్కడక్కడా బయటపడుతుంది. ఈ టెర్రరిజం రాబోయే సాయుధపోరాటానికి స్వస్తివాచకం (రచయిత వుద్దేశ్యంలో నాంది పరం అయి వుంటుంది సం.మి.) దీన్ని సంపూర్ణమయిన విప్లవం అనడానికి వీలులేదు. అయితే ఈ టెర్రరిజంను మినహాయించి విప్లవమూ సంభవంకాదు. ఇంతవరకు ప్రపంచంలో సంభవించిన విప్లవాలన్నీ టెర్రరిజంతోనే ప్రారంభమయాయి. టెర్రరిజం దోపిడీదారుల్ని హడలగొడుతుంది. దీనులూ, నిరుపాయులూ అయిన ప్రజలకు ఆత్మవిశ్వాసాన్నీ ఉత్సాహాన్నీ ఇస్తుంది మా ఆదర్శం టెర్రరిజంకాదు. అయితే టెర్రరిజం విప్లవాన్ని ప్రభవింపజేయడానికి సహకరిస్తుంది. విప్లవం ప్రజలకు సామాజిక రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాల్ని ప్రసాదిస్తుంది" ఈ విశ్లేషణలో టెర్రరిజంను సమర్థించే 'అతివాదం' కొంత ఉన్నమాట వాస్తవమేకాని ఒకమౌలికమయిన చారిత్రిక సత్యం గూడవుంది. ప్రపంచంలో చాలావిప్లవాలు టెర్రరిజంతో ప్రారంభమయాయన్నది కాదనలేని వాస్తవం.

ఆచరణమాటకొస్తే వీళ్లలో ఏలోపమున్నా ప్రయత్నలోపం ఉందనిమాత్రం అనలేము. 1928లోనే 'చర్య'లు ప్రారంభించారు. ఆ సంవత్సరంలో సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించమని కాంగ్రెస్ పిలుపిచ్చింది. అలాఇవ్వడానికిగల కారణం, యశపాల్ మాటలలో, "ఎంత బ్రతిమలాడినా, దేబిరించినా తమ పార్టీ సభ్యుడిని ఒక్కణ్ణీ ఆ కమిషన్‌లోకి తీసుకోలేదని కాంగ్రెస్‌వారి బాధ" నౌజవాన్ భారత్‌సభ గూడ సైమన్‌కమిషన్‌ను వ్యతిరేకించింది. అయితే వీళ్లవ్యతిరేకతకుగల కారణం వేరే. "మా అదృష్టాన్ని నిర్ణయించడానికి ఇంగ్లీష్ ప్రభుత్వానికి హక్కు లేదు. అసలు కమిషన్‌ను పంపడానికి వాళ్లెవరు ?" అన్నది వీళ్ల అభ్యంతరం.

లాహోరులో సైమన్‌కమిషన్‌కు వ్యతిరేకంగా ఊరేగింపు జరిగింది. లాలా లజపత్‌రాయ్ ఊరేగింపుకు నాయకుడు. పోలీసులు ఊరేగింపుమీద దారుణంగా లాఠీచార్జీజరిపి ఆయనసుగూడ కొట్టారు. అప్పుడు ఆయన నికార్సయిన కాంగ్రెస్ నాయకుడిలాగ ప్రవర్తించాడు "పోలీసుల అమానుషమయిన లాఠీచార్జీకి నిరసనగా ఊరేగింపుసు విరమించుకుంటాం" అంటాడు. అన్నదొరక్కపోతే నిరసనగా ఉపవాసంఉండే ఫిలాసఫీ ఇది. దీన్ని సత్యాగ్రహం అంటారు. ఆ సాయంత్రం లాఠీచార్జీపట్ల నిరసనగా బహిరంగసభ జరిపితే అందులో లాలాజీ చాలా ఆవేశంగా మాట్లాడాడట. వింటూన్న సుఖదేవ్ యశ్‌పాల్‌తో నవ్వుతూ ఈవిధంగా అంటాడు, "అంతకంటె ఏంచేయగలడు! పొద్దున్న (కోపంవచ్చి) ఊరేగింపుఆపాడు. ఇప్పుడు ఇంకొంచెం కోపంవస్తే ఈసభను మధ్యలోవదిలి వెళ్లిపోతాడు."

అయినా ఆలాఠీదెబ్బలఫలితంగా లాలాజీ 17 నవంబర్ 1928 నాడు చనిపోతాడు. అంతిమ యాత్రలోపాల్గొన్న లక్షలమందిలో నౌజవాన్‌భారత్‌సభ సభ్యులూ వున్నారు. మృతదేహాన్నికాలబెట్టిన తరువాత బ్రిటిష్‌వాళ్లుగాని పోలీసులుగాని ఆరాత్రి చితిని అపవిత్రంచేయకుండ చూడడానికి యశపాల్, భగవతీచరణ్. చలిలో శ్మశానం దగ్గర కాపలా పడుకుంటారు. అంతేకాదు, లాలాజీ మరణానికి ప్రతీకారంగా, లాఠీచార్జీకి బాధ్యుడయిన పోలీస్ అధికారి సాండర్స్‌ను వేశ్లేచంపుతారు. బీహార్‌నుండి చంద్రశేఖర్ ఆజాద్‌గూడ వస్తాడు. అందరూకలిసి పథకంవేయగా భగత్‌సింగ్, రాజగురు అతన్నిచంపుతాడు. కాంగ్రెస్‌పార్టీయొక్క దళారీరాజకీయాలను ఎండగట్టడం ఒక ముఖ్యకార్యక్రమంగాపెట్టుకున్న ఈ విప్లవకారులు, ఒకకాంగ్రెస్ నాయకుడి మరణాన్ని జాతికిదెబ్బగా పరిగణించి ప్రతీకారభారం తమమీదవేసుకున్నారు. ఈ దౌర్జన్యానికి మారుగా వాళ్లకుమాత్రం గాంధీనుండి తిట్లూ నిందలూ తప్ప వేరేవీమీ దక్కలేదు. భగత్‌సింగ్‌ను, రాజగురును, సుఖదేవ్‌ను, సాండర్స్‌ను చంపినందుకు 1931 మార్చి 23న ఉరితీసినప్పుడువాళ్లను కాపాడడానికి గాంధీ ఎటువంటి ప్రయత్నమూచేయలేదు. సరిగ్గా అదేసమయంలో వైస్‌రాయితో ఢిల్లీ ఒప్పందం చేసుకుంటూన్నగాంధీ, కాంగ్రెస్ సత్యాగ్రహులను విడిచిపెట్టాలనీ, ఉప్పుతయారీమీద పన్ను తొలగించాలనీ, షరతులుపెట్టాడేతప్ప ఈ విప్లవకారుల ఉరిశిక్షరద్దుకోసం ప్రయత్నించినట్టు కనబడదని చరిత్రకారుడు సుమిత్‌సర్కార్ అంటాడు.

ఇదంతా తరువాతిసంగతి. వెంటనేమాత్రం భగత్‌సింగ్‌గాని ఎవరుగాని పోలీసులకు దొరకలేదు. తమసంస్థపేరుమీద ఒక కరపత్రంవేసి సాండర్స్‌ను హత్యచేసింది

తామేనని ప్రపంచానికి నిర్భయంగా చాటుతున్నారు. ఎందుకు హత్యచేశారంటే, "ఒకమానవుణ్ణి మరొక మానవుడు దోచుకోవడానికి వీలులేని న్యాయసమ్మతమయిన సాంఘిక రాజకీయ వ్యవస్థకోసం మేము క్రాంతిని ఆవాహన చేస్తున్నాము" అన్నారు. ఇది ఆదర్శమేగాని, దీనికి కావలసిన సిద్ధాంతంగాని వ్యూహం ఎత్తుగడలుగాని (యశపాల్ భాషలో 'వ్యవహారపద్ధతి') లేకపోవడంవల్ల సాండర్స్‌ను హత్యచేసిన తరువాత జనంలోకలిసిపోయే అవకాశంలేక చెట్టుకొకరూ పుట్టకొకరూ అయ్యారు. అయిన తరువాత మళ్ళీ ఒకదానితరువాత ఒకటి ఇటువంటి 'చర్యలు' చేయడంతప్ప ప్రజాఉద్యమ ప్రత్యామ్నాయం వాళ్ళకులేదు. ఎప్పుడో ఒకప్పుడు అందరూ పట్టుబడీ ఉద్యమం మూతపడకాతప్పదు.

పంజాబునుండి పరారై అందరూ ఆగ్రా చేరుకుంటారు. అక్కడ తమ రెండవ 'చర్య'ను నిర్ణయించుకుంటారు. 1929లో బ్రిటిష్ ప్రభుత్వం Public safety bill అని, Trader disputes bill అని, రెండుబిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. వాటిని కాంగ్రెస్‌నాయకులు వ్యతిరేకించినప్పటికీ వైస్‌రాయి తన ప్రత్యేక వీటో అధికారంతో ఆమోదించబోతున్నాడు. ఆనాడు అసెంబ్లీలో బాంబులువేసి ఆ శాసనాలపట్ల ప్రజల అసంతృప్తిని వ్యక్తపరచాలనీ, అసెంబ్లీలో కూర్చున్న కాంగ్రెస్‌నాయకుల నిష్ప్రయోజకత్వాన్ని ఎండగడుతూ కరపత్రంవేసి అదే సమయంలో అసెంబ్లీలోకి విసిరివేయాలనీ, అక్కడినుండి పారిపోకుండ అరెస్టయి విచారణ సమయంలో తమ ఆదర్శాలను ప్రజలకు వివరించిచెప్పాలనీ నిర్ణయించుకుంటారు. ఆపని చేసేబాధ్యత భగత్‌సింగ్‌కూ బటుకేశ్వరదత్తుకూ ఇవ్వబడుతుంది. అసెంబ్లీలో బాంబువేయాలంటే ఎవరిమీదవేయాలి అన్నప్రశ్న తలెత్తుతుంది. బ్రిటిష్ ప్రభుత్వప్రతినిధి అయిన హోంమెంబరుమీదవేస్తే అతనికి బాగాదగ్గరగా కూర్చునే మోతీలాల్‌నెహ్రూ, విఠల్‌భాయిపటేల్‌లకుగూడ ప్రాణాపాయం కలుగుతుంది. కాబట్టి బాంబు ఎవ్వరిమీదావేయకుండ వెనుకనున్న గోడమీదికి వేస్తారు. వేస్తూ, "విప్లవం వర్ధిల్లాలి! సామ్రాజ్యవాదం నశించాలి!" అని నినాదాలిస్తారు ఎట్లాగూ జెయిలుకు పోదల్చుకున్నారు కాబట్టి, బ్రిటిష్ హోంమెంబరునూ ఇద్దరు ముగ్గురు ప్రముఖ కాంగ్రెస్ నాయకులనూ చంపిఉండవచ్చును కాని వాళ్లు కాంగ్రెస్‌ను దళారీ రాజకీయపార్టీగా ఎంచిగూడ తమ ప్రత్యర్థిగానేతప్ప శత్రువుగాచూడలేదు.

ఆ తరువాత భగత్‌సింగ్ బటుకేశ్వరదత్తులు అరెస్టుకాగా తక్కినవాళ్లు 'చర్య' గురించి ప్రయత్నాలు మొదలుపెట్టారు. వైస్‌రాయివెళ్తున్న రైలుకింద బాంబుపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ బాధ్యత యశపాల్‌ది. చాలాప్రయాసపడి 1929 డిసెంబర్ నెలలో ఈపని చేయగలుగుతారు. కాని వైస్‌రాయిచావడు. కొద్దిలో తప్పించు కుంటాడు. గాంధీ ఈ ప్రయత్నాన్ని దూషించడం, భారతీయులకు మిత్రుడయిన వైస్‌రాయి ప్రాణాలుకాపాడినందుకు భగవంతుడికి ధన్యవాదాలు తెల్పడం, మాత్రమే కాక తనపరపతినంతా ఉపయోగించి లాహోర్ కాంగ్రెస్ మహాసభలో అతిస్వల్ప మెజారిటీతో ఈ చర్యను ఖండించే తీర్మానం చేయిస్తాడు. తన 'యంగ్ఇండియా' పత్రికలో, బాంబులను ఆరాధించే వాళ్లుగా ఈ విప్లవకారులను విమర్శిస్తూరాస్తాడు. దానికి సమాధానంగా చంద్రశేఖర్ ఆజాద్ పేరుమీద విప్లవకారులు ఒక కరపత్రంతీసి పంచుతారు. అందులో చాలావిషయాలు స్పష్టంచేస్తారు. "విప్లవం అంటే మా ఉద్దే శ్యంలో ఒక్కపరప్రభుత్వంతో పోరాడడం మాత్రమేకాదు. మా విప్లవానికి ఆదర్శం న్యాయసమ్మతమైన ఒక కొత్తసమాజాన్ని స్థాపించడం. పెట్టుబడిదారీవిధానాన్ని నాశ నంచేసి వర్గరహితమయిన సమాజవికాసానికి దోహదంచేయడం విదేశీయుల దోపిడీ నుండి, దేశీయుల దోపిడీనుండి, ప్రజల్నికాపాడి వారికి స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వడం మా విప్లవానికి ఆదర్శం. దోపిడీదారుల్ని అధికారచ్యుతుల్నిచేసి శాసనాధి కారాన్ని రైతులకూ కూలీలకూఇవ్వడం మా ఆదర్శం. రైతుకూలీ ప్రజారాజ్యాన్ని మేము కోరుతున్నాము." కాంగ్రెస్ పాత్రనుగూడ ఈ కరపత్రంచక్కగా అంచనా కట్టింది. "కాంగ్రెస్ ప్రజలలో స్వాతంత్ర్యేచ్ఛను కలిగించిందని మేమూ ఒప్పు కుంటాము....కాని ఆసంస్థమీద దళారీరాజకీయాలను అభిమానించే నాయకుల ప్రాబల్యం ఎక్కువయింది. కాంగ్రెస్ చెప్పే అహింస విదేశీపాలకులతో రాజీబేరా లకు దిగడానికి ఒక సాకుగా తయారయింది." అన్యాయాన్ని ద్వేషించకుండ న్యాయంకోసంపోరాడడం సాధ్యమనేబూటకాన్ని చక్కగా విమర్శించింది. "ప్రేమిం చినవారితో స్నేహంచేయడం, హింసించినవారిని ద్వేషించిపోరాడడం సర్వసాధారణ మైనవిషయాలు. ద్వేషంకారణంగానే పోరాటాలు సంభవిస్తాయి. సర్వసాధారణమయిన ఈ నియమానికి విరుద్ధంగా దేశప్రజలకు ప్రేమతో స్వాతంత్ర్య పోరాటాన్ని పోరా డండి అనిచెప్పడంలో అర్థంలేదు. అన్యాయానికి ప్రతిగా పోరాడడానికి కావలసింది ప్రేమకాదు, ద్వేషం!" ప్రజలు గాంధీని అనుసరించడానికి కారణం గాంధీ 'ప్రజల మనిషి' కావడం అన్న అభిప్రాయం ఇవ్వాల్టికీ ప్రచారంలోవుంది. దానికి 50 ఏళ్ళ

నాడే ఈ కరపత్రం సమాధానం ఇచ్చింది. "గాంధీగారు గడిచిన పాతిక సంవత్సరాల తన రాజకీయ జీవితంలోనూ ప్రజలు అహింసాసిద్ధాంతాన్ని అధికారికంగా స్వీకరించడాన్ని గమనించానని చెప్పారు. దేశప్రజలకు గాంధీగారిమీద భక్తివుంది. శ్రద్ధవుంది. అందుకు అనుమానంలేదు. అంతమాత్రానికి దేశప్రజలందరూ గాంధీగారి రాజకీయ సిద్ధాంతాల్ని అనుసరించేవారనుకోవడం పొరబాటు ఈ దేశప్రజలలో ఎక్కువమంది అశిక్షితులు. వారికి ఏ రాజకీయాలూపట్టవు. ప్రజలు గాంధీగారిని ఆధ్యాత్మిక శక్తి సంపన్నులయిన మహాపురుషులుగానే చూస్తున్నారు. గాంధీగారి రాజకీయ అభిప్రాయాలుగాని ఆదర్శాలుగానీ ప్రజలకుపట్టవు." ఇందులో చివరివాక్యం ముఖ్యమయినది. అవతారపురుషులకు అలవాటుపడ్డజనం గాంధీని అవతారపురుషుడిగా భావించారు. ఆయనపేరుచెప్పి సత్యాగ్రహంచేసింది కొంతరయితే మిగిలినవాళ్లు పోలీస్‌స్టేషన్లపై దాడిచేశారు, భూస్వాములగోదాములు కాలబెట్టారు, అటవిచట్టాలకు వ్యతిరేకంగా అడవులునరికారు, వడ్డీవ్యాపారస్తులపై దాడిచేసి అప్పుకాగితాలు కాలబెట్టారు—'గాంధీబాబా' పేరుచెప్పి, 'గాంధీబాబాచేయమన్నాడ'ని చెప్పి, ఆయన చేయొద్దన్నపనులన్నీచేశారు. గాంధీ భారతజాతీయతకు ఒకసంకేతం, ఒక మంత్రం అయ్యాడు. ఇందులో గాంధీగొప్పతనం వేరేఏమీలేదు, నెహ్రూతదితరులలాగ పాశ్చాత్యవేషభాషలకు పోకుండ ఫకీర్‌వేషంవేసుకొని ఆధ్యాత్మికపు మాటలు మాట్లాడడంద్వారా ప్రజలభ్రమలకు వస్తువు (object) కాగలిగాడు. 1920ల వరకు ఒక్కగాంధీయేకాదు, రైతాంగ గిరిజననాయకులంతా సన్యాసులూ ఫకీర్లూ బాబాలే. ప్రజల దృష్టిలో అవతారపురుషులే. గాంధీ సమకాలికులనే చెప్పుకోవాలంటే, బాబా రాంచంద్ర, స్వామిసహజానంద, అల్లూరిసీతారామరాజు, అందరూ ఈ కోవకుచెందినవారే. 1930 తరువాత, కమ్యూనిస్టులు రైతాంగఉద్యమాలలోకి పోయినాకనే 'అవతారపురుషుల' కాని రైతాంగనాయకులు వచ్చారు మరిమిగిలిన 'అవతారపురుషులు' విఫలమయినచోట గాంధీ ఎందుకు విజయాన్ని పొందగలిగాడంటే దానికిగూడ ఒకటే కారణముంది. వాళ్లంతా ప్రజల వెనుకబాటుతనాన్ని ప్రజలకోసమే వాడుకున్నారు. అది సాధ్యమయ్యేపనికాదు. గాంధీ ప్రజలవెనుకబాటుతనాన్ని బూర్జువావర్గ ప్రయోజనాలకోసం వాడుకున్నాడు. అది బహుచక్కగా సాధ్యమని గాంధీయేకాదు, ఆయన వారసులుగూడ నిరూపించారు.

వైస్రాయిమీద చేసిన ఈప్రయత్నంతో హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ చరిత్ర ముగిసినట్టే చెప్పుకోవచ్చు. అందరూ పరారవుతారు. బాంబులుతయారు చేయడానికి ఇక్కడా అక్కడా ఫ్యాక్టరీలు పెడతారు. ఒక్కొక్కరే పోలీసులకు లొంగిపోవడం మొదలవుతుంది. కొందరు అప్రూవర్లు అవుతారు ఇతరులు పరస్పర అనుమానాలతో ఆరోపణలతో విచ్ఛిన్నంఅవుతారు. భగత్‌సింగ్‌ను, రాజ గురును, సుఖదేవ్‌ను ఉరితీస్తారు. చేతిలో బాంబుపేలి భగవతీచరణ్ చనిపోతాడు. చంద్రశేఖర్ అజాద్ పోలీసులతో ఒక పార్కులో 'ఎదురుకాల్పులు' జరిపి చివరి గుండుతో తన్నుతాను పేల్చుకొని చనిపోతాడు. యశపాల్ అరెస్టయి 14 సంవత్స రాల జైలుశిక్ష పొందుతాడు. అంతటితో ఆ ప్రవాహం సమాప్తం. ప్రజలతో సంబంధంలేకుండ, మతోన్మాదంతో బయలుదేరిన టెరరిజం మతాన్నివదిలిపెట్టి నాస్తికదృక్పథాన్నీ సోషలిస్టు ఆదర్శాన్నీ సంతరించుకొని ప్రజాపునాదికోసం వెతు క్కోవాలని రెండవతరంలో గుర్తించింది. కాని ఆ అన్వేషణ పూర్తికాకముందే ఆ ప్రవాహం ఎట్టిపోయింది. 1938లో, కాంగ్రెస్‌మంత్రులు రాష్ట్రాలలో అధికారం లోకి వచ్చినతరువాత, విప్లవకారులను జైళ్లనుండి వదిలిపెడతారు. హింసామార్గాన్ని వదిలిపెట్టాలన్న షరతుపెట్టే ప్రయత్నం చేస్తారుగాని యశపాల్ వంటివాళ్ల ప్రతి ఘటించడంతో బేషరతుగా వదిలిపెడతారు. బయటికివచ్చిన విప్లవకారులు తమ ఉద్యమం ఏమయిందని ఆలోచించుకుంటారు. తమలక్ష్యాలకూ కమ్యూనిస్టుపార్టీ లక్ష్యా లకూ తేడాలేదని గుర్తిస్తారు. హిందుస్తాన్ సోషలిస్ రిపబ్లికన్ ఆర్మీరద్దయింది. యశపాల్ సాహిత్యకారుడిగా కమ్యూనిస్టులకు చాలా సన్నిహితుడవుతాడు. మరొక టెరరిస్టు నాయకుడు అజయ్‌ఘోష్ కమ్యూనిస్టుపార్టీలోచేరి తరువాతకాలంలో కమ్యూ నిస్టుపార్టీ కేంద్రకమిటీ కార్యదర్శిగూడ అవుతాడు.

— కె. బాలగోపాల్

సింహావలోకనం, భారతస్వాతంత్ర్య సాయుధపోరాట ప్రామాణికగాథ-యశ్ పాల్, అనువాదం, ఆలూరిభుజంగరావు. మూడుభాగాలు, 204, 282, 326, పేజీలు, వెల రు. 10-00, 11-00, 13-00. 1/8 క్రౌన్ ప్రచురణ/ప్రతులకు రాహుల్‌సాహిత్యసదనం గుడివాడ, కృష్ణాజిల్లా.

బోధివృక్షం

(నాటిక) – బుద్ధుడు

ఇందులో వచ్చు పాత్రలు

1	యస్సయి	వయస్సు 30 సం॥
2	హెడ్డు	" 40 "
3	కానిస్టేబుల్	" 30 "
4	రాఘవరెడ్డి—టీచర్	" 40 "
5	సత్యనారాయణ—టీచర్	" 30 "
6	రామస్వామి—టీచర్	" 28 "
7	వ్యాకరణశాస్త్రి—టీచర్	" 30 "
8	యువకుడు—రాడికల్	" 25 "
9	సర్కార్	(వయస్సుఎంతైనావుండవచ్చు)

(తెరలేచేసరికి ఎదురుగ్గా పోలీసుస్టేషనువరండా కనిపిస్తుంది. ఆ వరండాలో ఓ మూలకి కానిస్టేబులు సిగరెట్టుపీలుస్తూ నిలుచునివుంటాడు. అతడివీపు ప్రేక్షకుల వైపువుంటుంది. అప్పుడు హెడ్డూ, నలుగురువ్యక్తులూ ప్రవేశిస్తున్నారు.)

హెడ్డు: (కానిస్టేబుల్ని ఉద్దేశించి) ఈడనిలబడి పుణ్యానికొచ్చిన సిగిరెట్లుతాగుడేనా! పనిజేశేదేమన్నఉన్నదా?

కాని : (ఇటువైపుతిరిగి) ఇప్పుడేఇట్లవచ్చిన, (నలుగురువ్యక్తుల్ని చూపుతూ) వీళ్లెవరు?

హెడ్డు: బడిపంతుల్లుగనీ! నువ్వుబొయ్యి రాత్రి దెచ్చిన అంజిగాన్ని సూస్కోపో. బాగాకోటింగియ్యమని దొరజెప్పిపోతే నువ్వేమొసిగిరెట్లు గుంజుతానవు?

కాని : ఎన్నిసార్ల కోటింగియ్యాలెవానికి? (ప్రేక్షకులవైపుచూస్తూ) ఐదుగురు పి.సి. లం రాత్రినుంచి వరుసబెట్టిదంచినం. మళ్ళ ఇంకకోటింగు ఏం ఇయ్యాలె? వాడు నరం నరం ఐపోయిండు.

(నలుగురు బడిపంతుళ్లమొహాల్లో భయం, సంభ్రమం కన్పిస్తాయి)

హెడ్డు: (ప్రేక్షకులవైపుతిరిగి) సర్కార్ఉప్పుదిన్నందుకు గింతన్న పనిజెయ్యాలె, నాల్గుదెబ్బలు ఎక్కువగొడితె ఏంబోద్దిరభై? పోయి ఆపనిసూస్కోపో.
(కానిస్టేబులు వెళ్ళిపోయాడు.)

హెడ్డు: (నలుగురు టీచర్లతో) మీరు ఇక్కడ ఫ్రీగవుండొచ్చుసార్! కావాల్నంటె బయటికిపోయి వాలుగూడాతాగిరావచ్చు.

రాఘవ: మంచిది అట్లనే! (తలూపుతాడు)

హెడ్డు: నేనుబోతున్న మీకేంఫికరులేదు (పోతాడు)

రాఘవ: (హెడ్డువెళ్ళినవైపే చూస్తూ) మన లను మంచిగానే చూస్తున్నరనుకోవాలె పోలీసులు!

సత్య : రాఘవరెడ్డిగారూ! ఎంతైనా మనం బడిపంతుళ్లంగాదండీ! మనమేందొంగతనం జేసితిమా, దార్లుగొట్టితిమా? మనఉపాధ్యాయసంఘ కార్యక్రమం ప్రకారం కలెక్టరు ఆఫీసుముందు పికెటింగ్‌జేసినం, అదేమి ఖతల్‌ముఖద్దమా లేక బందిపోటా?

రామ : సత్యనారాయణగారూ చిన్నడౌటు! మరి తప్పేంలేకపోతె ఎందుకునన్ను కున్నరండీ? ఏదో రెండుగంటలులొల్లిజేసి ఇండ్లకు పోవచ్చుననుకుంటె అరెస్టుజేసి తెచ్చిరిగద? ఇయ్యాల మా సడ్డకుడు వచ్చేటిదున్నది. నేను లేకుంటె ఆయినె ఏమనుకుంటడు?

రాఘవ: ఏమండీ రామస్వామిగారు! మీకు మనబతిల పూర్తిస్లు మర్యాదజేసినట్టు జేస్తరనుకున్నరాఏంది? పోలీసుస్టేషనంటె మీకు పూరాగతెల్వనట్టులేదు. మనతోటి కేసు రిజిస్టర్ల సంతకాలుజేయించుకోని లాకప్‌లతోయకుండ ఫ్రీగ వదిలినుర్రి. అదెంతగౌరవమో ఎరికేనా? కాకపోతె వ్యాకరణశాస్త్రిగారిని అడగండి,

వ్యాక : నన్ను అడగటానికేమున్నది? ఈమాత్రం స్వేచ్ఛ ఉంటుందని నేననుకోలేదు. ఇది నిజంగా విచిత్రమే! మనల్ని పెద్దగాపట్టించుకోవటంలేదు.

రామ : ఇంతకు మనం ఏ తప్పుజెయ్యలేదుగదనండీ!

వ్యాక : తప్పుచేశామని ఎవరన్నారు?

రామ : మరి ఎందుకు అరెస్టుజేసినుర్రి?

వ్యాక : పికెటింగ్‌చేశామని అరెస్టుజేశారు!

రామ : అది తప్పా?

వ్యాక : కాదు!

రామ : (ప్రేక్షకుల వైపు తిరిగి) ఏమండీ ఈనేజెప్పేది? జేసింది తప్పుగాదట! మరి తప్పుగాకుంటె అరెస్టులెందుకు? (వ్యాకరణశాస్త్రి వైపు తిరిగాడు)

వ్యాక : ఓహో అదామీ అనుమానం? ప్రభుత్వోద్యోగులను వారివారి పనులలోనికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నాంగదా? అది నేరం. అందుచేత మనల్ని అరెస్టు చేశారు.

రామ : అంటె తప్పు జేశమన్నమాటేగద!

వ్యాక : కాదు

రామ : (రాఘవరెడ్డితో) ఏమండీ నాకు అర్థమైతలేదు మీకైందా?

రాఘవ: అయింది (నవ్వుతూ తలూపాడు)

రామ : (సత్యనారాయణతో) మీకర్థమైతాందా?

సత్య : (నవ్వుతూనే) అయింది.

రామ : నాదేనామట్టిబుర్ర! (తలకొట్టుకొని వ్యాకరణశాస్త్రి కేసితిరిగి) మీకర్థమైందేదో నాబుర్రలోకి ఎక్కించరాదుండ్రి!

వ్యాక : (నవ్వుతూ) ఎందుకంతచికాకు? మనం ఉపాధ్యాయులం కదా? ఓపిక అవసరం తెలియకపోతే చెప్పటానికి, తెలియనిది పదిసార్లువిని తెల్సుకోవటానికీ మనం ఇరిటేట్ కాగూడదు. అదిమన వృత్తిధర్మం!

రామ : అయ్యా! విషయం జెప్పుండ్రి.

వ్యాక : మన ఉపాధ్యాయసంఘం మనస్థితిగతుల్ని మెరుగుపరచటానికి కొన్ని డిమాండ్లను ప్రభుత్వానికి సమర్పించిందికదా! అవి ప్రభుత్వం రు పరిగణనలోకి తీసుకున్నట్టు కన్పించలేదు. అప్పుడు మనసంఘం కార్యాచరణలోకిదిగి మొదటిమెట్టుగా కలెక్టరేట్ ముందు పికెటింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపిచ్చింది.

రామ : ఇదంతానాకెరికే అయితె అదితప్పా?

వ్యాక : కాదు-కాదని చెప్పానుగదా!

రామ : తప్పుగానిదే ఎందుకు అరెస్టుజేసిన్రు?

వ్యాక : అది వాళ్లధర్మం!

రామ : ఏది వాల్లధర్మం?

వ్యాక : చట్టాన్ని ఉలంఘించేవారిని అరెసుచెయ్యడం.

రాము : ఇది నేరంగాదంటేరిగదనండీ?

వ్యాక : కానీ వారి దృష్టిలో ఇది నేరమే.

రాము : ఆ ల్లెట్లయిద్ది?

రాఘవ: కలెక్టరేట్ ను రెండుగంటలసాటు స్తంభింపచేసినంగదండీ? ప్రభుత్వోద్యోగులను వారి విధులనిర్వహణలో ఆటంక పరిచినందుకు చట్టప్రికారం మనం దోషులం.

రాము : మరి నేరంగాదంటె అదెట్ల ?

వ్యాక : రాజ్యాంగం మనకు అంటే ప్రిజలకు కొన్ని హక్కులున్నాయని హామీ ఇచ్చింది. ఆ హక్కుల్ని అమల్లోపెట్టమని అడుగుతున్నవారిని అదే రాజ్యాంగం నేరస్తులు అంటున్నది.

రాము : ఇదేదో తికమకగున్నది గదసార్ !

వ్యాక : తికమక ఏమీలేదు ! మనకు సంఘాలు పెట్టుకునేహక్కున్నది. మాట్లాడే హక్కులున్నాయి. ఐతే ప్రిభుత్వం మనకోర్కెలు తీర్చటంలేదని నిలదీసి అడిగామనుకోండి. అప్పుడు మనసంఘం చట్టవ్యతిరేకమవుతుంది. మన మాటలు రాజ్యాంగ వ్యతిరేకమవుతాయి.

రాము ; అదేందిసార్ ! హక్కులున్నయంటరు. ఉన్నయని అడుగుతె నేరమంటరా?

వ్యాక : అంతేకాదు ! ఇంకొక విచిత్రిమున్నది. మనం ప్రిభుత్వోద్యోగులంకదా ! కాబట్టి ఇతరపౌరులవలె మనభావాలు వ్యక్తీకరించే స్వాతంత్రియం మనకు వుండదు.

సత్య : అంటె మనం ఈ మంది అందరికంటె వేరేవాళ్లమా ?

రాఘవ : అదే ప్రిశ్నించాల్సిన విషయం. భారత పౌరులందరికి ఉన్నహక్కులు ప్రిభుత్వోద్యోగులకు లేవంటే మనం ఈదేశ పౌరులంకాదా ?

వ్యాక : (నవ్వుతూ) మనంఇప్పుడు కొత్తగా అడిగేదేంలేదండీ ! మనలాగేకొందరు ప్రిభుత్వోద్యోగులు ఈ విషయంలో కోర్టుకి వెళ్ళారు.

రాఘవ : నిజంగానా ? అయితే ఏమయింది ?

వ్యాక : ఏమవుతుంది ? సహజంగావచ్చిన హక్కుల్ని కాదని ఎవరంటారండీ ?

పరిశుత్పోద్యోగాల్లో వున్నవారుగూడా వారి వారి రాజకీయ విశ్వాసాలు కలిగి వుండవచ్చునని కోర్టుచెప్పింది.

రాము : అయితే మరి ఇంకేందిసార్ ?

సత్య : అంటె ఇప్పుడుమనలను అన్యాయంగ అరెస్టుజేసినట్టేనా ?

వ్యాక : అంతేకాదు వాళ్లనిర్మింమకున్న కోర్టుతీర్పులు వారేధిక్కరించినట్టు !

రాము : ఏమో ! అంత లొల్లిలొల్లిగున్నది, అసలే ఇయ్యాల మాసడ్డకుడు వస్త నన్నడు. నేను లేకపోతి. ఏమన్న అనుకుంటడో ఏమో ?

(వీళ్లిలా మాట్లాడుతూ వుండగా తెరవెనుక "అమ్మా !" అన్న పెడబొబ్బ వినిపిస్తుంది.

సత్య : ఏందది ?

రాఘవ : ఏమో ! అంతబాగ అరుస్తున్నదెవడో ఎందుకో ?

[హెడ్డు హడావిడిగా ప్రవేశించాడు]

సత్య : ఇదువరదాక అమ్మాఅని ఎవడో ఒర్రిండు ఏందండీ ?

హెడ్డు : వాడు రాడికలోడు. తంతుంటె ఒర్రితాండు !

రాఘవ : ఎవరు తంతాన్రు ?

హెడ్డు : మా కానిస్టేబులే. వానికి తన్నుడంటె ఒగసంబ్రింకాదు. తన్నెటానికి ఎవరు దొరకకపోతె ఆఖరుకు సెకండుషో పిన్మా అయిపోయినంక ఎవన్నన్న దొరికిచ్చుకోని యమజంపుడు జంపుతడు !

వ్యాక : ఎందుకలా తన్నుతాడు ? [మరోసారి కేకలు, తిట్లువినిపిస్తాయి]

హెడ్డు : వానికి జల్దిన యస్సయిగావాల్నని ఉన్నది. ఎవడు బాగ మందిని పీక్క తింటడో వాడు మా డిపార్ట్మెంటుల గొప్పోడు. వానికి జల్దిప్రమోష నొస్తది. అందుకేవాడుగూడ అందర్ని యిర్గతంతడు.

వ్యాక : అది తప్పుకదా ! స్వార్థంకోసం అమాయకుల్ని హింసిస్తారా ?

హెడ్డు : [ఎగాదిగాచూసి నవ్వి] పిచ్చివంతులువయ్యా !

[ఎవరూ ఏమీమాట్లాడరు. తెరవెనుక కొడుతున్నశబ్దాలు, బాధతో అరిచే అరుపులు వినిపిస్తూంటాయి]

హెడ్డు : సార్లూ! అన్నాలుదిన్నరా? మూడుదాటిపోతాంది. పోయితింటరా? తెప్పిచ్చు కుంటరా?

వ్యాక : మేంపోయితింటాము. శ్రీమఏముంది?

హెడ్డు : పోయి తినితాగిరాన్రి, పిచ్చిపంతుల్లు! (లోపలికివెళతాడు లోపలినుంచి వినిపించేకేకలు తిట్లు ఏడుపులు ఆగిపోతాయి)

రామ : రాడికల్స్అంటే ఎవరండీ? పేరువిన్నగని పూర్తిగ విషయంతెలువది.

వ్యాక : ఈ పోలీసుస్టేషన్‌లో ఆముచ్చట్లన్నీఎందుకండీ? ఎవరన్నావిన్నా బాగుండదు (మందలించాడు)

రామ : సరెపోనీయండి ఏమైనాతిందామా? పొద్దటినుంచి ఏమీతినలేదు.

సత్య : తిండిసరేగని ఇంటికెప్పుడుపోతామో? (పచార్లుచేస్తాడు)

రాఘవ: ఇంటికా? పోలీసుస్టేషనుకువచ్చి ఇంటిగూర్చి ఆలోచిస్తె ఎట్లనండీ?

వ్యాక : యస్సాయి అప్పుడనగాపోయి ఇంకారాలేదు, అతడొస్తేగాని ఏసంగతీ తెలియదు (నిట్టూర్చాడు)

సత్య : ఏసంగతి తెలిసేది? (ఆగి అడుగుతాడు)

వ్యాక : మనమీద ఏసెక్షన్ కేసువున్నదోతెలుస్తుంది.

రామ : మనమీదకేసా? కేసుబెట్టి అదాలత్‌సుట్టుదిప్పుతరా? (ఏడ్పుగొంతుతో అన్నాడు.)

వ్యాక : ఏడుస్తావాఏమిటి ఆగు? అరెస్టుచేసినప్పుడు కేసుపెట్టక సన్మానిస్తారా?

రామ : ఎన్నడూ తెలియనివేషం. పోలీసుస్టేషనుసంగతి ఏంతెలుస్తదిసార్ ? మీరంటె అన్నితీర్ల పత్రికలు చదివి తెలుసుకుంటరు. నాకు అశ్రద్ధా లేక పాయె ఓపికాలేదాయె. సైగా ఇయాల మా సద్దకుడువస్తడు. నేనేమొ ఈడనే ఇరికిపోయిన.

[హెడ్డు లోపలినుంచి వస్తున్నాడు]

రాఘవ : రండి హెడ్డుగారూ ఏమీ తోచడంలేదు. ముచ్చట్లుజెప్పున్రి ఏదన్నవింటాం.

హెడ్డు : (నిరాసక్తంగా) ముచ్చట్లేమున్నాయి ? మాకు సచ్చే సావయితాంది, (సిగరెటు అంటిసాడు)

రాఘవ : మీకు నొప్పేందండీ ? పుల్‌పవర్సుంటయిమీకు. మీకు ఎదురేందండీ ?

హెడ్డు : (రాఘవరెడ్డిని సూటిగా చూస్తూ) నాకు ఫుల్‌పవర్సుంటె మీరుఇట్ల బయట ఉండకపోదురు. సెల్‌లకుతోలి కోటింగు ఇద్దును.

రాఘవ : (ఉలిక్కిపడి) అదేమిటండీ ?

హెడ్డు : లేకుంటె ఏందయ్యా ? పర్మాటు సొమ్ముదినుకుంట సర్కార్ వ్యతిరేకంగా మాట్లాడుతరామీరు ? బల్లె పోటాలు జెప్పుండ్రియాఅంటె ఆఫీసులు బందు పెట్టిస్తారు ? (గర్జించాడు)

వ్యాక : ఏమిటండీ మీరుమాట్లాడేది ? మా యూనియన్ పిలుపుప్రకారం చట్టబద్ధంగా మేం పోరాటంజేస్తున్నాం. అదితప్పా ?

హెడ్డు : గౌర్మెంటు ఖిలాఫ్‌మాటయినా, చేతలయినాతప్పే (సిగరెట్ పీలుస్తాడు)

వ్యాక : రాజ్యాంగం అనుమతించిన పద్ధతిలో మేంనడుస్తున్నాం. ఇదితప్పని ఎందు కంటున్నారో నా కర్థంకావటంలేదు.

హెడ్డు : ఏందయో పంతులూ ! నువుపేపర్లుగిట్ల బాగ జదువుతవాఏంది ? సట్టం. రాజ్యాంగం అంటానవు ? అవన్ని పుస్తకాలల్ల ఉంటయి. సట్టప్రకారం ఐతే నీతోటి నేను మాట్లాడనేవద్దు ! మళ్ళీ (సిగరెట్టు పీలుస్తాడు)

వ్యాక : అదేమిటి ? ఒకమనిషి మరోమనిషితో మాట్లాడితే చట్టంవద్దంటుందా ?

హెడ్డు : (సిగరెట్టు ఓసారి పీల్చిపారేసి) పోలీసులు సివిలువాల్లతోని మాట్లాడవద్దయా ! (కాస్త కోపంగా) ముఖ్యంగ స్టేషన్లఉన్నప్పుడు !

రాఘవ : ఎందుకు ? తప్పేంది ?

హెడ్డు : నాకు అదంతతెల్వది మాట్లాడవద్దని అనంతపురంల మాకు ట్రైనింగు అంతే. మాట్లాడినాగూడ తిట్టుకుంటనే మాట్లాడాలె. ఎర్కేనా ? ఏందో పోనీగదాఅని ఎట్లున్నరయా అంటె ఏమోఖలావుమాట్లాడ్తాన్రి ?

రాఘవ : (నవ్వుముఖంపెట్టి) పోనీయండి హెడ్డుగారూ కోపంఎందుకు ?

హెడ్డు : (కోపంగా) లేకపోతె ఏందయా ? అసలుమిమ్ముల బొక్కలతొయ్యాలె. బల్లె పోరగాల్లందరికి మీరేగాడయ్య ఉన్నయిలేనియి నూరిపోసేది ! [రుసరుస లాడాడు]

రాఘవ : [మెల్లగానవ్వుతూ] అట్ల మేమెందుకుజేస్తాం ? ఏది సిలబస్‌లఉన్నదో అదే మేంజెప్పుతంగని అదోటి ఇదోటి ఎందుకుజెప్తాం ?

హెడ్డు : [రెండుచేతులూ పైకెత్తి వెక్కిరిస్తూన్నట్లుగా] అబ్బో ! నాకు తెల్వదనుకోకుని౯ మా యస్పయిగారు ఈ పోలీసునౌకర్ల జేరకముందు కొన్నిరోజులు లెక్చరర్‌గ పనిజేసిండు. ఎర్కైనా ? మీ టీచర్లంత ఏంజెప్తరో ఎట్లజెప్తరో మాకు తెలువదనుకోకుని౯. [వెటకారంగా నవ్వుతాడు]

వ్యాక : [ఆశ్చర్యంగా] లెక్చరర్‌గా పనిచేసి ఇనస్పెక్టరయాడా ? !

హెడ్డు : [హేళనగా] ఏందయో గమ్మత్‌జూసినట్టు మొకంబెట్టినవు ? అసలు లెక్చరర్లందరు పోలీసులో, పోలీసులందరు లెక్చరర్లో ఐతే ఈ బడులు, కాలేజీలు, యూనివర్సిటీలు ఎంత పాయిగుంటయో ఎర్కైనా ? [నడుం మీద రెండుచేతులూపెట్టి నవ్వుతాడు]

వ్యాక : [ముఖం చిట్లించి] అలాకొందరు ఉన్నారుగా చాలదా ?

హెడ్డు : [వ్యాకరణశాస్త్రి మాటల్ని పట్టించుకోకుండా] మాయస్పయి సాబ్ కాలేజీల పనిజేసిండుగదా? అది ఈ నౌకరికెంత అక్కెర కొచ్చిందంటె ఏకాలేజీల రాడికలోడు లొల్లిజేసిండన్నా ఆ కాలేజికి పోవుడు, వాల్లాదకు ఎవరో ఏందో ఆయినెకు ఎరికేగద? లటుక్కున పట్టుడు, తెచ్చుడు, కోటింగిచ్చుడు ! ఓ శానా పెద్దపేరు సంపాయించిండు సారు ! అంత్ల మల్ల పెద్దసదువు ఏంది?-ఎమ్మే-సదివినోడాయె. ఇగజూస్కో ! అయ్యకు శానవిలువున్నది.

సత్య : అప్పవపుసు పొద్దునగూడ సరీగ గమనించలే గని ఇప్పుడు మీరుజెప్తుంటె తెలుస్తున్నది. ఎంతమర్యాద, ఎంతనీటుతనం ! (వెటకారం హెడ్డు గ్రహించలేదు)

హెడ్డు : (నవ్వుతూ) ఆఁ. అదేమరి సారుదగ్గర గొప్పదనం. ఎంతదయగల మనిషంటె మొన్నటిసారి ఆయన మప్టీలఉన్నడు. అప్లరోడెంబడి తిరుగబోయిండు.

రాఘవ : ఎందుకో ? !

హెడ్డు : ఎందుకేంది ? అప్పుడప్పుడట్ల తిరగాల్నయా ! అప్పుడే మంది ఏమనుకుంటాన్రో ఏందన్నది తెలుస్తది.

వ్యాక : ఆ గూఢచారం చెయ్యటానికి వేరేవున్నారుగదా !

హెడ్డు : (అర్థంకాక) ఏంచారు !

రామ : చారుగాదండీ ! గూఢచారంఅంటె సిఐడి గిరీ !

హెడ్డు : అదా ! దాన్నితెలుగులు గూడచారు అంటారు?! అవునూ అప్పటికాన్నుంచి జూత్తాన, ఈనెమాటలన్ని అదోతీర్గ అర్థంకాకుంట వుంటానయేంది ?

రాఘవ : ఆయన పండితుడండీ ! ఆయన భాష మనతీర్గ ఉండదు. బాగ సంస్కృతం కవిత్వం చదివినోడాయె !

హెడ్డు : గట్లజెప్పు ! కవిత్వం జదివింఢా ? ఐతే ఇసుమంటోల్లకు జర పైత్యం గూడ ఉంటది. నేను అప్పుడే అనుకున్న సట్టం, రాజ్యాంగం అంటాంటె అరె వీనికి పుస్తకాలపిచ్చి ఉందిరభై అని. (వ్యాకరణశాస్త్రితో) నిన్ని ప్పుడు కొన్ని ప్రశ్నలేత్తనయా జవాబుజెప్పు ? అగో ఆగోఢమీద ఏంగన బడుతాంది ?

వ్యాక : [అటుచూసి చదివి] మోడల్ పోలీస్ స్టేషన్ అని అక్కడరాసిఉన్నది !

హెడ్డు: అంటేంది ? [నవ్వుతాడు]

వ్యాక : ఆదర్శ పోలీసుస్టేషను అనిఅర్థం (అనిఉలిక్కిపడి) పోలీసు స్టేషన్లలోగూడా ఆదర్శ పోలీసుస్టేషన్లా ? (ఆశ్చర్యపోతాడు)

రాఘవ: (ఆశ్చర్యంగా) ఆదర్శగ్రామం, ఆదర్శపంచాయితీ, ఆదర్శపాఠశాల, ఆదర్శ ఉపాధ్యాయులు విన్నాంగానీ ఇదేమిటి ? (రామస్వామి, సత్యనారాయణ గూడా తెల్లబోయి మొహాలు చూసుకుంటారు)

హెడ్డు: మా స్టేషను అన్నిటికంటె గొప్పది. అందుకే మీరింత మంచిగ ఈడ ఉన్నరు. అగోసూడునిరి. మా యస్సయిగారి టేబులుమీద ఏంరాసివున్నదీ?

రామ : దయచేసి కూచోండి ! అని రాసివున్నది.

హెడ్డు: సూశినవా ? ప్రజలను మేం ఎంతగౌరవిస్తామో ! ఇది ఆదర్శ పోలీసు స్టేషనుగాబట్టి ఆయింత మీరు ఇట్ల ఉండగలిగినురి. లేకపోతె మీకత ఎట్లుండునో !

రామ : (లోపలికిచూస్తూ) దయచేసి కూసోమని రాసినురిగని అక్కడ కుర్చీలెక్కవ గదనండీ ! యాడకూసుంటరు ?

హెడ్డు: (కోపంగా) మేం కూసోమనిరాసినా ఎపడుకూసుంటలేదయా, అందుకే తీనేశినం. (లోపలికి వెళ్తాడు)

రాఘవ: ఏమిటి వీనిధాష్టీకం ? ఏదో మనమీద దయజూపుతున్నట్టు మాట్లాడుతున్నడు.

వ్యాక : ఇదంతజూస్తుంటె ఈ పోలీసుజాతి మానవజాతేనా అనిపిస్తున్నది ?

సత్య : బాగానేవున్నదిగాని, ఈ పోలీసుస్టేషన్ల మనం ఇంకెంతసేపువుండాల్నోఏమో

(లోపల్నుంచి కేకలు, తిట్లు విన్పిస్తాయి. గుండెలవిసేట్టుగా బాధతో అరుపులు వినిపిస్తాయి)

రాఘవ: (జనంవైపుతిరిగి వెటకారంగా) ఆదర్శ పోలీసుస్టేషను ! ఆదర్శపాఠశాలలు పోయి ఇగ ఇవొచ్చినయి !!

[తెరపడుతుంది]

[తెర లేచేసరికి ఒక యువకుడు చిన్న నిక్కరుమీద స్టేజీమధ్య నిలబడి వున్నాడు. అతడికి కుడిపక్కగా ఓ కానిస్టేబులు, ఎడంపక్కగా హెడ్డు నిలుచుని వుంటారు]

[యస్పయి హడావిడిగా ప్రవేశించి హెడ్డూ, కానిస్టేబుళ్లనుద్దేశించి]

యస్ప : ఏమన్న పనిజేస్తున్నరా ? మంతభానీ కొడ్తున్నరా ?

[హెడ్డు కానిస్టేబుల్ సాల్యూట్ చేస్తారు]

హెడ్డు : లేదుసార్ ! ఇదువరదాక అందరికి కోటిగించ్చినం !

యస్ప : నాలుగురోజులకింద తెచ్చినోల్లను ఏంజేసిను ?

కాని : (ఉషారుగా) రోకలిబండలెక్కించినం సార్ !

యస్ప : మరి ఆ దర్గఅవుతలి ఊరోల్లనేంజేస్తిరి ?

కాని ; (సంతోషంతో) ఒకనిఉచ్చ ఒకనికి తాగిచ్చినం సార్ !

యస్ప : (తలాడిస్తూ) మరి అవుతలి ఊరోల్లనేంజేసిను ?

హెడ్డు : వంగబెట్టి వీపుమీద బండలెత్తి పిక్కలమీద గొట్టినంసార్ !

యస్ప : (నవ్వుతూ యువకుణ్నిచూస్తూ) మరివీనికి కోటింగిచ్చినవా ?

కాని ; ఫస్ల్కాస్‌గా ఇచ్చినసార్ !

యస్ప : (నిల్చున్నయువకుణ్ని తేరిపారచూస్తూ) మరి ఏమంత కనబడ్త లేదుగద ఎ ఫెట్టు ? (నిల్చున్నయువకుడు కంగారుగా చూశాడు)

కాని : లేదుసార్ బాగనే తడిచ్చిన !

యస్స : ఇస్తె ఇచ్చినవుగని మల్లజూడాలె వీనిసంగతి. నీకోటింగు వీనికిసాలలేదు. (నవ్వుతూ) తయారుజెయ్యండి ఇంకేంది ?

కానిస్టేబులు, హెడ్డు ఆయువకుణ్ని కిందికితోస్తారు. అతడు దభేల్న నేలమీద బోర్లాపడుతాడు.]

యువ : [బోర్లాపడి తలెత్తి లేవకుండానే] ఇప్పుడే కొడితిరిగద. మల్ల ఇదేంది ?

యస్స : (ఆ యువకుడిముందు గొంతుక్కూర్చుని) మేం ఎన్నిసార్లయినాగూడ కొడుతంగాదుర బిడ్డ ! మాకది ఫండమెంటల్ రైటురా ! (నవ్వాడు. ఇలా మాట్లాడుతుండగానే కానిస్టేబులు గోడకివున్న తాడుతెచ్చి హెడ్డుకిచ్చాడు)

యస్స : (లేచినిలబడి) కానీయండి ! (నడుంమీద చేతులుపెట్టుకుని నవ్వుతున్నాడు)

హెడ్డు : (యువకుడి రెండుకాళ్లు ఒకటగ్గిరచేర్చి వెనక్కివంచాడు. రెండుచేతుల్ని వెనక్కివిరిచి వంచిన రెండుకాళ్లకీ జతచేసి పట్టుకుని కానిస్టేబుల్‌తో) ఊc. గట్టిగముడెయ్యి. అరెసాలే ! కదలకు సక్కగపండుకో ! (యువకుణ్ని గద్దించాడు)

యువ : (గింజుకుంటూ) వద్దు, కొట్టకుని్రి, సంపుతరాఏంది ?

యస్స : (యువకుడి నడ్డిమీదతన్నాడు) సంపుతాముర ? ఎవడ్రి జెప్పింది ? నీ యవ్వ, మీరేగాదుర నిజమైన దేశభక్తులు ! మిమ్ముల్ని జంపుతె గాంధీని జంపినంతపాపం గాదురబిడ్డా ! (కానిస్టేబుల్‌తో గద్దింపుగా) కట్టెయ్యి జల్ది నీగ్గూడ జాలిపుడుతాందాఏంది ?

కాని : (చురుగ్గాకదిలి) అరేయి కదలకుబే లంజొడకా ! (తాళ్లుబిగిస్తాడు)

యువ : (బాధగా) ఇందాకనే వంగబెట్టివీపుమీద యిరుగగొట్టిసుర్రి. మల్లఇదేందిసార్ ?

యస్స : (జాలిగొంతుపెట్టి) ఛీ ఛీ ! కొట్టినకాడనే మళ్ళకొడుతాముర ? సువ్వేసూడు యాడగొడ్తనో ! నాకుతెల్వదారబిడ్డ, ఒక్కదగ్గర్నె ఊకెకొట్టవద్దని ! మా ట్రైనింగు మర్చిపోతాముర ?

యువ : నన్నుఇట్లకొడుతె ఏంలాభంసార్ ? నాకు ఏంతెల్వది. తెలుస్తె ఇన్నిదెబ్బలు తింటనా ? (దీనంగాఅన్నాడు)

యస్స : (హెడ్డుతో) సువుబొయ్యి పనిజూస్కో (కానిస్టేబుల్‌తో) స్టూల్‌తే :
(కానిస్టేబుల్ గబగబ మూలకున్నస్టూల్‌తెచ్చి యువకుడికెదురుగా వేస్తాడు. యస్సయి దానిమీద కూచుంటాడు)

యస్స : ఇగజెప్పు నిమల్మంగ ఇందాం ! (నవ్వాడు)

యువ : నాకేంతెలువదిసార్ ! తెలుస్తె గిన్నిదెబ్బలెందుకుతింట ?

యస్స : (నెమ్మదిగా, ప్రేమగా) నాకుదెల్సురా ! నీకేందెలువదిగని సీతోటి పనులు జేయించెటోల్లుంటరు. గావాల్ల పేర్లుజెప్పు. తప్పువాల్లదిరా నీదిగాదు. నీదేం దిర బిడ్డ ! అయ్యో అన్నో జెప్పుతె జెయ్యనా ? గట్లనే పెద్దోల్లుగదాని వాల్లు జెప్పింది విన్నవు, జేసినవు. వాల్లంతఎవరో జెప్పరాదు ఇపాయె ! (నవ్వాడు కానిస్టేబుల్‌గూడా యస్సయికి తగ్గట్టుగా హావభావాలు ప్రదర్శిస్తూ వుంటాడు)

యువ : సార్ ! మీరు అన్నీ కానియి పోనియి అడుగుతాన్రి. తెలిసినయిజెప్పు మంటె జెప్తగని తెలువనియి ఏంజెప్పాలె ? (వేదనగా అన్నాడు)

యస్స : (నవ్వుతూనే) నీకు ఏంతెల్సు జెప్పు.

యువ : నాకు నాసంగతితెల్సు, ఊరిసంగతితెల్సు. ఊరిలసాగుతున్న దొరలజులుం తెల్సు. (బాధగాకదిలాడు)

యస్స : (చిటికవేసి) అగ్గో అదే అదే ! దొరలజులుం సాగుతాందని ఎరికేగద ? దానికి నువేంజేసినవు ? (నవ్వాడు)

యువ : ఇదేందని అడిగిన ! (అమాయకంగా అన్నాడు)

యస్స : ఎవరడగమన్నరు ? (తెలివిగా మొఖంపెట్టాడు)

యువ : ఎవరు అడుగుమనలే. ఇప్పుడు మీరుకొట్టబోతాంటె ఇదేందని అడుగలేదా ? అట్లనే మనుసులబుట్టింది అడిగిన

యస్స : (ఈడ్చి ముఖంమీదకొట్టి) మనుసుల బుట్టిందార మాఖలొడే. (జాలిగా గొంతుపెట్టి) వట్టిగ మనుసుల ఎట్లబుడుతదిరబిడ్డ ? రాడికల్సునందర్ని పట్టుకోని బొక్కలఎయ్యమని నాకు మా బులెట్ దొర జెప్పిండు. ఆయినె జెప్పింది నేనుజేస్తాన. అట్లనే నీకుజెప్పెటోల్లుగూడ ఉంటరుగాదుర ! (వంకరగా నవ్వాడు)

యువ : తెలువనియన్ని ఎట్లజెప్పాలెసార్ ? ఉకొల్లెజరిగేటియన్ని సూశినం. ఏందయా ఇట్లజెస్తాన్రిఅని అడిగినం. ఇగమమ్ముల రాడికల్సుఅని పేరుబెట్టిన్రి. నిజంఅడుగుతె రాడికలాసార్ ?

యస్పి : (వేళాకోళంగా) ఛీ ఛీ ! నిజంఅడిగెటోల్లదంరు రాడికల్స్ ఎట్లయితరాని ? నేను ఇప్పుడునిన్ను నిజంజెప్పమంటాన. అయితె నేను రాడికల్నైతనా !

యువ : [బాధగా] నిజంగసార్ నాకుఏందెల్వది ! సార్ ! కడుపునొస్తాంది. మీరేమొ ఛాచ్చట్లుబెట్టుకుంటు నిమ్మలంగ కూసున్నరు.

యస్పి : [స్టూల్‌మీంచిలేస్తూ] నీకుబాధయితాంటె సూసుకుంట ఉంటానని ? పరిజల బాధలు తీర్చెటానికేగాదుర మేమున్నది ! నీకు బాధమరిపిస్త అగు !

యువ : [కాస్త నిమ్మళంగా] జరంత కట్లుఇప్పిచ్చుండ్రిసార్ కాల్లుచేతులు బాగగుంజు తానయి. ఉః (మూలిగాడు)

యస్పి : అరేయి లష్మిరెః ! ఒకగీతను చిన్నగజెయ్యాల్నంటె దానిపక్క పెద్దగీత గియ్యాలె ! అంతేగద, ఇప్పుడు నీబాద ఎట్లమరిపిస్తనోజూడు ! (కాని స్టేబుల్‌తో) దండాలావో ?

(కానిస్టేబులు పరుగున పట్టుకుని వచ్చాడు)

యువ : [గాభరాగా] ఇదేందిసార్ ? ఏంతెల్వదంటాంటె ఇట్ల గోసబెడుతాన్రి ? నిజంగసార్ నాకేందెల్వది !

యస్పి : [తాపీగా] నిన్నునేను గోసబెడ్త లేనురా ! పైవాళ్లజెప్పింది సువుజేసినవు. నా పైవాళ్లజెప్పింది నేనుజేస్తాన- ఎవరిపనులు వాళ్లజెయ్యాలెగాదుర ; [కాని స్టేబుల్‌కు పైకిలేచివున్న యువకుడి అరికాళ్లనిచూపుతూ] మార్ ! ! (అరి కాడు) [కానిస్టేబుల్ కొట్టటంసాగించాడు. యువకుడు గింజుకుంటూ అరు స్తున్నాడు. యాదవరెడ్డి నవ్వుతూ చూస్తున్నాడు.]

యస్పి : [కానిస్టేబుల్‌తో] లాఠీని నూటఎనభైడిగ్రీలు ఎనుకకుపోనిచ్చి కొట్టురా, ఏమొ మెల్లెగ ఆనిస్తానవు ? [గద్దించాడు]

[కానిస్టేబులు బలంగాకొట్టాడు. యువకుడు గట్టిగాఅరిచాడు. యస్పియి యాదవరెడ్డి దెబ్బల్ని లెక్కెస్తున్నాడు]

యన్న: ...... పన్నెండు, పదమూడు, ...పద్దెనిమిది...... ఇరవై రెండు....
అగు! [కానిస్టేబుల్ ఆగాడు. యాదవరెడ్డి స్టూల్ మీద మళ్ళీ కూచున్నాడు]

యన్న: నీ కడుపుదొప్ప పోయిందారబిడ్డ! కాళ్లనొప్పులు మొదలైనయనుకుంట ఇగవాటినిగూడ బోగొడ్త అగు!! ఇప్పుడన్న మీ పెద్దోల్ల ఎవరో యాదికి వచ్చినారి?

యువ; (దీనంగా) నాకుతెల్వదిసార్! (తలవాల్చాడు)

యన్న: (జుట్టుపట్టి యువకుడితలెత్తి) అరేయ్, బోషిడికే! మనకు చీకటికి వెలుతురుకు ఉన్నంత దగ్గరి సంబంధమున్నదిరా! రాత్రైనకపగలు, దానెనుక చీకటివున్నట్టే మనం అంటుకోనివుంటం. మీసంగతులన్ని మాకెరికే, అట్లనే మాసంగతులన్ని మీకెరికే! ఇంకెందుకుర దాపరికం?

యువ: (నిస్పృహగా) అన్యాయంగ కొట్టినంపుడేగని ఏందెల్వదంటె యింటలేరు గద! ఇంకయిన్నిదెబ్బలుగొట్టినా నాకుతెల్వనిది ఎట్లజెప్పాల?

యన్న: (నవ్వుతూ) అరే! నీకు తెల్వదిగని ఈ నౌకరిలో జేరకముందు నేనుగూడ రాడికల్నేరా! యూనివర్సిటీల ప్రొఫెసర్ శివకృష్ణలేడా? అబ్బే నీకు తెల్వదాగని! ఆయినెశిష్యున్నిరానేను! ఏమనుకుంటానవు? (గట్టిగానవ్వి యువకుడి జుట్టువదిలాడు, అతడితల నేలకికొట్టుకుంది)

యువ: (తల బాధగావిదిలించి) నేనుజెప్పింది మీరు నమ్మరేందిసార్! నేను పల్లెటూరోన్ని! యూనివర్సిటీల ప్రొఫెసరు నాకెట్లదెలుస్తడు? ఎందుకు తెలుస్తడు? మాబాధలు గావాల్లకేందెలుస్తయి? వాల్లు మాకేంజేస్తరని మేం వాల్లదగ్గరికిబోతం?

యన్న: (నవ్వుతూనే) తెలువనట్టు మాట్లాడుతె ఎట్లరా? ఈ రాడికల్లను తయారు జేసెటోల్లంత యూనివర్సిటీలు, కాలేజీలల్లనే గాదుర ఉండేది!

యువ: నాకుతెలువనియన్ని జెప్పుతుంట ఇవన్నినీకెరికే అంటే ఏంజెప్పాల? ఇగ మీయిష్టం.

యన్న: మీరంత రాడికల్సుగాదుర! లంజకొడుకుల్లార! పట్టిగజెప్పుతారు? లాగ బారి ఉంటయి మీశరీరాలు. [కానిస్టేబుల్‌తో] మారోసాలేకో!

(కానిస్టేబుల్ ఈసారి భుజాలమీద కొట్టడంసాగించాడు. యువకుడు అరుస్తూ గింజుకుంటున్నాడు. యాదవరెడ్డిలేచి నవ్వుతూ దెబ్బలులెక్కిస్తున్నాడు]

యస్న : ఒకటి....రెండు....నాలుగు.... అరే కదలకు మాదర్చోద్ ! (గింజుకుంటున్న యువకుణ్ని ఎడాపెడా తన్నాడు) గట్టిగకొట్టురా లంజకొడుకా ! పొద్దున పెండ్లాం అన్నంబెట్టలేదాఏంది ? [కానిస్టేబుల్ చేతిలోంచి కర్రలాక్కున్నాడు] కదలకుండ వీనిసదుంపెక్క !

[కానిస్టేబుల్ బోర్లాపడుకునివున్న యువకుడి నడుంమీద కాలతో తొక్కిపట్టాడు]

యస్న : అరేవిడ్డా ! ఊరినిఉద్ధరించెటానికి రాడికల్ వైనావు ? మరిప్పుడు నిన్ను ఎవడు ఉద్ధరించాలారి లంజకొడుకా ? [ఆగకుండా బలంగా రెండుభుజాల మీద దెబ్బలుకొట్టాడు. యువకుడు అరుస్తూ గింజుకుంటూనే వున్నాడు]

యువ : కొట్టకున్రిసార్ ! నాకేందెల్వదిసార్ ! ! [బాధతో మూలిగినట్టుగా అన్నాడు]

యస్న : (పెటకారంగా) పీదెబ్బలుతినకుంటనే వీరులెట్లయితరురా ? ఇప్పుడెన్నిబాధలు పడితె రేపంతగొప్ప ! గాంధీ నెహ్రూలు స్వాతంత్రి వీరులెట్లయిన్రి ! రేపు మీరాజ్యంవస్తె మీరంత స్వాతంత్రియోధులుగాదురు ! ఇన్నిగొట్టిన నేనే రేపు నీకుశాల్యూట్ జేస్తరా, నీయమ్మ ఎరికేనా ? (నవ్వాడు. ఏదో గుర్తొచ్చినట్టు కానిస్టేబుల్‌తో) బయట ఆసార్లున్నరుజూడు. వాల్లనుఇక్కడికి తీస్కరాపో ! జర ఇసోంటియిజూస్తె వాళ్ళకన్న ఒళ్లుదగ్గరుంటది.

[కానిస్టేబుల్‌వెళ్లి పంతుళ్ళని తీసుకునివస్తాడు. నలుగురూ సంకోచిస్తున్నట్టుగా వచ్చి ఓ పక్కగా నిలబడతారు, హెడ్డుగూడా వస్తాడు.]

యస్న : (నవ్వుతూ పంతుళ్ళతో) సూశిన్రిసార్ ! ఇంత బాధపడ్తానగని ఒకమాట జెప్పెటానికి నస్తాండునీడు (యువకుడితో) అరేయి ఈసార్లనుజూసి బుద్ధి దెచ్చుకో ! వాల్లను అరెస్టుజేసి మీపేర్లేంది. ఊర్లేంది, సంఘమేంది. సంఘం లీడర్లెవరు అనంగనె అన్ని టకటకజెప్పిండ్రి. అసొంటిసార్లే జెప్పంగలేంది నీకేందిరా ?

రాఘవ : ఇంతకు ఇతనెవరండీ ? (భయం భయంగా అడిగాడు)

యస్న : వీడా ? వీడురాడికలోడు ! (యువకుణ్నికాలితోతన్నాడు)

(నలుగురుటీచర్లూ ఆశ్చర్యంతో కాస్త ముందుకువంగారు

వ్యాక : నిండాపాతికేండ్లయినా ఉన్నట్టుగాలేదు. ఇతనుచేసిన నేరమేమిటి ?

యస్సై : (వెటకారంగా) ఇతనుచేసిన నేరమేమనగా గ్రామములో అలజడిచేసెను. (కానిస్టేబులు కిసుక్కున నవ్వుతాడు) లేకపోతె మరిఏందయా ! రాడికలోడు అంటే మర్డర్లుజేస్తడు. దోపిడిజేస్తడు. అందర్నీతంతడు. ఊరోల్లనుసిదరి బోనియ్యడు. శాంతిభద్రతలు నాశనంజేస్తడు. ఎరికేనా ?

(వ్యాకరణశాస్త్రిముఖం కోపంతో ఎర్రబడింది)

యస్సై : (యువకుడిపై పుతిరిగి) పీన్ని ఇన్నిగొట్టిన్నా ! ఒక్కమాటన్న చెప్పతలేడు ! నాకు చెమటలు బెడుతానయి. నువ్వు పీరునివిగావాల్నని నన్నుకష్టపెడుతావుర లంజకొడుక ! ఇట్లకాదు (కానిస్టేబుల్‌తో) పీనికట్లిప్పు !

(కానిస్టేబుల్ యువకుడి కట్లువిప్పి లేపి నిలబెడతాడు. యువకుడు నిలబడలేక కూలిపోతాడు. యస్సయి అతన్ని కాలితోతన్ని)

యస్సై : నఖరాలు ! లేరాలే ! నిలబడునక్కాగ ! !

యువ : (బాధగా) నిలబడవస్తలేదుసార్ ! అరికాళ్లమండుతానయి. మోకాల్లునిలుస్త లేవు (దొర్లాడు)

(కానిస్టేబుల్ యువకుణ్ని జబ్బపట్టి లేపినిలబెట్టాడు)

యువకుడి శరీరంనిండా గాయాలు కన్పిస్తుంటాయి.

యస్సై : (టీచర్లతో) పీళ్లు ఊళ్లెంబడితిరుక్కుంట పాటలుపాడుకుంట ప్రచారం జేస్తరుసార్ ! మీరు పాపంపిల్లంత ఏదో ఉద్ధరిస్తానని నుకుంటానట్టున్నది. దొంగలుసార్ దొంగలు ! (యువకుడితో) అరేయ్ మీపాట ఒగటిపాడుర లంజొడక పార్లమెంటరు.

యువ : నాకుపాడరాదుసార్ !

యస్సై : (కర్రతోకొట్టాడు, యువకుడు బాధతోమూలిగాడు) పాడరాదుబే ? నువు మీటింగులల్ల పాడంగ నేనువినలేదనుకుంటానవా ?

(టీచర్లు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు)

యువ : (బాధగా) ఇప్పుడు పాటలేందిసార్ ! ఐన ఒక్కటిగూడ యాదికిలేదు (నిస్త్రాణగా అన్నాడు)

యస్సై : కావాల్నంటె పాటలపుస్తకం తెప్పిస్తరా ! నాదగ్గరున్నది. అరేయ్ తేపోరా ! (కానిస్టేబుల్‌తో అన్నాడు)

(కానిస్టేబుల్ వెళ్ళి పాటలపుస్తకం తెచ్చాడు)

యస్సై : (పుస్తకం యువకుడికిచ్చి) ఇగజమవుటే!

యువ : ఇప్పుడు ఎట్లపాడొస్తదిసార్? (మూలిగాడు)

యస్సై : ఎట్లపాడొస్తే అట్లనేపాడురా! ప్రజలకోసమేగాదుర మీరంతపాడేది! మేం ప్రజలంకాదార?

యువ : పాడలేనుసార్! దెబ్బలు నొప్పిలేస్తానయి.

యస్సై : పాడురాలంజకొడుకాంటె నఖరాలు జేస్తున్నవు పాడు! (గద్దించి లాఠీతో కొట్టాడు)

(యువకుడు గింజుకున్నాడు. హెడ్డూ కానిస్టేబుల్ యువకుణ్ని గట్టిగాపట్టుకున్నారు)

యస్సై : పాడుతవాలేదా మాదర్చోద్, హడ్డియాఁ నరంకర్ దేవుంగా! (అరిచాడు)

యువ : (అడ్డంగాతలూపాడు)

యస్సై : అరే వీన్నిగోడకు నిలబెట్టురా లంజకొడుకును! (కర్రసవరించుకున్నాడు)

(కానిస్టేబుల్లు యువకుడ్ని గోడకి ముఖంఆనించి నిలబెట్టి అతనిభుజాలు గోడకి నొక్కిపట్టారు. యువకుడు పెనుగులాడుతున్నాడు)

యస్సై : పట్టిగపాడుమంటె పాడుతావుర? ఇప్పుడుజూడు ఎట్లరాగాలుతీయిస్తనో? యువకుడి పిర్రలమీద బలంగాకొట్టటం సాగించాడు)

(యువకుడు పెనుగులాడుతూ అరుస్తున్నాడు. కానిస్టేబుల్లు అతన్ని అదిమిపట్టారు టీచర్లు నలుగురూ మొఖాలు చూసుకున్నారు. ఆ దృశ్యాన్ని చూడలేక మొహాలు ఎటోపెట్టారు. ఎడతెరపిలేకుండా యెస్సయ్ కొడుతున్న దెబ్బలకి అతడి ఒంటిమీదున్న చిన్నచెడ్డీ చిరిగిపోయింది)

యస్సై : (ఆయాసంగా ఒగరుస్తూఆగి) ఏంరా? పాడుతవాలేదా సాలే!

యువ : (తలతిప్పి) ఇన్నిదెబ్బలుగొట్టుకుంట ఎట్లపాడుమంటావురి? (స్వరం పెద్దదయింది)

యస్సై : వచ్చినట్టుపాడురా ధగిడీకే (నవ్వాడు)

యువ : (గొంతెత్తి) విప్లవాలయుగంమనది.... విప్లవిస్తే జయంమనది.... ఈ మట్టిని తొలుచుకునీ విప్లవాలలేస్తున్నై.... ఎరుపెక్కిన ఆమట్టికి....

యస్స : (టీచర్లతో) సూశినారిసార్ ? ఇందాక మర్యాదగ అడుగుతె రాదన్నడు ఇప్పు దేమొ రాగందీస్కుంట పాడుతాండు. దొంగలంజకొడుకు ఇగ వీళ్లసంగతేం జెప్పమంటరు ? మీరేసూస్తానురిగద ? (నవ్వాడు)

(టీచర్లు సాలోచనగా తలూపారు. యస్సై యువకుడిపై పుతిరిగి)

యస్స : (చేతులుచూసుకుంటూ) నువ్వుజెయ్యబట్టి నాచేతులు బొక్కలెక్కనయిగదరా మాకెలౌడె ! (టీచర్లపై పుతిరిగి) ఇయ్యాల నా మనసుదీర తృప్తిగకొట్టిన సాబ్ ! గవర్నమెంటు జీతందీస్కున్నందుకు నష్టంలేకుంట పనిజేశిన. నాకు తృప్తిగఉన్నది. (యువకుడు గోడకుఒరిగి కోపంగా చూస్తున్నాడు)

యస్స : అలిసిపోయినావుర లంజకొడుక ! (కానిస్టేబుల్‌తో) తేపోరా !

(కానిస్టేబుల్ లోపలికివెళ్ళి బూందీపొట్లంతెచ్చాడు)

యస్స : (అదితీసుకుని విప్పి యువకుడికివ్వబోయాడు) తినురా ! పాపం ఆకలైతా నట్టున్నది ! (నవ్వాడు)

యువ : (అసహ్యంగా) వద్దు !

యస్స : తినురా బోషిడికే లేకుంటెనస్తవు ! (టీచర్లపై పుతిరిగి) అందరు మాకు దయ, జాలి ఉండవనుకుంటరు. మేం ఎట్లకొడుతమో అట్ల తిండిగూడ బెడ్తం. ఇప్పుడు సూస్తనేఉన్నరుగద మీరు ! [నవ్వాడు]

[టీచర్లు ఒకరిముఖాలొకరు చూసుకున్నారు]

రాఘవ : మేం ఇక్కడ ఇంకఎంతసేపుండాలెనండీ ? [సంకోచిస్తూ అడిగాడు]

యస్స : ఆఁ ! మీసంగతే మరిచిపొయిన. మీరు పర్సనల్‌బాండ్లుఇచ్చి ఇండ్లల్లకు పోనిరి. మల్ల పిలిచినప్పుడు రావాలె ! ! [అధికారస్వరంతో అన్నాడు]

[టీచర్లు తలూపారు]

యస్స : [హెడ్డుతో] పోయి వీల్లపనిచూడుపో ! (హెడ్డు టీచర్లనితీసుకుని వెళ్ళి పోతాడు)

హడావిడిగా ఒక సర్కిలిన్స్పెక్టరు ప్రివేశిస్తాడు

యస్స: అతన్నిచూడగానే సాల్యూట్‌చేసి ఏంసార్ ! ఇట్లవచ్చిను్రి ?

సర్కిల్ : వీడేగదా రాడికలోడు ! (యువకుణ్ని చూస్తూఅన్నాడు)

యస్స: అవునుసార్ ! ఇప్పుడే బాగ కోటింగిచ్చిన !

పాట :

రివిజనిస్టు

కార్మిక

ఎర్రజెండా నేడబెట్టి విరో - ఓరివిజనిస్టు
నమ్మినోల్లా నేమిజేస్తి విరో
దొంగకమ్యూనిస్టు "ఎర్రి"

నాటినైజాంకాలమందు
తెలంగాణా పోరునందు
పోరుదప్పాదారిలేదని
ఎర్రిజెండా అండగుందని
భూమికోసం భుక్తికోసం
బక్కరైతులు బందుకెత్తితె
జంగునిడిసీ జనాన్నిడిసీ
పార్లమెంటుకు పరుగుదీసి "ఎర్రి"

కమ్యూనిస్టుపార్టిఅంటవ్
కాంగిరేసు తోకబట్టవ్
సోషలిజం సొల్లుశక్కి-
కమ్యునిజం కథలుచెప్పి
ఇల్లెక్కి-గోలచేస్తూ-
ఇందిరమ్మా కొంగుబట్టవ్ "ఎర్రి"

లంచగొండి పాలనంటవ్
అంచమిస్తైనె పనుల్జేస్తవ్
మందినమ్మే మాటచెప్పుతు
మందికొంపల్ ముంచుతుంటవ్
మందికండ్లూ తెరుస్తున్నరు-
మాడిపోతవ్ దగుల్బాజి- "ఎర్రి"

సర్కిల్; బాగనేఉన్నదిగని వీన్నిఅర్జంటుగా హెడ్క్వార్టర్సుకు పంపు।

యస్సై : మంచిదిసార్ । కాని ఎందుకు ?

సర్కిల్: వీల్లపెద్దలీడర్ హాస్పిటల్నుంచి పారిపోయిండుగద. వాడు దొరికెటట్టులేడు. మనంఏదోజేసినట్టు కనబడకపోతె ప్రజలల్ల మన డిపార్టుమెంటు ఇజ్జత్ ఉండెటట్లులేదు. ఓ పదిమందిని ఇయ్యాల్నే అర్జెంటుగ పట్టుకున్నట్లు పేపర్ల రాయించాలె.

యస్సై । మరి మన పేపరోల్లు నమ్ముతరా ? అసలే కొండెంగ లంజెకొడుకులు ।

సర్కిల్: అందుకే ఇటువంటి వాళ్లను యస్పీగారు బాంబులు, రివాల్వర్లు పట్టుకోని తిరుగుతాంటె పట్టుకున్నామని కొందర్ని, స్థావరాలపై దాడిజేసి పట్టుకున్నామని కొందర్ని పేపరువాళ్లకు చూపిస్తారు.

యస్సై : ఇన్నిరోజులు తెలువని స్థావరాలు ఇప్పుడే అర్జంటుగ ఎట్లతెలిసినయని పేపరోల్లు అడుగరాసార్ మరి ?

సర్కిల్: అవన్ని తరువాత ఏదన్న ముందుహడావిడిజెయ్యాలె లేకుంటె ఇజ్జత్దక్కది

యస్సై : మంచిదిసరె ! యువకుణ్ని జబ్బపట్టిలేపుతూ నడువురా మాట్లలవుడే, మీ రాడికల్సు జెయ్యబట్టి ఇట్లనన్న పరిమోషను రాకపోద్దా ?

(యువకుణ్ని పట్టుకుని నడిపిస్తూ వెళుతుండగా తెరపడుతుంది)

వీరులోలె పోజుగొట్టి
విప్లవానికి తూట్లుపొడిచి
పర్గపోరుము విడిచిపెట్టి
ఓట్లచిప్పలు చేతబట్టి
ప్రజాపంథానొదిలిపెట్టి
పార్లమెంటులో పీఠమేసి
సర్కారోని కాళ్ళకాడా-
సాష్ఠకోని పండుకోని- ॥ఎర్రి॥

లేబరోల్లా యూనియనంటవ్
కంపినోల్లా సంకలుంటవ్
కార్మికూల ఐక్యతంటవ్
పిచ్చిపెట్టి చీలగొడ్తవ్
సమ్మెహక్కు జన్మహక్కని
పోరుజేసే పోజుగొడ్తవ్
పోలిసోల్లకు పేర్లు చెప్పి
సమ్మెపోరుకు తూట్లు పొడుస్తవ్
పర్గరాజాకీయమేదిర-
సంసదప్పన ఐదుపకొడుకా- ॥ఎర్రి॥

కూలిరాజ్యం పోరునొదిలి
కూలిపెంపూ కూతకూసి
చట్టమంటు ఖానూనంటు
రిన్స్టేషన్ పెడ్తనంటు
ఉన్నహక్కులు కుదువబెడుతూ
నోట్లకట్టలు కూడగడుతూ
లంచాల రొచ్చుగుంటలో
ఉచ్చతాగే లుచ్చకొడుకా
ఎర్రిజెండా బురఖలెందుకు-
నల్లగుండే నక్లికొడుకా- ॥ఎర్రి॥

దోచుకోనే దొంగలంతా
కూడుకోని కుట్రజరిపి
వేజ్‌బోర్డు లెక్కలేపి
కూలిబతుకుల కూతమేస్తె
సుక్కలంటగ ధరలు పెరిగితే
సుక్క పైసా కూలి పెరిగితె
దండివిజయం తెస్తినంటు-
మందిబతుకులో సుట్టిగొడితివి- ॥ఎర్రి॥

మీ రాజకీయపురంగుతెలిసి
బట్టెబాజి గుణంతెలిసి
కూడుగుడ్డకు కుమిలెటోల్లు
బతుకుతెండిన బక్కరైతులు
మీరెలువగొట్టిన ఎర్రిజెండను
ఎత్తిపట్టి ఎర్రిజేసి
చారుబాబు దారిచూపగ
నాడు నగ్జల్‌బరీరగిలితె
నగ్జల్‌బరీ వెలుగులోనా
రగులుతున్నది తెలుగుగడ్డా
సింగరేణి బొగ్గుగుండెలు
రగులుకొంటూ మండుతున్నవి
రాడికల్లా అండతోటి
రైతుకూలి పోరుతోటి
రగల్ రాజ్యం రావాలంటు
దోపిడోల్లా కూలాలంటు
సాగుతున్నా ప్రజాపోరూ
బాటకడ్డం పీఠమేస్తె
జంగునడిపే జనంలోనా
పోరుమంటల దారిలోనా
బురఖలెన్ని వేసుకున్నా-
బూడిదైతవ్ ఖబర్దార్ !
అమరవీరుల రక్తజెండారో ఓ రివిజనిస్టు
పోరాడెవానిదె ఎర్రజెండారో ఓరివిజనిస్టు
॥అమర॥

[ఎర్రిజెండా నీడలొరిగినా ఓ శంకరన్నా కనికరించీ కండ్లుతెరుపన్నా మా శంకరన్నా
పాట బాణీలో పాడుకోవాలి !]

వ్యాసం :

నిర్మాణాత్మక గ్రామాల్లో సమస్యాత్మక చర్యలు

వరంగల్ జిల్లా 'నిర్మాణాత్మక - అభివృద్ధి కార్యక్రమాలు' అమలుచేయడానికి ప్రభుత్వం గ్రామాలకు 'తరలి'పోతున్నది. జిల్లాస్థాయి పాలనలోని కలెక్టరు పోలీసుఅధికార్లు ప్రస్తుతం 'గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు' అమలుచేయడానికి ఎక్కడలేని ఉత్సాహం చూపెడుతున్నారు. రెవిన్యూ, పోలీసుశాఖలు 'స్వాతంత్ర్యం' రాకముందు బ్రిటిష్ వలసకాలంలో కేవలం పన్నులువసూలుచేయడం, శాంతిభద్రతల పేర ప్రజలను, ప్రజాఉద్యమాలను అణచివేయడంతప్ప వేరేపనులేమీ చేయలేదు. 'స్వాతంత్ర్య' నంతరం 'ప్రణాళికాభివృద్ధి' దశలో వ్యవసాయం, పశుగణాభివృద్ధి, విద్య, పంచాయితీరాజ్, పౌరసరఫరాలు, సాంఘిక సంక్షేమశాఖలు చేయాల్సినపనులు తిరిగి రెవెన్యూ, పోలీసుశాఖలు చేయాల్సినదుర్గతి మనభారతదేశ ప్రణాళికాభివృద్ధికి దాపురించింది. చూడబోతే జిల్లాస్థాయి పాలనాయంత్రాంగం వరంగల్ గ్రామప్రాంతప్రజల సమస్యల పరిష్కారానికి ఒక నూతన 'పాలనా వ్యూహాన్ని' కనిపెట్టినట్టు అగుపడుతున్నది. ఇది అమలుపరిచినతీరును గమనిస్తే వరంగల్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో పెరుగుతున్న 'అశాంతి'ని దృష్టిలోఉంచుకొని దానిని అరికట్టడానికి లేదా అణచివేయడానికి 'అశాంతి' నెలకొనిఉన్న గ్రామాలను ఎంచుకొని, ఆ గ్రామాలసమస్యలను 'అధ్యయనం'చేసి వాటిని సత్వరంగా పరిష్కరించడానికి అక్కడికక్కడే చర్యలు తీసికొంటున్నది. అయితే దీనివల్ల ఒక్కవిషయం తేలిపోయింది, ప్రజలు పోరాటంచేయనిదె ప్రభుత్వం వాళ్ళసమస్యలు గుర్తించదని. కాబట్టి ప్రజలు తమసమస్యలు పరిష్కరించుకోవడంకోసం పోరాటం చేయకతప్పదు, చేస్తారుకూడా. అయితే ఇలాగే ప్రతిగ్రామానికీ కలెక్టర్, డి.ఐ.జి పోయి అన్నిగ్రామాల సమస్యలను పరిష్కరించగలరా ?

గ్రామీణసమస్యలను పరిష్కరించడానికి, గ్రామాల్లో 'అభివృద్ధి కార్యక్రమాలు' అమలుచేయడానికి జిల్లాస్థాయి పాలన వరంగల్ జిల్లాలో మూడుగ్రామాలను ఎంచుకొన్నది. భట్టుపెల్లి, పైడిపల్లి, మల్లారెడ్డిపల్లి. ఈమూడు గ్రామాలు ప్రభుత్వం దృష్టిలో 'తీవ్రవాదరాజకీయాల' ప్రభావంలోఉన్న గ్రామాలు అశాంతికి నిలయాలు. కాబట్టి 'తీవ్రవాదులు' సృష్టిస్తున్న అలజడిని అణచివేసి "శాంతిస్థాపన"కు చేసే నూతనప్రయత్నంలో భాగమేఇదంతా అని జిల్లాస్థాయి పాలనచెబుతున్నది. ఈమూడు గ్రామాల్లో 'శాంతిస్థాపన' సంఘం 'అభ్యుదయయాత్రలు'చేసి, సమావేశాలు ఏర్పరిచి గ్రామీణసమస్యలను పరిష్కరించే ప్రయత్నంలో అక్కడికక్కడే ఆర్డరు జారీ

చేసింది. 'అభ్యుదయ యాత్ర'లనబడే నాటకంలోని పాత్రధారులు జిల్లాకలెక్టర్, జిల్లాపరిషత్ చైర్మన్, పోలీసు డి.ఐ.జి., యస్పీ, జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి వీరితోపాటు స్థానిక సమితిఅధ్యక్షులుకూడా చురుకుగా పాల్గొన్నారు. 'అన్న'గారు రాష్ట్రంలో 'చైతన్యయాత్రలు' చేస్తే 'తమ్ములు' 'అభ్యుదయయాత్రలు' చేస్తారు. చెరువులుగండ్లుపడి వరదలైపారి కంచనపల్లి సగంఊరు కొట్టుకుపోయినా, 'అన్న' గారి 'చైతన్యయాత్ర'లో సమయంలేక ఆ గ్రామప్రజలకు హెలికాప్టర్‌నుంచి బిస్కట్లువిసిరి పరామర్శించాడు.

ఇదంతాచూసి, విన్నతరువాత ప్రజాస్వామ్య విలువలకోసం, పేదప్రజల అభ్యున్నతికోసం, దేశాభివృద్ధికోసం నిజాయితీగా ఆలోచించే ప్రజాస్వామికవాదులకు, మేధావులకెవరికైనా ఈ మౌలికమైన ప్రశ్నలు రాకతప్పవు

(i) బిట్టుపెల్లి, మల్లారెడ్డిపెల్లి, పైడిపల్లి గ్రామాల్లో ఏంజరిగింది? ఈ గ్రామాల్లో వరంగల్ 'శాంతిస్థాపనసంఘం' ఎందుకు, ఎటువంటి 'నిర్మాణాత్మక కార్యక్రమాలు' చేపట్టింది? 1947 తర్వాత ప్రభుత్వంచేపట్టిన "అభివృద్ధికార్యక్రమాల" "పేదరిక నిర్మూలనా కార్యక్రమాల" ఫలితంఏమిటి? వాటి ప్రభావమెంత? (ii) ఈనాడు వరంగల్‌జిల్లాలోనేకాదు తెలంగాణాలోని అయిదుజిల్లాల్లోని గ్రామీణప్రాంతాల్లో నెలకొనిఉన్న 'అశాంతి'కి గల సామాజిక కారణాలేమిటి? ప్రభుత్వం దీన్ని ఏ దృక్పథంతో చూస్తున్నది? (iii) ప్రభుత్వంచేపట్టే కార్యక్రమాలు, 'సంస్కరణలు' అభివృద్ధిని తీసికొనిరాగలుగుతాయా? లేకపోతే ఉన్న పరిష్కారమార్గాలేమిటి?

గ్రామీణప్రాంతాల్లో 'అశాంతి'కిమూలం సామాజికార్థిక కారణాలన్నవిషయం జిల్లా పాలనాయంత్రాంగం ముప్పైఆరేండ్ల తరువాత గ్రహించిందా? లేక తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి సంఘటితమవుతున్న గ్రామీణ పేదప్రజలను అణచివేయడానికి, భ్రమల్లోముంచడానికి కొత్త 'అణచివేతవ్యూహం' రూపొందిస్తున్నదా అన్నవిషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరమున్నది. కాబట్టి ప్రభుత్వాధికారుల 'అభ్యుదయయాత్రలు' స్వభావాన్ని క్షుణ్ణంగా అర్థంచేసుకోక తప్పదు. ఈ ప్రశ్నలను ప్రస్తుతం నెలకొనిఉన్న పరిస్థితులలో సరిఅయిన దృక్పథంతో విశ్లేషిస్తేగాని ప్రభుత్వాధికారులు నిర్వహిస్తున్న 'అభ్యుదయయాత్రలు'గాని 'శాంతిస్థాపన యాత్రలు'గాని మనకుబోధపడవు.

కాబట్టి బట్టుపల్లి, పైడిపల్లి, మల్లారెడ్డిపల్లెలు మాత్రమే ప్రభుత్వాధికారుల, 'ప్రజాప్రతినిధుల' 'అభ్యుదయ యాత్రా' స్థలాలుగా ఎందుకు ఎంచుకోబడ్డవి ? ఈ గ్రామాల్లో సామాజిక ఆర్థికపరిస్థితులు ఎట్లా ఉన్నవి ? ఆ గ్రామాల్లోకి ఏ పరిస్థితులలో పోలీసు క్యాంపులొచ్చినవి ? అన్నవిషయాలు మొదట తెలుసుకుందాం. బట్టుపల్లి కాజీపేటకు, పైడిపల్లి వరంగల్ పట్టణానికి ఐదుకిలోమీటర్లలోపున్న గ్రామాలైనా పేదరికంలోమున్న వెనుకబడ్డ గ్రామాలనేచెప్పాలి. బట్టుపెల్లిలో ఏరెండు - మూడు కుటుంబాలోతప్ప మిగతావన్నీ మధ్యతరగతి, పేదరైతుకుటుంబాలే ఈగ్రామంనుండి చాలమంది పట్టణంలో హమాలీలుగా, రైల్వేస్టేషన్లో చిన్నఉద్యోగులుగా, ఆజంజాహి మిల్లులోకార్మికులుగాపనిచేస్తుంటారు. ఈగ్రామంనుండి స్త్రీలు పట్టణానికొచ్చిపాలమ్మిపోస్తారు. పైడిపల్లిలో 'పైడి' ఎన్నడు ఉండెనోగాని ఇప్పుడు మాత్రమే దరిద్రం తాండవిస్తున్నది వరంగల్ పట్టణంలోని దాదాపు సగానికిపైగా రిక్షాలు పైడిపల్లి యువకుల 'రక్తంతోనడుస్తాయి'. దాదాపు 1500 మంది పైడిపల్లిగ్రామస్తులు వరంగల్లులో రిక్షాతొక్కుతారు. వీరిలో 200 మందికైనా స్వంతరిక్షాలులేవు. వీళ్ళేగాక చాలమంది ఈ గ్రామంనుండి పట్టణానికొచ్చి రాళ్లుకొట్టి, ఉప్పరిపనిచేసి, కట్టపనిచేసిజీవిస్తారు. వరంగల్ బీడికార్ఖానాల్లో బీడీలుచేసేవాళ్లలో పైడిపల్లిస్త్రీలుకూడా ఎంతోమందిఉన్నారు. మల్లారెడ్డిపెల్లిలో ఒక్కపెద్ద భూస్వామ్యకుటుంబంతప్ప మిగతావన్నీ బతుకుకటకటలాడే మధ్యతరగతి, పేదరైతుల, వ్యవసాయకూలీల కుటుంబాలే. ఈ భూస్వామ్య కుటుంబం సీలింగుభూముల చట్టంకింద దక్కించుకున్నది దక్కించుకోగా తేలిన మిగులుభూమి 160 ఎకరాలు దీన్నిబట్టి మనదేశంలో సీలింగ్‌భూములచట్టం ఏ విధంగా అమలయిందో కనీసజ్ఞానం ఉన్నవారెవరైనా ఊహించుకోవచ్చు ఇదిగాక ఈగ్రామంలో 50 ఎకరాలదాకా బంజరుభూమి, చెరువుషికం భూమిఉన్నది. ప్రభుత్వం కనీసం దీన్నైనా భూమిలేని వ్యవసాయకూలీలకు, పేదరైతులకు పంచడానికి ప్రయత్నించలేదు. గ్రామానికి కనీసం రోడ్డుసౌకర్యమైనా సరిగాలేదు. సంవత్సరాల తరబడి ప్రభుత్వనిర్లక్ష్యానికి గురిచేయబడి దరిద్రంతోనిండి, నిరంతరం సామాజికంగా, ఆర్థికంగా దోపిడీకిగురవుతున్న గ్రామాల్లో ప్రభుత్వం 'తీవ్రవాదం' అంటున్న రాజకీయాలుతప్ప మరేంప్రవేశిస్తాయి ? !

మల్లారెడ్డిపల్లిలో పోలీసుక్యాంపురావడానికి కారణం బంజరుభూమిని, చెరువుషికం భూమిని రైతుకూలీలు దున్నుకోవడం. భూస్వామిని సీలింగుచట్టంకిందతేలిన భూమిని అమ్ముకోనివ్వకపోవడం. అయితే అక్కడి భూస్వామికాని, వేరేఎవ్వరుగాని

ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. పోలీసు రూరల్ డీయస్పీ తనంతట తానే ఊరికిపోయి కేసురిజిష్టరుచేసి రైతుకూలీలపై ఎన్నో క్రిమినల్ సెక్షన్లకింద ఎన్నోరకాల దొంగకేసులు పెట్టాడు. ఆ తరువాత పోలీసుక్యాంపు వచ్చింది. ఆపైన షరా మామూలే. బంజరులో 36 హరిజనకుటుంబాలు సమష్టిగా వేసుకున్న 20 ఎకరాల పంటను పశువులమతోలి మేపారు, గుడిసెలు-సూర్లు పీకారు. ఊళ్లెఉన్నోండ్ల అడివిబట్టారు. మంచాలుఇరగ్గొట్టి చలికాగారు, తన్నారు, కొట్టారు, ఎన్నిచేయాల్నో అన్నిచేసారు. కొన్నిరోజులతరువాత జరిగిన 'అభ్యుదయయాత్ర' సమావేశంలో డీఐజీ "భూస్వామిఇంట్లో పోలీసుక్యాంపుపెట్టింది వేరేవసతిలేక" అని "గ్రామంలో పోలీసుక్యాంపున్నది ప్రజల భయభ్రాంతులు పోగొట్టడానికే"నని సంజాయిషీ ఇచ్చుకొంటాడు. కలెక్టరు జవహారీగారు వేదికపైనుండి వీరావేశంతో "చెరువుశిఖం బంజరుభూములు మీరేదున్నుకోండి" అనిచెప్తాడు. 160 ఎకరాల సీలింగ్‌భూమిపంచి ఇస్తామంటాడు. మరిదున్నిన భూమిలపంటనెందుకు నాశనంచేయించినట్లు ? ఇది జవహారీమాయా !

పైడిపల్లి పోలీసుక్యాంపురావడానికి కారణం, ఈ గ్రామప్రజలు 1980లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరించడం. ఊళ్లో ఒక్కఓటుకూడాపడలేదు. 'మాకిష్టంలేదు మేంఓట్లువెయ్యం' అన్నందుకు పోలీసులు కాల్పులుజరిపినారు. బట్టుపెల్లిలో అప్పటి కాంగ్రెస్-ఐ మంత్రిగారు పోలీసులు వెంబడిరాగా ఇల్లిల్లుతిరిగి ఓట్లు వేయండని డబ్బుపంచినా, ఓట్లువేయకపోతే 'మీఅంతుచూస్తాం' అని బెదిరించినా తప్పలేదు. కాని "మాకిష్టంలేదు మేం ఓట్లువేయం ఓట్లడబ్బులుపట్టుకొని వాపసు పొండి" అని గ్రామస్తులు చెప్పితే, పోలీసులు వాళ్ళపై ఏ చట్టప్రకారం, ఏ విధంగా కాల్పులు జరిపారు ? అని ప్రశ్నిస్తే నేరమవుతుంది. అది పౌరహక్కుల రక్షణ కాదు, ప్రజల్ని ఇబ్బెగొట్టడమవుతుంది డీఐజీగారిదృష్టిలో. ప్రజాస్వామికంగా జరగాల్సిన ఎన్నికలు అప్రజాస్వామికంగా పశుబలంతో, తుపాకులతో, డబ్బుతో, సారాతో, నీచమైన అవినీతిపద్ధతులతో నడపొచ్చునేమో ! మంచిది. మనదేశంలో బూటకమైన 'ప్రజాస్వామ్య'మున్నంతకాలం ఎన్నికలు ఇట్లనేజరుగుగాక. ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఎంతస్వేచ్ఛ ఉంటుందో ఓటువేయనిరాకరించడానికి, ఓట్లను బహిష్కరించండని చెప్పడానికికూడా అంతేస్వేచ్ఛ ఉంటుందికదా. ఓటువేయ నిరాకరించడం రాజ్యాంగప్రకారం రాజకీయస్వేచ్ఛను వ్యక్తంచేయడంకాదా ? అది పౌరహక్కుల, ప్రజాస్వామికహక్కుల పరిధిలోకిరాదా ? డీఐజీ దొరగారే నిర్ణయించి తీర్పుచెప్పాలేమో !....

బట్టుపెల్లిలోనయితే పోలీసుక్యాంపు పెట్టడానికి ఎప్పుడు అవకాశమొస్తుందా అని చాలకాలంనుంచి ఎదురుచూస్తున్నారు జిల్లా పోలీసుఅధికారులు ఆ 'అవకాశం' రానేవచ్చింది. 83 అక్టోబరు '30న రవీందర్ అనే యువకుడు బట్టుపెల్లిలో పట్టపగలే హత్యచేయబడ్డాడు. ఇంతాకొంచెం వెనక్కిపోతే, బట్టుపెల్లి గ్రామప్రజలకు చిన్నాలు సంస్మరణసభ పెట్టడానికి అనుమతి నిరాకరించబడ్డది. ఆ రోజు స్టేజీనిరగ్గొట్టి సభ కొచ్చిన జనంమీద విచ్చలవిడిగా లాఠీచార్జిచేసారు పోలీసులు. మీటింగ్ కు ముందు రోజు కలెక్టర్ గ్రామానికివచ్చి 'చిన్నాలు సంస్మరణసభ ఎందుకుపెట్టాలి ? ఆయన మీకేంచేసిండు' అని ఇత్యాదిప్రశ్నలడిగి, 'ఆయనకంటెఎక్కువ మీకు ప్రభుత్వం అన్నివిధాలచేస్తుంది' అని, ఆఖరున మీటింగ్ పెట్టడానికి వీల్లేదు పొమ్మన్నాడు. అంతకుముందె గ్రామంలో కొందరు పేదరైతులు, రైతు-కూలీలు దేవాలయభూమిని, బంజరుభూమిని దున్నుకోవడం జరిగింది. ఈక్రమంలో రైతు-కూలీసంఘం గ్రామంలో బలపడడం గ్రామపెత్తందార్ల (వాళ్ళు పెద్దభూస్వాములు కాకపోవచ్చును) భూస్వామ్య మనస్తత్వానికి, ప్రవర్తనకు పడిరాకుండావచ్చింది. పట్టపగలే గ్రామంలో హత్యజరగడానికి గ్రామాధికారి (పట్వారి) భూస్వామ్య మనస్తత్వంతోకూడిన ప్రవర్తన కారణమయింది. ఒక గొల్లతను చుట్టకాల్చుకోవడానికి అగ్గిపెట్టె అడిగితె, అదనాగొల్లోడు నన్ను అగ్గిపుల్లడుగుడా అని, నాదాననిపించి అతన్ని చెప్పుతో కొట్టాడు గ్రామాధికారి. చెప్పుతోకొట్టాల్సిన అవసరమేమొచ్చిందని ప్రజాపంచాయితీ పెట్టి అడగడానికి పోయినవాళ్ళపై ఆ గ్రామాధికారి కొడుకులు దాడిచేసి రవీందర్ ను అక్కడికక్కడే కత్తులతోపొడిచి చంపినారు. పోలీసులుమాత్రం రాడికల్స్ చంపడానికొస్తె ఆత్మరక్షణకోసం వాళ్ళచేతుల్లోని ఆయుధాలు గుంజుకొని చంపాల్సివచ్చిందని, కనీస జ్ఞానమున్నవాడెవ్వడు నమ్మబుద్ధిగాని కట్టుకథల్లి ప్రచారంచేసినారు. రవీందర్ నుచంపిన హంతకులు ఇప్పటికీ గ్రామంలో పోలీసులరక్షణలో సురక్షితంగానే ఉన్నారు. కేసు వాళ్ళమీదపెట్టకుండ, రాడికల్ యువకులమీదేపెట్టారు. ఆ మర్నాడు వెంటనే గ్రామంలో పోలీసుక్యాంపువచ్చింది. గ్రామంలో పోలీసుక్యాంపొచ్చిన తరువాత ఆ గ్రామస్తులుపడిన బాధలు 'నరకం'లోకూడ ఎవ్వరు పడరనుకుంటాను. ఆ గ్రామయువకులు దొరక్కపోతే తల్లి-తండ్రులను క్యాంపులోపెట్టి హింసించినారు, లచ్చమ్మ అనే ముసలవ్వను ఒకరోజుమొత్తం హింసిస్తే ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. పదిరోజులు యం.జి.యమ్ లో చేరాల్సివచ్చింది. ఇంకా పూర్తిగా కోలుకోలేదనేచెప్పాలి. క్యాంపులో గుండ్రంగా కూర్చోబెట్టి ఒకరి చెప్పుతో ఇంకొకరి వీపుమీద కొట్టమన్నారు. చెప్పులకు మొలలుంటె వీపులకుగాయా

అయినవి. కొట్టినదెబ్బలకు కాళ్ళుచర్మాలు మొద్దుబారిపోయినవనుకోవాల్సిందే. ఇవిగాక ఈ గ్రామస్థులు 'నరకకూప'మైన మదికొండ పోలీసు లాకప్పులో చిత్రహింసలకు, నిర్బంధానికి గురిఅయినారు. మదికొండ పోలీసుస్టేషన్‌లో రోకలిబండలు ఎక్కించి కొట్టడం, రాత్రుళ్ళు చలిలో నగ్నంగాఉంచడం, ఒకరితో ఒకరిని అసహ్యమైన లైంగికచర్యలు చేయించడం, మూత్రంతాగించడం మొదలైనవి చాలా మామూలైన విషయాలయినవి. ముగ్గురువ్యక్తులను 103 రోజులు పోలీసులాకప్పులో నిర్బంధించి ఉంచినఘనత మదికొండ పోలీసులకేదక్కింది. ఈ విధంగా ఈ నాడు గ్రామాల్లో పోలీసుక్యాంపులు ప్రవేశించి గ్రామీణపేదప్రజలను చిత్రహింసలకు గురిచేస్తున్నవి.

గ్రామీణప్రాంతాల్లో 'అశాంతి'కిగల కారణాలను, ప్రభుత్వ 'అభివృద్ధికార్యక్రమాల' అమలుతీరును పరిశీలిద్దాం. గ్రామీణప్రాంతాల్లోఉన్న 'అశాంతి'కి మూలకారణం ప్రధానంగా భూస్వామ్య దోపిడీవిధానం అయితే భారతప్రభుత్వం 1947 తర్వాత 'గ్రామీణాభివృద్ధి' సాధించడానికి, అసమానతలు తొలగించడానికి ఎన్నో కార్యక్రమాలు రూపొందించింది. అయినప్పటికీ ముప్పయిఏండ్ల తరవాత కూడా 'దారిద్ర్యరేఖ'కు దిగువనున్నవారిసంఖ్య పెరుగుతూనేఉన్నది. ప్రభుత్వ అంచనాల ప్రకారం, 1978-79 ధరలనుబట్టి గ్రామప్రాంతాల్లో నెలకు 67 రూపాయలలోపు ఆదాయంఉన్నవారు దరిద్రులుగా పరిగణించబడుతారు. ప్రస్తుతం జనాభాలో వీరి శాతం సగానిపైనే. కాబట్టి ముప్పయ్యేండ్ల భారత 'ప్రణాళికాభివృద్ధి' చరిత్ర పరిశీలిస్తే, 'అభివృద్ధి కార్యక్రమాలు', 'పేదరిక నిర్మూలన కార్యక్రమాలు' అవి అమలు జరిగినతీరు, వాటివల్ల కలిగినఫలితం చివరగా సమాజంలోని ధనికవర్గాలకే చెందిందన్న విషయం స్పష్టమవుతుంది.

1950లలో 'ప్రజాస్వామ్యాన్ని వికేంద్రీకరణ' చేయడానికి పంచాయితీరాజ్ సంస్థలను ప్రవేశపెడితే, వాటిని వాటితోపాటువచ్చిన సహకార సంఘాలను గ్రామాల్లోని భూస్వామ్య, ధనికరైతువర్గాలు స్వాధీనపరుచుకొన్నవి. ఒకరచయితఅన్నట్లు "మధ్యయుగాలనాటి లక్షణాలు కొనసాగుతున్న గ్రామీణ సామాజిక నిర్మాణాన్ని మార్చడానికి ఆధునిక విలువలుగల ప్రజాస్వామ్యసంస్థలను ప్రవేశపెడితే అవి భూస్వామ్య వర్గాలచేతుల్లో చిక్కుకొని, మధ్యయుగాలనాటి లక్షణాలు సంతరించుకొని దోపిడీవర్గాలచేతుల్లో పేదప్రజలను అణిచివేసే సాధనాలుగామారినవి".

1960లలో వచ్చిన 'హరితవిప్లవం' దానికి సంబంధించిన 'అభివృద్ధి కార్యక్రమాలు' అమెరికన్ సామ్రాజ్యవాదం మార్గదర్శకత్వంలో ప్రవేశించినవి. 'హరిత విప్లవం' వల్లకలిగిన ఫలితం కొన్నిప్రాంతాల్లో వ్యవసాయ యాంత్రీకరణ, అధిక ధాన్యోత్పత్తి, వీటితోపాటే ప్రాంతీయ అసమానతలు, వివిధవర్గాలమధ్య ఆదాయాల అంతరాలు పెరిగిపోయినవి. అంతేగాక ఈప్రాంతాల్లో వ్యవసాయ కూలీలసంఖ్య వారితోపాటు నిరుద్యోగంకూడా గణనీయంగా పెరిగింది. అమెరికా బహుళజాతి సంస్థలు తమఎరువులు, క్రిమిసంహారక మందులు, నూతనవిత్తనాలు, ట్రాక్టర్లు వీటన్నింటికి సంబంధించిన సాంకేతికవిజ్ఞానం అమ్ముకొని కోట్లరూపాయల లాభాలు సంపాదించుకొన్నవి. వీటన్నిటికన్నాముఖ్యం, 'హరితవిప్లవం'వల్ల భారతదేశం రాజకీయాల్లోకి ఒకకొత్త ధనికరైతువర్గం ప్రవేశించింది.

అమెరికా సామ్రాజ్యవాద పెట్టుబడి మార్గదర్శకత్వంలో 'హరితవిప్లవం'వస్తే 1970లలోవచ్చిన 'సమగ్ర గ్రామీణాభివృద్ధి', 'సన్నకారు రైతుల అభివృద్ధి', 'జాతీయ గ్రామీణ ఉపాధికల్పన' వంటి కార్యక్రమాలు ప్రపంచబ్యాంకు నిర్మించిన 'అభివృద్ధి వ్యూహ' ఫలితం. ఇవిగాక రెండవదఫా భూసంస్కరణలు, "సమగ్ర గిరిజనాభివృద్ధి". 'కమాండ్ ఏరియా అభివృద్ధి'వంటి కార్యక్రమాలు భారతప్రభుత్వం రూపొందించినా ఇవిస్థూలంగా ప్రపంచబ్యాంకు 'అభివృద్ధివ్యూహ' లక్ష్యాలపరిధి లోనే ఉన్నవని చెప్పవచ్చు. ఈ కార్యక్రమాలు రావడానికిగల ప్రధానకారణాలు; 1950 నుండి 1970 వరకు ఎన్నోరకాల 'అభివృద్ధి కార్యక్రమాలు', భూసంస్కరణల చట్టాలు జారీచేసినప్పటికీ భూమికేంద్రీకరణలో మార్పురాకపోవడం. అంటే ఇప్పటికీ 70 శాతంపైన వ్యవసాయభూమి 20 శాతంఉన్న భూస్వాముల, ధనిక రైతుల స్వాధీనంలో ఉండడము. గ్రామప్రాంతాల్లో వివిధరూపాల్లో భూస్వామ్య దోపిడీ పద్ధతులు కొనసాగుతూనే ఉండడము. దీనికివ్యతిరేకంగా 1960లలో నక్సల్బరీ రైతాంగపోరాటం, 1970లో శ్రీకాకుళ గిరిజనోద్యమంవంటి బలమైన రైతాంగ పోరాటాలు వచ్చినవి. ఇవి భారతరాజకీయాల్లోకి రెండు కొత్తవిషయాలు తీసికొని వచ్చినవి. అవి వ్యవసాయవిప్లవం, నూతన ప్రజాస్వామిక విప్లవం నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగపోరాటాల కొనసాగింపుగా వస్తున్న ప్రస్తుత రైతాంగ ఉద్యమాలను ఎదుర్కోవడానికి, అణిచివేయడానికి ప్రభుత్వం ఎన్నోరకాల 'అభివృద్ధి కార్యక్రమాలను' కొత్తపద్ధతులలో ప్రవేశపెడుతున్నది.

ఉదాహరణకు వరంగల్ జిల్లాలో 1973 నుండి 80 వరకు భూగరిష్ట పరిమితి చట్టం, ఆ తరువాత 1980 నుండి 83 వరకు జాతీయ గ్రామీణ ఉపాధికల్పన పథకాలు అమలుచేయబడ్డ తీరునుచూస్తే ప్రభుత్వానికి పేదప్రజల అభ్యున్నతిపట్ల ఎంత శ్రద్ధాసక్తులు ఉన్నవో, జిల్లాస్థాయిపాలన ఏవిధంగా విఫలమయిందో తెలుసుకోవచ్చు.

1973 సీలింగుభూములచట్టం అమలుచూస్తే, 1980 మార్చివరకు ప్రభుత్వం ఇచ్చిన లెక్కలప్రకారం, వరంగల్ జిల్లాలో ట్రిబ్యునల్ లో డిక్లరేషన్లు ఇచ్చినవారి సంఖ్య 20,541. దీనిలోంచి మిగులుభూమి లేదుఅని నిర్ణయింపబడిన వారిసంఖ్య 16,977. పెద్దపెద్ద భూస్వాములు డిక్లరేషను ఇవ్వకముందే ఉన్నదంతా సర్దుకొని చట్టంలోనున్న లొసుగులు ఉపయోగించుకొని, పాలనాధికారులతో కుమ్మక్కయి పన్నో[illegible] అవినీతికర చర్యలకు పాల్పడి సమర్థవంతంగా తప్పించుకొని పోయారు. మిగులు భూమి తేలినవారిసంఖ్య 3,532 మాత్రమే. మిగతావి ఇంకా కోర్టుల్లో మూలుగుతున్నై. కేవలం మిగులుభూమి తేలిన కేసుల్లోంచి నిర్ణయించిన మిగులుభూమి 320 ఎకరాలు తరి 84,175 ఎకరాలు ఖుష్కి. ఈ ఖుష్కిలో 54,052 ఎకరాలు కోర్టుల్లో తేలక వివాదాస్పదమైన చిక్కులుండడంవల్ల ప్రభుత్వం స్వాధీనపర్చుకోవడానికి వీలులేదు. ప్రభుత్వం స్వాధీనంచేసుకోవడానికి సిద్ధంగానున్న మిగులుభూమి 30,443 ఎకరాలు, తరి, ఖుష్కికలిపి. దీన్నుండి ప్రభుత్వం పేదలకు పంచడానికి స్వాధీనపరుచుకొన్నభూమి 12,488 ఎకరాలు. కాని వరంగల్ జిల్లాలోని వ్యవసాయ కూలీలసంఖ్య 3,81,416. అయితే ఒకొక్కరికి ఎంతభూమిపంచినట్టు ఒక్క సెంటుకూడారాలేదు. ప్రభుత్వం పంచడానికి తీసుకొన్నభూమిలో (12,488 ఎకరాలు) 4,466 ఎకరాలు సేద్యానికిపనికిరాదు. అంటే చాలమటుకు భూస్వాములు ఎందుకు పనికిరాని, వెంటనే సేద్యంచేయడానికి వీలుకాని 'తొండలుకూడా గుడ్లుపెట్టనిభూమి'ని ప్రభుత్వానికి స్వాధీనపరిచినారు. 1980 వరకు వరంగల్ లో 4,422 ఎకరాలభూమిని 3,425 మంది హరిజన, గిరిజన, వెనుకబడ్డకులాల పేదలకు పంచినట్టు కాగితాల మీద చూపెట్టినారు. దాదాపు అన్నిజిల్లాల్లో పరిస్థితి ఈ విధంగానేఉన్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిదేళ్ళపాటు (1972-80) 40.4 కోట్లరూపాయలు ఖర్చు పెట్టి అమలుచేసిన భూసంస్కరణలు ఎంత బోగసో దీనివల్ల స్పష్టంగా అర్థమవుతున్నది.

గ్రామీణ ప్రాంతాల్లో NREP (జాతీయ గ్రామీణ ఉపాధికల్పన) కార్యక్రమం క్రింద రోడ్లువేయడం, పాఠశాలభవనాలు, ఇతర ప్రభుత్వకార్యాలయ భవ

నాల నిర్మాణం, చిన్న నీటిపారుదల వసరులైన చెరువుల, కుంటల మరమ్మత్తు, హరిజనులకు, గిరిజనులకు, వెనుకబడ్డ కులాలవారికి ఇండ్లనిర్మాణం మొదలైనవి చేపట్టబడ్డవి. వీటివల్ల గ్రామప్రాంతాల్లో భూమిలేని వ్యవసాయకూలీలకు పనికల్పించబడుతుంది. వీటివల్ల లాభపడ్డది సివిల్ కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే. సాధారణంగా ఈ సివిల్ కాంట్రాక్టర్లంతా భూస్వాములు ధనికరైతులు. వరంగల్‌లో ఎన్ఆర్ఇపి క్రింద మూడుసంవత్సరాలకాలంలో (1980-83) చేపట్టబడ్డకార్యక్రమాలు 3,163. వీటిలో పూర్తి అయినవి 2,242. వీటివల్ల మూడేళ్ళకాలంలో ఉద్భవించిన మానవ శ్రమదినాలు 3.18.873. అయితే జిల్లాలోని వ్యవసాయ కూలీలసంఖ్య 3,81,816, 1971లో ఈ సంఖ్య 2,97,580 మాత్రమే. ప్రభుత్వం అందించిన గణాంకవివరాల ప్రకారం, సంవత్సరానికి వరంగల్ జిల్లాలోని కూలీలందరికి సంపూర్ణ ఉద్యోగం కల్పించాలంటే 10.49,99,900 మానవ శ్రమదినాలు సృష్టించబడాలి. అంటే సంవత్సరానికి ఒకొక్కకూలీకి 273 రోజులుపనిదొరకాలి. కాని ఎన్ఆర్ఇపి ఫలితంగా వరంగల్ జిల్లాలోని వ్యవసాయకూలీలకు మూడుసంవత్సరాల కాలంలో ఒకొక్కరికి 2½ రోజుల పనిదొరికింది. ప్రభుత్వ ఎన్ఆర్ఇపి పథకాలవల్ల సంవత్సర కాలంలో ఒకొక్కకూలీకి ఒక్కరోజుకూడా పూర్తిగాపనిదొరకలేదన్నమాట.

ఈ రకమైన 'అభివృద్ధి కార్యక్రమాల'నే బట్టుపల్లి, మల్లారెడ్డిపల్లి, పైడిపల్లి గ్రామాల్లో అమలుచేస్తామన్నారు. ప్రభుత్వం తెలియజేసిన సమాచారంబట్టిచూస్తే ఎన్నోరకాల కార్యక్రమాలను అమలుచేస్తామన్న వాగ్దానాల వర్షంతప్ప మరేంకాదు. రోడ్లువేయిస్తమని, రక్షిత తాగేనీటివసతి కల్పిస్తమని, పేదప్రజలకు ఇండ్లస్థలాలు సేకరించి ఇండ్లునిర్మించి ఇస్తమని, బంజరుభూములు పంచుతమని, శిఖంభూములు దున్నుకోమని, నిరుద్యోగులైన యువకులకు ఉద్యోగాలిప్పిస్తమని, బ్యాంకుఅప్పుల ద్వారా ఇంజన్లు మొదలైనవి ఇప్పిస్తమని చేసిన వాగ్దానాలేకాని అవి భౌతికవాస్తవంగా ఎన్నడు మారుతాయో ఎవరైనాచెప్పడంకష్టం. మళ్ళీ కొన్నిరోజులు పోయినతరువాత వీళ్ళుచెప్పినవి ఏవీ నిజంకావని ప్రజలు నిజంతెలుసుకొని, మళ్ళీ రైతు-కూలీ సంఘాలు పెట్టుకొని సంఘటితపడి ఉద్యమిస్తే మళ్ళీ గ్రామంలో పోలీసుక్యాంపు ప్రవేశం. చిత్రహింసలు, దొంగకేసులు. అతంతు ముగిసినతరువాత ప్రభుత్వ అధికారుల 'ప్రజాప్రతినిధుల' అభ్యుదయయాత్రలు' తప్పకుండా జరుగుతాయి. కొందరు బడిపిల్లలకు పుస్తకాలు, పలుకలు, బలపాలు, సంచీలు పంచినారు. కొందరు ముసలి వాళ్ళకు వృద్ధాప్యపింఛనుఇచ్చి అక్కడికక్కడే ఆర్డర్లు సైపుచేసిచ్చినారు. "పాడిందే

పాట అన్నట్టు ప్రతీసమావేశంలోనూ అందరి 'పాటల'ముగింపు మాత్రం ఒక్కటే. ప్రజలు రాడికల్సుతో సంబంధం తెంచుకోవాలె, నక్సలైట్ 'తీవ్రవాద' రాజకీయాలు వదులుకోవాలె, లేకపోతే ఎంతకూరంగానైనా అణచివేస్తాము అన్న బెదిరింపుమాత్రం తప్పకుండా ఉంటున్నది.

ఈ మూడుగ్రామాల్లోని సమావేశాల్లో 'ప్రజాప్రతినిధు'లు, ప్రభుత్వోద్యోగులు, పోలీసుఅధికార్లు ఉపన్యసించిన తీరుచూస్తే ఆశ్చర్యపడాల్సిందే. పోలీసు అధికార్లు, ప్రభుత్వోద్యోగులు ప్రజలకు రాజకీయహితోపదేశంచేస్తే, రాజకీయ నాయకులు- వాళ్ళు మనప్రజాప్రతినిధులు- ఏంమాట్లాడాలో తోచక పోలీసు అధికార్లను, ప్రభుత్వోద్యోగులను రక్షించడానికి పూనుకొంటారు. వర్ధన్నపేటసమితి అధ్యక్షుడు తన ఉపన్యాసంలో "పోలీసులను శత్రువులుగా చూడొద్ద"ని ప్రజలకు హితోపదేశం చేస్తాడు. పోలీసులు పేదప్రజలను హింసించినా, రాజ్యాంగంపట్ల, న్యాయవ్యవస్థపట్ల స్థానికసంస్థలపట్ల, స్థానిక సంస్థలనాయకులపట్ల, ఏమాత్రం గౌరవంలేకుండా ప్రవర్తించినా అతనికి పట్టింపులేనట్లున్నది. బట్టుపెల్లి గ్రామంలోనే కిందటి సంవత్సరం గ్రామపంచాయితీ ఆఫీసులో సమావేశం జరుగుతుంటే పోలీసులు లోపలికిదూరి సర్పంచ్‌ను, పంచాయితి సభ్యులను "లంజమీటింగులు పెట్టుకొంటున్నరా" అని బూతులుతిట్టి, కొట్టినసంఘటనను మరిచిపోయినట్లున్నది. ఇవన్నీ జరుగుతున్నా, మనదేశంలో ఈ మాత్రం మిగిలిఉన్న 'ప్రజాస్వామ్యం'పట్ల పోలీసులది మిత్రవైఖరా ? శత్రువైఖరా ? జిల్లాపరిషత్ చైర్మన్ "దేశంలో అరాచకత్వం పోయేదాక అభివృద్ధి సాధ్యంకాదు" అంటాడు. అరాచకత్వంఅంటే ఏమిటో, అభివృద్ధిఅంటె ఏమిటో కనీసజ్ఞానంలేని మనిషీయన. ప్రజలమీద ఎన్నడూరాని, ఎక్కడలేని ప్రేమావేశం పుట్టుకొచ్చినట్లున్నది, "మీ అరికాలికి ముల్లుదిగితే పంటితోనిపీకుతాం" అంటాడు. మీకు అంతశ్రమ ఎందుకుగాని గ్రామాల్లో హరిజనులమీద, పేదప్రజల శరీరాలమీద పందలకొద్ది పోలీసులాఠీలు విరుగుతున్నాయి వాటిని ఆపగలరా ? అంతేగాక "మా సమస్యలు తీర్చమని మమ్మలచెవులుపిండి అడగండి కాని హింసెందుకు" అని హితబోధ చేస్తాడు. ప్రజలుమాత్రం ఏంచేసినారని, 'ప్రజా ప్రతినిధులు', ప్రభుత్వాధికార్లు తమ బాధ్యతలను మరిచిపోతే 'చెవులోచెప్పే' ప్రయత్నమే కదా ! చేసింది. ఆమాత్రానికే గ్రామాల్లో పోలీసుక్యాంపులుపెట్టి పేదప్రజలను ఎన్నోరకాలైన చిత్రహింసలకు గురిచేయాల్నా ? 'చెవులుపిండే' 'హింస'కు పూనుకుంటే ఇంకేంచేస్తారోగదా ? ఈ రకంగా 'ప్రజాప్రతినిధులు' ఎలాంటి రాజకీయ అవగా

కూడ లేకుండా. ప్రభుత్వ 'అభివృద్ధి కార్యక్రమాల' విధానాలకు ఎలాంటి సంబంధం లేకుండా మాట్లాడితే పోలీసుఅధికార్లు కేవలం రాజకీయాలు మాత్రమే మాట్లాడుతారు. అందులో ప్రజలకు ఎలాంటి రాజకీయాలు అవసరమో, ఎలాంటివి అనవసరమో డిఐజి దొర నిర్ణయిస్తాడు. ఈ సమావేశాల్లో డిఐజి దొరగారు "రాడికల్స్ది అరువు తెచ్చుకొన్న రాజకీయ సిద్ధాంతాల"ని విమర్శిస్తూనే అదే ప్రసంగంలో "చైనాలో ప్రగతిని నిర్మించిన మావో అకుంఠితమైన దీక్షకు జోహార్లు" అర్పిస్తాడు. వేరేచోట విశ్వహిందూపరిషత్ సభలో వేదాల ఔన్నత్యాన్నిగూర్చి ఉపన్యసిస్తాడు. రాడికల్స్ 'అభివృద్ధి కార్యక్రమాల'కు నిరోధకులనీ కాబట్టి ప్రజలు ఆరాజకీయాలు వదులుకోవాలనీ సలహాలిస్తాడు. పోలీసుఅధికార్లు నన్నయసాహిత్యంనుండి నక్సలైట్ల రాజకీయాల విమర్శదాకా మాట్లాడవచ్చుగాని, వేరెవరు ఆపనిచేసినా అది దేశద్రోహనేరమవుతుంది, లెక్కలుచెప్పేపంతులు లెక్కలేచెప్పాలిగాని రాజకీయాలుచెపుతడా అని కలెక్టరు బెదిరిస్తాడు. రాజకీయాభిప్రాయాన్ని వ్యక్తంచేసే స్వేచ్ఛ మన 'పవిత్ర' భారత రాజ్యాంగం ఒక్క పోలీసు అధికార్లకేగాని టీచర్లకు, లెక్చరర్లకు, ఇతర ఉద్యోగులెవ్వరికీ ఇవ్వలేదా? బట్టుపెల్లిలో ప్రభుత్వ పాలనాయంత్రాంగానికి రాజకీయ పార్టీలలపట్ల విముఖత ఉన్నదనీ, అందరిపట్ల నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందనీ డిఐజి దొర చెప్పాడు. అయితే బట్టుపల్లిలో, రాంపూర్‌లో భూస్వాముల కుటుంబాలకు చెందిన యువకులు రాడికల్ యువకులను హత్యచేస్తే, పోలీసుల వాదనప్రకారం ఆత్మరక్షణకోసం హత్యచేసినప్పటికీ, వాళ్ళుఎందుకు అరెస్టుచేయబడలేదు? కాకపోగా వాళ్ళు స్వేచ్ఛగా పోలీసులరక్షణలో గ్రామాల్లో ఎలాతిరుగుతున్నారు? పోలీసు అధికార్లు ప్రభుత్వోద్యోగులు బహిరంగంగా వేదికలపైనుండి రాజకీయాలు మాట్లాడితే, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో బ్యూరోక్రసీ రాజకీయాలకతీతంగా తటస్థ వైఖరి నవలంబించి 'అభివృద్ధి కార్యక్రమాలు' "నిష్పక్షపాతంగా" అమలుచేసే విధానాన్ని చేపట్టినట్టా: లేక రాజ్యాంగ లక్ష్యాలపట్ల, 'ప్రజాశికాభివృద్ధి' లక్ష్యాలపట్ల ప్రభుత్వాధికారి తన నిబద్ధతను వ్యక్తంచేస్తున్నట్లా? మేధావులు సీరియస్‌గా ఆలోచించి, చర్చించాల్సిన విషయమిది. ఇప్పటికీ వలసపాలనా సంస్కృతిని విడిచిపెట్టని ఐఎఎస్ ఐపిఎస్అధికార్లు, రెవిన్యూ, పోలీసుశాఖలు 'అభివృద్ధి కార్యక్రమాల'ను ఎలాఅమలు చేస్తాయి? కొందరుమేధావులు రాజ్యాంగ యంత్రాన్ని రెవెన్యూ పోలీసుశాఖలు, అభివృద్ధిశాఖలు, అని రెండుగావిభజించి, రెవెన్యూ పోలీసుశాఖలది 'నియంత్రించే సంస్కృతి'అనీ అభివృద్ధిశాఖలది 'అభివృద్ధి సంస్కృతి' అనీ అంటున్నారు. రెవెన్యూ పోలీసుశాఖల జోక్యంలేకుండ, 'అభివృద్ధి సంస్కృతి'గల అభివృద్ధి

శాఖలే అభివృద్ధికార్యక్రమాలను అమలుచేస్తే అవి సఫలమవుతాయని భ్రమిస్తున్నారు. కాని 1947 తర్వాత ఏర్పరిచిన 'అభివృద్ధిశాఖలు'కూడా రెవిన్యూ, పోలీసుసంస్కృతినే అవలంభిస్తున్నాయిగాని, అవేమీ భిన్నమైనవికావు. మౌలికంగా రాజ్యం వర్గ సమాజంలో పాలకవర్గాలచేతుల్లో అణచివేత సాధనమై సంక్షోభాలను సృష్టిస్తుందే గాని, సంక్షేమరాజ్యమై ప్రజలందరి అభ్యున్నతిని ఎలాకాంక్షిస్తుంది? అభివృద్ధికి ఎలాదోహదం చేస్తుంది?

ఇదంతా జరుగుతున్న గ్రామాల్లోని రైతు-కూలీలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలిగదా! ఎవరో కొందరు యువకులను బెదిరించి, భయపెట్టి లేదా రాజకీయాలొదులుకొన్న మాజీ రాడికల్స్‌ను తీసికొచ్చి వేదికలెక్కించి 'నక్సలైట్ రాజకీయాలొదులుకుంటున్నాం' అని స్టేట్‌మెంట్స్ ఇప్పించడంకాదుగదా! "మీ ఊళ్ళో మామూలు పోలీసుపోయి సిఆర్పి పోలీసొచ్చిందికదా, కలెక్టర్, డిఐజి గట్లవచ్చి మీటింగులు పెట్టిండ్లుకదా మరి మీరేమనుకుంటున్నార"ని బట్టుపెల్లి రైతునడిగితే, ఆయన "ఏంచెప్పమంటరు సారు, సిఆర్పి పోలీసొస్తేందిగాని, ఎవలొస్తేంగాని గుడ్డేలుగు భయం గుడ్డేలుగుకున్నది గొంగడిభయం గొంగడికున్నది. పోలీసు క్యాంపుతోటి మాకుజరంత భయంగున్నా పోలీసోల్లుగాని, మావోన్ని చంపినోల్లుగాని భయంలేకుండా ఊళ్ళెదిరిగె ధైర్యమున్నదా సారు" అన్నడు.

కాని నిజానికి ప్రభుత్వం అనునిత్యం తప్పుడు ప్రచారంచేస్తున్న 'తీవ్రవాద' రాజకీయాలవల్ల, లేదా మనం చెప్పుకుంటున్న రైతాంగ ఉద్యమంవల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఏంజరిగింది? ఏండ్లతరబడి అసమర్థపు పాలనాయంత్రాంగం అమలు చేయని ఎన్నో చట్టాలను- సీలింగ్‌భూములచట్టం 1970. వెట్టిచాకిరీరద్దుచట్టం 1975, కనీసవేతనాలచట్టం 1978- ఖచ్చితంగా అమలుచేయాలని రైతు-కూలీసంఘాలు డిమాండుచేసాయి. వాటిఅమలుకై పోరాటం చేపట్టినవి. రైతాంగఉద్యమం చేపట్టిన ఆర్థికపరమైన డిమాండ్లను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. రైతాంగఉద్యమం గ్రామాల్లో ప్రధానంగా తీసుకొన్న కార్యక్రమాలు. (i) ఏ రూపంలో వున్న వెట్టిచాకిరీ అయినా రద్దుపరుచడం (ii) దేవాలయభూములు, చెరువు శిఖం భూములు, ప్రభుత్వ బంజరుభూములు పేదరైతులే దున్నుకునేటట్లు చేయడం, (iii) కూలీరేట్లు జీతాలుపెంచడానికి సమ్మెచేయడం (iv) గ్రామాధికారులు, భూస్వాములు అక్రమంగా వసూలుచేసిన దండుగలు లంచాలు తిరిగి చెల్లింపచేయడం (v) సీలింగు చట్టంక్రింద తేలిన మిగులుభూములు భూస్వాములను అమ్ముకోనివ్వ

కుండా చూడడం. (vi) అడవిప్రాంతాల్లోనయితే జంగ్లాతుఅధికార్ల, గుత్తేదార్ల అక్రమాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపరిచి ధైర్యంగా ఎదుర్కొనేటట్లు చేయడం. (vii) గ్రామాల్లోని అధికారుల, రాజకీయనాయకుల లంచగొండితనాన్ని అవినీతిని సారాకాంట్రాక్టర్ల దౌర్జన్యాలను ఎదిరించడానికి పేద ప్రజలను ఉద్యమింపచేయడం మొదలైనవి.

ఈ విధంగా తమకు చెందాల్సిన న్యాయమైన కోర్కెలకోసం రైతాంగం ఉద్యమిస్తే ప్రభుత్వం ఏంచేసింది? ఆయాగ్రామాల్లో పోలీసుక్యాంపులుపెట్టి పేద ప్రజానీకాన్ని తీవ్రనిర్బంధానికి గురిచేసింది. ఈ పోలీసుక్యాంపులు సిఆర్పి పోలీసు క్యాంపులుగా మారినవి. సిఆర్పి పోలీసులు వచ్చీరావడంతోనే కరీంనగర్ జిల్లా, మహాదేవపూర్ తాలుకా బోర్లగూడెంలో అమ్రునాయక్ అనే లంబాడా గిరిజనరైతును చితకబాది చంపివేసినారు. అక్కడిగ్గూడా పోలీసు అధికారులుపోయి అమ్రినాయక్ కొడుక్కు పోలీసునౌకరిస్తమన్నరు. అయితే గ్రామంలో ఒకరైతు పోలీసు యస్సీతో "అయితె ఊళ్లె అందర్నిచంపి వాల్లకొడుకులను పోలీసులజేత్తరా బాంచెను? అయితె మరి మాఊళ్లె పోలీసుక్యాంపెందుకు?" అన్నడు.

గ్రామీణప్రాంతాల్లో, గిరిజనప్రాంతాల్లో నెలకొనిఉన్న అసమాన ఆర్థిక సంబంధాలనుండి ఉద్భవించే సామాజిక దోపిడీ సంబంధాలను మార్చడానికి గ్రామీణ పేదలను, గిరిజన గిరిజనేతర పేదరైతు-కూలీలను రైతు-కూలీసంఘాల్లో సమీకరించి పోరాడుతుంటే ఇది ప్రభుత్వదృష్టిలో 'కల్లోలం'గా 'అశాంతి'గా పరిణమించింది. కాబట్టి ఈ పోరాటాలనునడిపే విప్లవకమ్యూనిస్టులు పేదప్రజలదృష్టికి 'మీ బతుకులు మీరే బాగుచేసుకోవాలి' అని చెప్పడానికొచ్చిన విప్లవకారులుగా అగుపడితే ప్రభుత్వం దృష్టిలో వారు 'కల్లోలం' సృష్టించే, 'అశాంతి'ని చెలరేపే 'తీవ్రవాదులు'గా మారుతారు. గ్రామీణప్రాంతాల్లో 'అశాంతి' ఎందుకు చెలరేగుతున్నది? గ్రామాల్లో పేదప్రజలకు శాంతిలేదుగనుక. వాళ్ళజీవనంలో శాంతిఎందుకులేదు? వాళ్ళు నిరంతరం దోపిడీకి గురిఅవుతున్నారు గనుక. గ్రామీణ పేదప్రజల కష్టాలు, కడగండ్లు, కోపం అన్నీ ఉద్యమరూపం తీసుకొంటే ప్రభుత్వందృష్టిలో అది "గ్రామీణ అశాంతి"గా మారుతుంది. కల్లోలితప్రాంతంగా మారుతుంది. లేదా ప్రకటించకుండానే తీవ్రనిర్బంధానికి గురిఅవుతుంది. ప్రభుత్వాధికార్లకు, పోలీసుఅధికార్లక్కు ఈ విధంగా గ్రామీణ అశాంతికి, శాంతికిమధ్య గతితార్కిక సంబంధం అర్థంకాదుగాని, "కోడి గుడ్డు పగలకొట్టందే ఆమ్లేటుకాదు" అన్న గతితర్కంమాత్రం చెబుతాడు పోలీసు

డీజిపి. అంటే గ్రామప్రాంతాల్లో పేదప్రజలను నిర్బంధానికి హింసకు గురిచేయనిదే, 'ఎదురుకాల్పుల' పేరిట రైతాంగ కార్యకర్తలను హత్యచేయనిదే 'తీవ్రవాదులు' సృష్టించే 'అశాంతి'ని 'కల్లోలాన్ని' అణిచివేయడం మాకుసాధ్యంకాదు అన్న అప్రజాస్వామికమైన తన కుతర్కాన్ని సమర్థించుకోవడానికి.

తెలంగాణాలో ప్రస్తుతం వరంగల్ జిల్లాతోపాటు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మంజిల్లాల్లోకూడా ఐదేళ్ళకాలంనుండి విస్తరిస్తున్న బలమైన రైతాంగఉద్యమానికి విస్తృతమైన ప్రజాపునాది ఉండడంవల్ల ఎంతనిర్బంధానికి గురిచేసినా, ఎన్ని 'అభివృద్ధి కార్యక్రమాలు' అమలుచేసినా తెలంగాణాలోని ఈ గ్రామాల్లో 'అశాంతి' రోజురోజుకు పెరుగుతున్నదేకాని అరికట్టబడడంలేదు. ఈ విధంగా విస్తరిస్తున్న రైతాంగ ఉద్యమానికి విస్తృతమైన ప్రజాపునాది ఉన్నట్లు ప్రభుత్వం ఇస్తున్న పోలీసు కేసుల వివరాలద్వారానే తెలుసుకోవచ్చును. గ్రామ ప్రాంతాల్లో రైతాంగ కార్యకర్తలపైగాని, ఇతర రైతుకూలీలపైగాని కేసుల్లో ఇరికించినపుడు పోలీసులు తయారుచేసే 'ప్రాథమిక సమాచార నివేదిక' (ఎఫ్ఐఆర్)లో కొందరిపేర్లుండి, 'మిగతా మరికొందరు' అని వ్రాయబడి ఉంటుంది. ఆ మరి కొందరు 10 నుండి 100 వరకైనా ఉండవచ్చు. 1983 సంవత్సరకాలంలో ప్రభుత్వం తెలియచేసిన కేసుల వివరాలప్రకారం, 'తీవ్రవాదులు' సంబంధంకలిగిఉన్న నేరాలసంఖ్య 365. ఈ కేసుల్లో దాదాపు 11,000 మందికి పైగఉన్నారు. పోలీసులు తయారుచేసిన ఈ కేసులన్నీ నిజమైనవికావు. గ్రామాల్లో విస్తరిస్తున్న రైతాంగ ఉద్యమాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేతవిధానాలు ప్రధానంగా (i) గ్రామాల్లో పోలీసుక్యాంపులుపెట్టడం, (ii) చట్టవిరుద్ధంగా నెలలతరబడీ రోజులతరబడీ రైతులను, కూలీలను పోలీసులాకప్పుల్లో, క్యాంపుల్లో నిర్బంధించడం, (iii) పోలీసుక్యాంపుల్లో, లాకప్పుల్లో శారీరకంగా చిత్రహింసలుపెట్టడం, చంపడం (iv) గ్రామస్తులనుండి ఎన్నోరకాల అక్రమవసూళ్ళు, వారితో వెట్టిపనిచేయించుకోవడం. (v) రైతుల పంటలు, ఇండ్లు, ఇంజనుబావులు నాశనంచేయడం, (vi) వీలైతే రైతాంగకార్యకర్తలను 'ఎదురుకాల్పుల' పేరిట కాల్చిచంపడం, లేదా భూస్వాములతో కుమ్మక్కై వారిగూండాలతో చంపించడం మొదలైనవి. 'రాజర్షి' అయిన ముఖ్యమంత్రి గారుకూడా 'హింసను తుపాకీతోనే ఎదుర్కొంటాం' అని 'అణచివేయడం పోలీసులధర్మం'అని రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన పోలీసుల అణచివేతకు ప్రత్యక్షంగానే క్లియరెన్సు ఇస్తాడు. దీన్నిబట్టిచూస్తే ఒక

రచయిత అన్నట్లు, "మన భారతరాజ్యాంగానికి, భారత శిక్షాస్మృతికి ద్వంద్వస్వభావం ఉన్నట్లు కనిపిస్తుంది. ప్రజలకు మేలుచేయడానికి ప్రభుత్వం ఆమోదించిన కొన్ని చట్టాలు నామమాత్రానికి ఉంటాయి. వాటిని నిజాయితీగా అమలుచేయడం సాధ్యం కాదు. వాటిని అమలుచేయడానికి ప్రయత్నిస్తే వెంటనే తద్వ్యతిరేకచట్టాలు అమలులోకి వస్తాయి. ఈ చట్టాలుకూడా భారత రాజ్యాంగపరిధిలో ప్రభుత్వం ఆమోదించినవే. ఇవి చాలకపోతే పోలీసు యంత్రాంగపు గుండాయిజం అమలులోకివస్తుంది" అంటే దీనిఅర్థం సాధారణంగా సర్వజనామోదంపొందిన విషయాన్ని ఆచరణలోపెడితే అది నేరమవుతుంది. కాని అందరు తప్పుఅన్నవిషయాన్ని బహిరంగంగా పాటించినా దానికి శిక్షఉండదుకదా! దావా-ఫిర్యాదుకూడా ఉండదు. ఇదిమన 'పవిత్ర' భారత రాజ్యాంగానికి, భారతీయ శిక్షాస్మృతికున్న నేరప్రవృత్తి

ప్రభుత్వం నిజాయితీగా, చిత్తశుద్ధితో 'అభివృద్ధి కార్యక్రమాలు' అమలుచేయదలుచుకొంటే, మొదట గ్రామాల్లో పోలీసుక్యాంపులెందుకు ప్రవేశిస్తాయి? పేద ప్రజానీకాన్ని తీవ్రమైన నిర్బంధానికి, హింసకు ఎందుకు గురిచేస్తాయి? ఇవి జరిగిన తరువాతనే ప్రభుత్వాధికారుల, 'ప్రజాప్రతినిధుల' 'అభ్యుదయ యాత్రలు' ఎందుకు జరుగుతాయి? ఇవి సమాధానం చెప్పలేనటువంటి 'యక్షప్రశ్న'లేమీకావు. అంటే ప్రభుత్వం న్యాయమైన రైతాంగఉద్యమాన్ని 'శాంతి-భద్రత'ల సమస్యగానే పరిగణిస్తున్నది. గ్రామాల్లోవున్న 'అశాంతి'కి కారణం సామాజికార్థిక అంశాలు అన్నవిషయం ప్రభుత్వం గుర్తిస్తుంది. కాని దాన్ని పరిష్కరించలేదు కాబట్టి, ప్రభుత్వం ప్రజల్లో తన ఫాసిస్టు వికృతస్వరూపం బయటపడకుండా రక్షించుకోగలిగినంతకాలం 'సంక్షేమ' పథకాలు, 'అభివృద్ధి' కార్యకలాపాలు, 'పేదరిక నిర్మూలనా' కార్యక్రమాలు వంటివి ఎన్నింటినో ముసుగుగా అడ్డుపెట్టుకొంటుంది. చారిత్రకంగా పరిశీలిస్తే ఫాసిజం ఎప్పుడూ ప్రజలను మోసంచేసే ఆకర్షణీయమైన నినాదాలతోనే ప్రవేశించింది. జర్మనీలో హిట్లరు 'జాతీయ సోషలిజం'అనే వాదంచాటున నాజీ నియంతృత్వాన్ని ప్రవేశపెడితే, ఇందిరాగాంధి 'గరీబీహటావో' నినాదంతో అధికారంలోకి వచ్చి 1975లో ఇరవైసూత్రాల పథకంద్వారా 'పేదరిక నిర్మూలన' కార్యక్రమాలను ప్రవేశపెడుతూనే ఎమర్జెన్సీనికూడా ప్రవేశపెట్టింది. ఇటువంటి వారికి మద్దతునివ్వడానికి కొన్ని ప్రజావ్యతిరేక రాజకీయపార్టీలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధి విధానాలను సిపిఐ బలపరిస్తే, ప్రభుత్వాధికారుల 'అభ్యుదయయాత్ర'లను పోలీసు అణచివేతను 'దేశభక్తులైన' ఎబివిపి

పాట:

అమ్మలక్కల బతుకులు

రాజశేఖర్

పల్లెపల్లె కంటనీరు
పారుతున్న ఏరుజూడు
పట్టణంలో అమ్మలక్కల
నరలోకపు బతుకుజూడు
తెలుగుదేశం తీరుజూడన్న—ఈ దేశంలో
ఆడపడుచుల బతుకుజూడన్న "పల్లె పల్లె"

కార్యకర్తలు బలపరుస్తారు. పాలకవర్గాల బూటకపు సంస్కరణలను ఎదుర్కొనవడానికి చైతన్యవంతులై విప్లవాత్మక సంస్కరణలు చేపడితే ప్రజలు ఎదుర్కొనేది నిర్బంధం అణచివేత. కాని సమాజంలో క్రమంగా ఆర్థికసంక్షోభం తీవ్రతరమవుతున్నకొద్దీ ప్రభుత్వ ఫాసిస్టు వికృతస్వరూపం బయటపడకతప్పదు. ఇదంతా ప్రభుత్వ యంత్రాంగం ఇప్పుడు అమలుచేస్తున్న హింసను వ్యవస్థీకరించడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమే. దీనికన్నాముఖ్యం ప్రభుత్వాధికారుల, 'ప్రజాప్రతినిధుల' 'అభ్యుదయమూ తలు' న్యాయమైన రైతాంగఉద్యమాన్ని నిర్మూలించ యత్నించే కుట్రలో భాగం అన్నదిమాత్రం అక్షరాలనిజం.

వీటన్నిటికన్నాముఖ్యం, ప్రజాస్వామికవాదులు, మేధావులు, సామాజికశాస్త్రజ్ఞులు సామాజిక అనుభవంనుండీ, నడుస్తున్నచరిత్రనుండి గుర్తించాల్సిన విషయం ఒకటుంది. గుర్తించ నిరాకరించ దలిచినవాళ్ళను, వాళ్ళమౌనానికి వాళ్ళనువదిలేసి మనం ముందుకుపోదాం. వర్గసమాజంలో రాజ్యం మౌలికంగా పాలకవర్గాలచేతుల్లో ప్రజలను అణచివేతకు గురిచేసే సాధనం. అయితే వర్గసమాజంలో 'సంక్షేమ' రాజ్యంఉండీ అది ప్రజల అభ్యున్నతికోసం కృషిచేస్తుందన్న విషయం వట్టిభ్రమ మాత్రమే కాబట్టి రాజ్యాంగయంత్రాంగాన్ని సమూలంగా నిర్మూలించే ప్రజాపోరాటమే దీనికి సరిఅయిన పరిష్కారమార్గం.

— కె. సీతారామారావు

ఆడదంటే ఆదిశక్తని ఆకసానికి ఎత్తినారు
ఆడదంటే అబలఅంటు పాతాళానికి తొక్కినారు
ఆదినుంచీ ఆడదంటె ఆటబొమ్మగజూసినారు
ఇంటిలోన పంటమనిషిగ వంటపొయ్యిలోఉంచినారు
పల్లెపట్నం తేడలేదమ్మా ఓ చెల్లెలార !
ఆడవాళ్ల గతులుఒకటమ్మ "పల్లెపల్లె"

పరకట్నం ఊబిలోన ఊపిరాడని చెల్లెల్లు
పరకట్నం ఉరితాడుకి ఊపిరిచ్చిన అక్కల్లు
అత్తమామల పెత్తనాలకి అలసిపోయినచెల్లెల్లు
కొన్నమొగని కాళ్లకింద నలిగిపోయిన అక్కల్లు
బాధలేని రోజులేదమ్మా ఓ చెల్లెలార
బాధపడని చెల్లెలేదమ్మా "పల్లెపల్లె"

అమ్మపాలన అన్నపాలన అనుభవించే అక్కలార
ఇందిర మన అమ్మగాదు, ఎంటోడు అన్నకాడు
'ఇందిరంటెఇండియా' అనుదొంగమాటలునమ్మకండి
భారతమాత కడుపుకొట్టిన భాగ్యవంతులబిడ్డ ఈమె
ఆరుకోట్ల ఆంధ్రులకు ఆశజూపె అన్నగాడు
కొల్లగొట్టిన కోట్లడబ్బుతొ కులుకుతున్నవేషగాడు
రాబందుల రాజ్యంలోను ఓ చెల్లెలార !
ఇంతకన్న బతుకులేదమ్మా "పల్లె పల్లె"

ఆత్మహత్యలు, మానభంగం వార్తలేనిరోజులేదు
కామందుల కామానికి బలిగమారే అక్కలార
కడుపుగడపక పడుపువృత్తిలొ దిగబడ్డ దీనులార
బతుకుతెరువు కానరాక పరితపించే అమ్మలార
బతుకుమార్గం ఒకటివుందమ్మా ఓ చెల్లెలార
కొంగునడుముకు జుట్టినిలువమ్మ "పల్లెపల్లె"

జరిగినప్రతిరణంలోన అమ్మలక్కల జాడలోన
వీరనారి గున్నమ్మ అడుగువేసిన అడుగులోన
పంచాది నిర్మలమ్మ తెగువజూపిన తోవలోన
అంకమ్మ సరస్వతమ్మ అనుసరించిన బాటలోన
కలిసికట్టుగ మీరు రండమ్మా ఓ చెల్లెలార !
బతుకుజూపె బాటనెల్లాము "పల్లెపల్లె"

పుస్తక సమీక్ష :

జానకి విముక్తి

"మనఇంట్లో
కాంతిపుంజాలు పరుచుకోవడానికి
ఒక్కొక్కతలుపూ తెరిచినట్టు
ఒక్కొక్క మార్క్సు పుస్తకమూ తెరుస్తాం
కాని
అవి చదవకుండా కూడా
ఎవరితో కలిసి కవాతుచేయాలో
యుద్ధంలో ఏవరిపక్షం వహించాలో
మనకు తెలిసిపోతుంది.
మన గతితర్కం
హెగెల్ కటతత్వంనుంచి
వచ్చిందికాదు
మనతుపాకులు వెదజల్లినగుళ్ళ
యజమానుల్ని పరుగెత్తిస్తున్నప్పటి
సమర సంరంభం నుంచి
గతితర్కం
మనకవిత్వంలోకి దూసుకొచ్చింది"

— మయకోవ్‌స్కీ

ఉద్దేశ్యం :

"ఒకవ్యక్తికిఉండే చైతన్యం (భావాలు) చాల 'పాత'ంకంగా ఉన్నప్పుడు దాన్ని అభివృద్ధి పరచదలుచుకున్నవాళ్ళు దానికోసం 'సరైన' పద్ధతిలో ప్రయత్నించకుండా, ఆ వ్యక్తికి చాల తొందరతొందరగా మేలుచేయాలనే ఆరాటంతో ఆ వ్యక్తి చైతన్య స్థాయికి తగనికార్యక్రమం నిర్ణయిస్తే దానివల్ల ఆ వ్యక్తికి నిజమైనమేలు జరగదు- అని చెప్పాలన్నది మాత్రమే మొదట జానకివిముక్తి ప్రారంభించినప్పుడు నా అభిప్రాయం" అని రెండోభాగంలోనూ, "ఇప్పుడున్నసమాజంలో స్త్రీలకేమైనా సమస్యలున్నాయా లేవా, వుంటే అవిఏమిటి, ఆ సమస్యలు ఎందుచేతవున్నాయి, అవి ఎలా పోతాయి. అనేవిషయాలు స్త్రీలకుతెల్పడమే ఈ నవల ముఖ్యోద్దేశం"అని మూడో

భాగంలోనూ ప్రకటించి రంగనాయకమ్మ జానకివిముక్తి అనే పెద్దనవల రాశారు. ఈ రెండు ఉద్దేశాలూ నెరవేరాలంటే ఆయాసమస్యలను, ఆ సమస్యలు తలెత్తే జీవితాన్ని, ముఖ్యంగా జీవితాన్ని. మార్క్సిస్టు భావజాలం నేపథ్యంతో చిత్రించినప్పుడు మాత్రమే సరైన ఫలితం వస్తుంది. తద్వారానే పాఠకులలో మార్క్సిజంపట్ల, సమాజంపట్ల మార్క్సిస్టు దృక్పథం ఇచ్చే విలువలపట్ల ఒక సదవగాహన, పరిచయం ఏర్పడతాయి. జానకివిముక్తి ఈ అంశంలో గుణదోషాలు రెంటినీ చవిచూసింది.

నవలలోని అవగాహనాపరమైన లోపాలనటుంచి, అసలు నవల ప్రణాళిక లోనే ప్రధానలోపం సిద్ధాంతాన్ని వాస్తవజీవితానికి అన్వయించడంగాక ఒక ఊహాత్మక జీవితానికి అంటగట్టడంలో ఉంది మార్క్సిజం పిడివాదం కాదు, అది జీవితానికి మార్గదర్శి. కాని దానికదే జీవితం కాదు. "రాజకీయ నిర్దిష్టత కోసమైనాగానీ, పార్టీ దృఢత్వంకోసమైనాగానీ మార్క్సిజాన్ని గణితంలాంటి ఖచ్చితమైనసూత్రం స్థాయికి కుదించలేం. ఆటోమాటిక్ యంత్రంమీది పనిలాగా దాన్ని ఒక ప్రామాణిక పద్ధతిగా కూడా పరిగణించలేం. మానవ సమాజంలో పరిశీలించబడుతున్న పదార్థం ఎన్నెన్నో మార్పులతో ఉంటుంది. స్వయంగా పరిశీలకుడుకూడ పరిశీలిస్తున్న జనాభాలో భాగమే. వాళ్ళతో అతను పరస్పరం దృఢంగా ప్రతిచర్యకు గురవుతూనే ఉంటాడు. అంటే సిద్ధాంతాన్ని సక్రమంగా అన్వయించడానికి విశ్లేషణాశక్తి పెరగాలన్నమాట. ఒక నిర్దిష్టపరిస్థితిలోని ప్రధానాంశాలను గుర్తించగలిగిన నేర్పు ఉండాలన్నమాట. ఇది పుస్తకాలద్వారా మాత్రమే రాదు. విస్తృత ప్రజాబాహుళ్యంతో సంబంధంలో ఉండ టమే ఇది నేర్చుకోవడానికి ఒకమార్గం.... ఒకకార్మికునితో, రైతుతో కలిసి జీవించి పొందిన అనుభవాల్ని అధ్యయనంద్వారా నిరంతరం మెరుగుపెట్టుకోవాలి, అంచనా వేసుకోవాలి." అని కొశాంబీ జీవితానికీ, సిద్ధాంతానికీ ఉండవలసిన సంబంధాన్ని సరిగా చెప్పారు. 'జానకివిముక్తి' ఈ అవగాహనలో జీవితంపాత్రను తగ్గించి, సిద్ధాంతంపాత్రను పెంచింది. అందువల్లనే ఈ నవల కొన్ని విషయాలలో సరైన అంశాలను ప్రతిపాదిస్తూనే, మరికొన్ని తప్పుడు అవగాహనలకు తావిచ్చింది. కనుక నవల కథను క్లుప్తంగా తెలుసుకొని తర్వాత వివరమైన చర్చచేయడం సముచితంగా ఉంటుంది.

కథ :

జానకీ, సత్యం, మూర్తి, శాంత, వెంకట్రావు ఈ నవలలో ప్రధానపాత్రలు. జానకి, సత్యం హైదరాబాదులో మంచి అభిప్రాయాలుగల తండ్రి పెంపకంలో స్వేచ్ఛగా పెరుగుతారు. జానకికి పదహారోఏట వెంకట్రావుతో పెళ్ళిచేస్తారు. ఎమ్మెస్సీ చదివి, విజయవాడలో ఏదోఉద్యోగం చేస్తున్న వెంకట్రావు ఒక 'భర్త'. భర్తగా ఎన్ని అవలక్షణాలు ప్రదర్శించగలడో, ఎంతఫ్యూడల్‌గా ఉండగలడో అంత ఫ్యూడల్‌గా ఉంటాడు వెంకట్రావు. ఓవైపు వెంకట్రావు భర్తరికమూ, మరోవైపు వెంకట్రావు తల్లిపెట్టే హింసలతో పదహారేళ్ళ జానకి ఉత్సాహమంతా చచ్చిపోతుంది. వెండి పళ్ళెం రాలేదనే సాధింపులదగ్గర మొదలుపెట్టి పరాయిమగాడివైపుచూస్తే అనుమానపడేంతవరకూ వెంకట్రావూ, అతనితల్లీ జానకిని చెరపడతారు. వెంకట్రావు 'భర్త' అందరిలోకీ ప్రథముడుగనుక జానకికి శారీరకహింసలుకూడ తప్పవు. ఈ పరిస్థితిలో అన్న సత్యం ఆమెకష్టాలుచూసి సహించలేకపోతాడు. అతనికప్పటికే మూర్తి అనే కమ్యూనిస్టుతో స్నేహమూ, కమ్యూనిజమంటే చాల అభిమానమూ, కొంచెం పరిచయమూ ఉంటాయి. జానకిని కష్టాలలోంచి రక్షించాలనే ఆరాటంతో సత్యం ఆమె "చైతన్యస్థితి చూడకుండా" వెంకట్రావునుతన్ని జానకిని తనతోపాటు హైదరాబాదు తీసుకెళ్తాడు. వెంకట్రావు వదిలెయ్యడానికి అర్హుడని జానకి నిర్ణయించుకోకముందే, సత్యం ఆమెకోసం ఆ కర్తవ్యాన్ని నిర్ణయించడం తప్పని మూర్తి బోధిస్తాడు. చెల్లెలిబాగుకోసం ఆరాటపడ్తున్న సత్యానికి ఆమాటలేవీ చెవికెక్కవు. మళ్ళీ వెంకట్రావు హైదరాబాదుచేరి జానకితో కాస్తప్రేమగామాట్లాడి, ఆమెనునమ్మించి వెనక్కి తీసుకొచ్చేస్తాడు. మళ్ళీవచ్చాక జానకి స్వేచ్ఛకు మరికొన్ని పరిమితులొస్తాయి. ఘర్షణపడికూడా నెలకు మూడురోజులు బైటకూచునే అలవాటు మానడానికి ఒప్పించలేకపోతుంది. చలంపుస్తకాలు చదవడం పెద్దనేరమైపోతుంది. ఇంటర్ చదువు మాటెత్తే వీలేఉండదు. ఈ నిర్బంధంలోంచే వెంకట్రావు అప్పుడప్పుడు జానకిని నమ్మించే ప్రేమకురిపిస్తూ, జానకిని తాత్కాలికంగా భ్రమల్లోముంచుతూ ఉంటాడు. ఈ నిర్బంధాలూ, భ్రమలూ, హింసలూ అన్నీ ఇక భరించలేనిదశకుచేరి, జానకి వెంకట్రావును పూర్తిగావదిలేసే ఉద్దేశ్యంతోనే ఓ అర్ధరాత్రిపూట ఇల్లువిడిచి బైటపడుతుంది. మూర్తిసాయంతో హైదరాబాదుచేరుకుంటుంది. తల్లిభయంతో ఆమోదించలేకపోయినా, సత్యం చెల్లెల్నిఆదరించి, ధైర్యంనూరిపోస్తాడు. జానకి వ్యక్తిత్వం ఎదిగేందుకు వీలైనపరిస్థితులు కలిపిస్తాడు. జానకి వ్యక్తిత్వం రూపొందుతున్న తరుణం

లోనే సత్యం స్నేహబృందమైన స్టడీసర్కిల్‌తో జానకికి పరిచయం కలుగుతుంది. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని చర్చించుకుంటూఉండే స్టడీసర్కిల్‌లో జానకితోపాటు శాంత ఉష, శారద, ప్రభాకర్, మోహన్ తదితరులెందరో ఉంటారు. మార్క్సిజాన్ని అర్థంచేసుకుంటూ, సొంతబతుకుకోసం అన్వేషిస్తూ జానకి ఒక బిస్కట్‌కంపెనీలో చేరుతుంది. వెంకటావును వదిలేసేసరికే గర్భిణిగాఉన్న జానకికి బాబుపుడతాడు. బాబుకు జానకి బ్రూనోఅని పేరుపెట్టుకుంటుంది. వెంకటావునుంచి విముక్తిలో లభించిన స్వేచ్ఛలో జీవిస్తున్న జానకీ, స్టడీసర్కిల్ మిత్రుడు ప్రభాకర్ ఒకరికొకరు దగ్గరవుతారు ఈలోగా శాంత, సత్యం పెళ్ళితంతు ఏదీలేకుండానే సహజీవనం సాగించడం ప్రారంభిస్తారు. జానకి తనపరిధిలో తన విజయవాడ మిత్రురాలు విశాలాక్షికి మార్క్సిజం నేర్పడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తుంది- ఇదీ నవలలోకథ.

పాత్ర చిత్రణ :

ఈ నవలలో ముఖ్యమైనలోపం పాత్రలు కారెక్టర్స్ కాక కారికేచర్స్‌కావడం. ముఖ్యంగా వెంకటావు, అత్త పాత్రలు పూర్తిగా కారికేచర్‌లే, వాళ్ళదుర్గుణాలన్నీ విపరీతంగా పెంచిరాయడం జరిగింది. ఇలా పాత్రలు కారికేచర్స్ అయినందువల్ల ఒక సౌలభ్యంఉన్నమాట నిజమే. ఆ పాత్రలపట్ల పాఠకులలో అసహ్యాన్ని కలగచేయడం చాలసులభమవుతుంది. కాని అందువల్లనే వచ్చేలోపంకూడ ఒకటిఉంది. 'మామూలుభర్తలూ, అత్తలూ అలాఉండర'ని సాధారణ పాఠకులు కొట్టిపారేసే అవకాశం ఎక్కువ. ఇలా కారికేచర్స్‌కాకుండా వాస్తవికపాత్రలను, కారెక్టర్స్‌ను సృష్టించినా ఎల్లకాలపు వెంకట్రావులు కాకపోయినా, ఏదో ఓక్షణంలో వెంకట్రావుగా మారే వాళ్ళ మనచుట్టూ ఎంతోమంది ఉన్నారు. కారికేచర్‌సృష్టిలో మరొకలోపం కూడఉంది. ఈ వెంకట్రావు భర్తృకంలో కారికేచర్ అయితే, మరొక వెంకట్రావుని మించిన మగకారికేచర్‌కూడ ఉండవచ్చును. ఉదాహరణకు ఈ వెంకట్రావు భార్య మీదనే అధికారం చలాయిస్తాడుగాని, తల్లి, చెల్లెళ్ళపట్ల బాగానేఉంటాడు. ఇతర స్త్రీలందరిపట్ల మగ దురహంకారాన్ని ప్రదర్శించే మగవాళ్ళకూడ ఉండవచ్చునుగద. కనుక ప్రాథమికంగా కారికేచర్ సృష్టిలో ఈ అసహజత్వంఉంది.

వైరుధ్యాలు :

ఈ నవలలో మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని వీలైనంత సులభంగా వివరించే ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా వైరుధ్యాలగురించి చాల విపులంగా చర్చించడం

జరిగేది. తత్వశాస్త్రాన్నంతా ఒక్కచోట ముద్దలా, పిడివాదంలాకాక సులభంగా, చిన్నచిన్నమాటల్లో, వేరువేరుచోట్ల వివరించారు. వాచ్యంగా చెప్పిందానికన్న ఎక్కువగా అభిప్రాయాలలో మార్క్సిస్టులు తీసుకునే దృక్పథం ఆధారంగా తత్వశాస్త్రం ఇచ్చే ప్రాపంచికదృక్పథాన్ని ఎక్కువగా అర్థంచేయించారు. ఐతే వైరుధ్యాల విషయంలో మిత్రువైరుధ్యం, శత్రువైరుధ్యాలగురించి చాల తప్పుడు అవగాహనకు దారి తీసే వివరణ ఇచ్చారు. "ఒకవైరుధ్యం పరిపక్వదశకు చేరేటప్పటి దానిలో "ఘర్షణ" పూర్తిగాపోయి, ఐక్యతే నిలిచిందంటే ఆవైరుధ్యం మొదటినుంచీ మిత్రువైరుధ్యం అన్నమాట. అంటే విరుద్ధాంశాలు సహజంగా మిత్రువైఖరి కలిగినవన్నమాట. అలాగే ఒక వైరుధ్యంలో ఐక్యత పూర్తిగా పోయి, అది చివరికి ఘర్షణతో ముగిసిందంటే అది మొదటినుంచీ శత్రువైరుధ్యం అన్నమాట. అంటే దానివిరుద్ధాంశాలు సహజంగానే శత్రువైఖరి కలిగినవన్నమాట" (జానకివిముక్తి. 2 226) అని వివరించారు.

దీన్నిబట్టి పాఠకుడికి పరిపక్వమయితేనేగాని అది మిత్రువైరుధ్యమో, శత్రువైరుధ్యమో తెలుసుకోవడం వీలుకాదనే అభిప్రాయం కలుగుతుంది. ఇది పూర్తిగా తప్పు. వైరుధ్యం పరిపక్వంకావడం అంటూ ఏమీఉండదు. వైరుధ్యం ఏర్పడడం, పరిష్కారంకావడం ఉంటాయి. ఒక వైరుధ్యాన్ని పరిష్కరించగానే దానిలోని రెండు ఐక్యఅంశాలమధ్యనే వైరుధ్యం మౌలికంకావచ్చును. శాశ్వత వైరుధ్యాలేవీ ఉండవు. అలాగే శాశ్వతంగా మిత్రువైరుధ్యాలుగానీ, శత్రువైరుధ్యాలుగానీ ఉండవు. మిత్రువైరుధ్యం శత్రువైరుధ్యంగాగానీ, శత్రువైరుధ్యం మిత్రువైరుధ్యంగాగానీ మారడం కూడ సర్వసాధారణంగా జరుగుతూనే ఉంటుంది. రంగనాయకమ్మ వాదనలో పరిపక్వం అనేమాట పరిష్కారం అనేమాటకు ప్రత్యామ్నాయంగా వాడారనుకున్నా పరిష్కారం అయ్యేదాక వైరుధ్యలక్షణం తెలియదనడంకూడతప్పే. ఈ సైద్ధాంతికమైన తప్పుడు అవగాహనవెనుక తీవ్రంగా అభ్యంతరకరమైన అంశం మరొకటిఉంది. మార్క్సిస్టులు వైరుధ్యాలను కనిపెట్టడం, ప్రధానవైరుధ్యాన్నీ, మిత్రు, శత్రు వైరుధ్యాలనూ నిర్వచించుకోవడం ఆచరణకోసం, కార్యక్రమంకోసం చేస్తారు. ఒక వైరుధ్యంఎలాంటిదని నిర్వచించుకుంటే అందుకు తగినట్టు కార్యక్రమం ఉంటుంది. అసలు వైరుధ్యలక్షణమే తెలియదంటే కార్యక్రమమే ఉండదన్నమాట. రంగనాయకమ్మ వాదనద్వారా ఉద్దేశ్య పూర్వకంగానో, అనుద్దేశ్యపూర్వకంగానో తెలియజెప్పే విషయం ఇదే.

చారిత్రిక దృక్పథం

మార్క్సిస్టు తత్వశాస్త్రంలో ప్రధానమైన అంశం చారిత్రిక భౌతికవాదం. చరిత్రపట్ల సరైన అవగాహన, దృక్పథం లేకుండా మార్క్సిస్టు భావజాలంలోని మరే అంశాన్నీ అర్థంచేసుకోలేం. అసలు మార్క్సిస్టు చారిత్రికదృక్పథం అలవరచు కోకుండా ప్రపంచంలోని ఏ విజ్ఞానానికి సంబంధించీ సరైన అవగాహనకు రాలేం. అలాంటి మార్క్సిస్టు చారిత్రిక దృక్పథానికి నవలలో అతితక్కువ స్థానం ఇచ్చారు. చారిత్రిక భౌతికవాదం సమాజాన్ని ఎన్నెన్ని దశలలో పరిణామం చెందినట్లుగా విశ్లేషిస్తుందో మాత్రము చాలక్లుప్తంగా చెప్పారు. “సమస్యల పరంపరలో దేన్నిబట్టి ఏది పుట్టుకొస్తుందో తెలిస్తేనే, దేన్నిబట్టి ఏది పరిష్కారమవుతుందో కూడ తెలుస్తుంది. సమస్యలు పరిష్కారమవాలంటే ఏదిముందో, ఏదివెనకో వాటిస్వభావాన్నిబట్టి అవే ఒక క్రమాన్ని తీసుకుంటాయి. వాటికవే ఒక క్రమంలో నిలబడతాయి. కమ్యూనిస్టులు ఆ క్రమాన్ని నిర్ణయించరు. దాన్ని అర్థంచేసుకుంటారు. గ్రహిస్తారు. గ్రహించి ఆ క్రమానికి తగ్గట్టుగా పనిచేస్తారు” (3. 110) అని మార్క్సిస్టు చారిత్రిక దృక్పథాన్ని, చారిత్రికక్రమం భావనను సరిగానేచెప్పారుగాని ఈ పుస్తకానికి చరిత్రను నేపథ్యంగా ఉంచలేదు. ఒక చారిత్రిక క్రమంలో తాము చైతన్యవంతంగా పాల్గొనడమే విప్లవ కారుల కార్యక్రమం. మూర్తి ఐనా, సత్యంఐనా ఒక చారిత్రిక క్రమపు చారిత్రక శక్తులే. ప్రజలే చరిత్రనిర్మాతలు. కాని వాళ్ళుకూడ తమ ఇష్టప్రకారం చరిత్రను నిర్మించలేరు. బానిస సమాజంనుంచి సోషలిస్టు సమాజాన్ని నిర్మించలేరు. ఒక చారిత్రిక క్రమంలో తమవంతుపాత్రను నిర్వహిస్తూ చరిత్రను నిర్మిస్తారు. ఐతే ఈ పాత్ర నిర్జీవయంత్రాలలాగకాదు, సజీవచైతన్యంగల మానవులుగా నిర్వహిస్తారు. సామాజిక గతిసూత్రాలకూ, భౌతికశాస్త్ర గతిసూత్రాలకూ తేడాఇదే. రంగనాయకమ్మ నవలలో ఈ సామాజిక గతిసూత్రాలనూ, ఈ క్రమంలో ప్రజలపాత్రనూ నిర్లక్ష్యం చేసి, చారిత్రక నేపథ్యంలేకుండా చేశారు. కథను చరిత్రతో అనుసంధానించక పోవడం, చారిత్రిక దృక్పథం కలిగించేందుకు స్పష్టంగా ప్రయత్నించక పోవడం ఒకలోపమైతే మరొకలోపం కాలాన్నికూడ గణనలోకి తీసుకోకపోవడం. చాల కనీసమూ సాధారణమూఐన కాలాన్నికూడ పట్టించుకోకపోతే, నవల ఏకాలంలో ఇముడుతుందో చెప్పకపోతే తప్పే. కాలంచెప్తే చారిత్రక క్రమాన్ని ప్రస్తావించవలసి వస్తుందని తెలుసుగనుకనే రంగనాయకమ్మ కాలాన్నికూడా దాచేశారు. ఐతే గ్రూపుల ప్రస్తావనకూడ వచ్చిందిగనుక, ఒకచోట పరోక్షంగా ఇంద్రవెల్లి సంఘటన ప్రస్తావన

ఉందిగనుక ఈ నవల 1975-81 మధ్యకాలంలోదని అనుకోవాలి. ఈకాలపుప్రధాన సంఘటనలేవీ పుస్తకంలోకి రాలేదు. ఆయా సంఘటనలపట్ల ఈ నవలా పాత్రలు ఎలా స్పందించారో తెలియదు. సమాజం పరిస్థితులకూ, ఉత్పత్తి సంబంధాలకూ కాక కొందరు వ్యక్తులకే, అదీ పరిచయస్తులకే పరిమితమైపోవడం సాహిత్యంలో భావవాదధోరణే అవుతుంది.

మళ్ళీ చరిత్రదగ్గరికివెళ్తే చరిత్ర, చారిత్రక భౌతికవాద దృక్పథం మార్క్సిస్టుల చేతుల్లో అద్భుతమైన శాస్త్రీయమైన సిద్ధాంతాలని రంగనాయకమ్మ గుర్తించినట్టే తోచదు. పుస్తకంలో ఎన్నెన్నివాదనలకు చారిత్రక భౌతికవాద దృక్పథంనుంచీ, గతం నుంచీ, వర్తమానంనుంచీ అద్భుతమైన జవాబులు ఇవ్వవచ్చును! ఒక్క ఉదాహరణ చెప్పాలంటే ప్రభాకర్‌కూ, జానకికీ దేవుడి ఉనికిగురించి వాదనజరుగుతుంది. (3. 338-361). సుందరమ్మకూడ జానకివైపు చేరుతుంది. మధ్యలో శారద, సత్యంకూడ వస్తారు. వాదన సాగినంతసేపూ ప్రభాకర్ విజ్ఞానశాస్త్రాల ఆధారంతో జానకి, సుందరమ్మల దైవభక్తిని, శారద సందేహాల్ని పోగొట్టాలని చూస్తాడు. వాదన ఎటూతేలకుండా ఎంతోసేపు సాగుతుంది. (ఇరవైమూడు పేజీలపాటు !). చివరికి దేవుడు స్వయంభువుఅని సుందరమ్మ, జానకి తేల్చేస్తారు. కనుక వాడిని ముందుఎవడో పుట్టించాల్సిన అవసరంలేదని, వాడేపుట్టి అన్నిటినీ పుట్టించాడనీ అంటారు. ప్రపంచానికి మొదలేమిటని ప్రభాకర్‌ను ప్రశ్నిస్తారు. దానికి ప్రభాకర్ ప్రపంచం భౌతికమనీ, కనుక దానికి మొదలంటూ ఏమీఉండదని, లేదని జవాబిస్తాడు. శాస్త్రీయంగా ఇది సరైందే. భౌతికమైన పదార్థ ప్రపంచానికి మొదలంటూ ఏమీలేదు, రూపంలో మార్పుమాత్రమే ఉంది. ఐతే పదార్థ ప్రపంచంఅంటే ఏమిటో తెలియని వాళ్ళకి వాళ్ళు దేవుణ్ని ఆదిమధ్యాంతరహితుడని అన్నట్టుగానే, మనమూ ప్రకృతిని ఆదిమధ్యాంతరహితమని అన్నట్టు తోస్తుంది. అందుకే ఈ సమస్యకు ఇంకా సరైన జవాబు దేవునిపుట్టుకను చారిత్రకంగా వివరించడం. పదార్థంనుంచి చైతన్యం వస్తుందని, అలా మెదడుగా అత్యున్నత రూపానికి చేరుకున్న పదార్థమే ఆలోచనకు ఆధారమైందనీ, ఆ ఆలోచనలోనే దేవుడు ఉద్భవించాడనీ చరిత్ర ఆధారంతో చెప్పడం సబబుగానూ, కన్విన్సింగ్‌గానూ ఉంటుంది. విజ్ఞానశాస్త్రాలు తెలుసుకోవలసింది ఇంకా ఎంతోఉంది. అది జవాబుచెప్పవలసిన ప్రశ్నలు ఇంకెన్నో మిగిలిఉన్నాయి. చరిత్ర స్థూలంగా మనకు దాదాపు అంతాతెలుసు. కనీసం చారిత్రక పరిణామక్రమం శాస్త్రమంత ఖచ్చితంగాతెలుసు.

సాంస్కృతిక సమరరంగంలో రాజకీయ పాఠంగా ప్రజా సినిమా

మిత్రులు సురాగారి అభిప్రాయం (సృజన, జనవరి, 1984 సం. 147) చూసాక నా అభిప్రాయం తెలియజేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ఓ ప్రముఖ వ్యాపారపత్రికటనలో వచ్చిన సినిమావ్యాసం నాదికాదు. అది నా పేర మాత్రమే వచ్చింది. ఆ వ్యాసంలోని అభిప్రాయాలకూ నాకూ ఎలాంటి సంబంధంలేదని ఆ పత్రికకే ఓలేఖరాసాను. ప్రచురించలేదు.

ఐతే ఈవిషయాన్ని ఓ మిత్రునిద్వారా సురాగారికి తెలియజేసాను. అంతేకాదు వారికి ఏ పరిస్థితుల్లో వ్యాసంవచ్చిందోకూడా తెలియజేస్తూ వివరంగా లేఖరాసాను. అర్థంచేసుకున్నారని భావించాను.

సూచనలు ఎవరైనాచేయవచ్చు. కాని అవి ఆచరణీయమా కాదాఅని మేధావులు ఆలోచిస్తారు. అంతేకాని సూచించినవారి వేళ్ళను తప్పుగాచూడ్డం ప్రజాసాహిత్యం, కళల్నిగురించి ఆలోచించేవారు చేయకూడనిపని. వందభావాలూ, వందపూలు వికసించనీ

ఏ కళారూపమైనా పోరాటంలో కొత్తరూపమెత్తి, పోరాటావసరాలను తీర్చే పద్ధతిలో మారుతుంది. సినిమాకళకూడా రష్యాలోనూ (ఇప్పటిరష్యాకాదు) తదితర దేశాల్లో (అర్జంటీనా, లాటిన్ అమెరికా మొ॥ దేశాల్లో) విప్లవసినిమాగా అభివృద్ధి చెందింది. ఇది కాదనలేం. ఐతే అలాంటిసినిమాలు ప్రస్తుతం తీయాలని అభిప్రాయం కాదు. అలాంటిచిత్రాలు అందుబాటులోఉంటే ఉపయోగించుకోవచ్చు.

ఆడియోవిజువల్ మీడియం శక్తివంతమైనదే అని ఒప్పుకుంటే, ఫిల్ అవుతే ఉపయోగించేవారినిబట్టి దానిప్రయోజనం ఉంటుంది. ఐతే వర్తమానంలోని ఈ నిర్బంధవాతావరణంలో ఇదిసాధ్యమా ? అంటే నిర్బంధంలోంచే కళలు ఉప్పెనలా లేచి, మార్పుచెంది ప్రజావసరాలకు ఉపయోగపడుతాయి. ఇది చారిత్రిక సత్యం.

అలాలేదూ ఇలాలేదన్నట్లు ఆచరణలో ఈ మీడియాని ఉపయోగించుకోకుండానే అసాధ్యమని కొట్టివేయడం ఊహాజనితమేకదా.

నావ్యాసంలో పౌరహక్కుల సంఘాలకేకాదు. రాజకీయఉద్యమాలకీ అవసరపడుతుందని భావించాను. ఐతే కొంతసాంకేతిక నైపుణ్యం, పరిచయంలేకపోవడం మరియు కొంతడబ్బుతోకూడుకున్న పనికాబట్టి, వెంటనే అమలుజరక్కపోవచ్చు.

ఇలాంటి కార్యక్రమాలు వ్యక్తులుకాదు గ్రూపులేచేయాలి. గ్రూపులకూ అలాంటి ఆర్గనైజేషను కష్టాలూ ఉండవచ్చు. కాని ఆ మీడియాని మనకైమనమే దూరంకొట్టవలసిన పనిలేదు.

ఒక రాజకీయ అవగాహనతో విశాల విప్లవపరిధిలో ఆలోచిస్తే ఈ మీడియాని తీసుకుపోవచ్చు.

ఇది నా వ్యక్తిగతమైనదీను, నా పరిమితజ్ఞానంతో చెప్పిందీను. సురాగారే అన్నట్టు సూచనే. కాని వినాదంగా ఇవ్వలేదు.

ఇప్పటికే కొన్నిసంఘాలు ఈ మీడియాని ఉపయోగించుకోవడానికి ప్రియత్నాలు మొదలుపెట్టినట్లు తెలిసింది.

ఫలితం భవిష్యత్తూ, విప్లవోద్యమాలే నిర్ణయిస్తాయి. వ్యక్తులుకాదు. ఈ చర్చని వ్యక్తిగతంగా చూడవద్దని విన్నవించుకొంటున్నాను. వ్యక్తులు నిమిత్తమాత్రులు. మారుతున్న ఆధునికకాలంలో విప్లవోద్యమావసరాలు మాత్రం వాస్తవం. ఈ సామాజిక వాస్తవికతలోంచి ఆలోచిద్దాం.

— జయధీర్ తిరుమలరావు

Statement about ownership and other perticulars about

SRJANA

FORM IV (See Rule 8)

1. Place of Publication ... ... Warangal
2. Periodicity of its publication... Monthly
3. Printer's Name ... ... P. Hemalatha
   Whether citizen of India? ... Yes
   Address ... ... 3-7-82/4, Kumarpally, Hanamkonda 506001.
4. Publisher's Name ... ... P. Hemalatha
   Whether citizen of Indian?... Yes
   Address ... ... (same as above)
5. Editor's Name ... ... P. Hemalatha
   Whether citizen of India? ... Yes
   Address ... ... (same as above)

I, P. Hemalatha hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S/d– **P. Hemalatha**
Publisher.

Date :
March 1, 1984

మిహాయిల్ షొలఖొవ్



"ఒక రచయిత తనదేశపు జీవితాన్ని జీవించాలి. తన ప్రజలబాధల్ని అనుభవించాలి. వాళ్ళ ఆనందాలతో సంతోషంపొందాలి. వాళ్ళజాగ్రత్తలను, వాళ్ళఅవసరాలను పంచుకోవాలి. అప్పుడు అప్పుడుమాత్రమే అతను తన పాఠకుల హృదయాలను కదిలించగల నిజమైన పుస్తకాన్ని సృష్టించగలడు"- షొలఖొవ్.

తొలి సోషలిస్టురాజ్యం బతికిఉన్న రోజుల్లో వర్ధిల్లిన సోషలిస్టు వాస్తవిక సాహిత్యకారులలో మిగిలిన చిట్టచివరి రచయిత మిహాయిల్ షొలఖొవ్ తన డెబ్బై ఎనిమిదోఏట ఈ ఫిబ్రివరి 20న మరణించాడు- నోబెల్ సాహిత్య బహూమతిపొందిన సోవియట్ నవలాకారుడుగా పత్రికలు కీర్తిస్తున్న షొలఖొవ్ జీవితం నిజానికి నోబెల్ప్రైజ్కన్న మరెంతో ఎత్తుకు ఎదిగింది.

1905లో డాన్నదీ తీరప్రాంతాన పుట్టిన షొలఖొవ్ బాల్యంలో దేశంలోసాగుతున్న అంతర్యుద్ధాన్ని అనుభవించాడు. ఆ యుద్ధమే ఆయనకు పాఠశాలఅయి ఆయన విప్లవాకాంక్షలను తీర్చిదిద్దింది, కళానైపుణ్యానికి పదును పెట్టింది. పద్దెనిమిదోఏటనే ఆయన రచనలు అచ్చుకెక్కడం మొదలయింది. ఇరవయోఏట ఆయన తొలి కథాసంకలనం ప్రచురితమయింది. ఇరవైమూడోఏట అచ్చయిన రెండు కథాసంకలనాలూ, 'అండ్ క్వైట్ ఫ్లోస్దిడాన్' నవల మొదటిభాగం ఆయనను వెంటనే దేశవ్యాప్తంగానూ, ప్రపంచవ్యాప్తంగానూ మంచి రచయితగా నిలబెట్టాయి, తర్వాత 'అండ్ క్వైట్ ఫ్లోస్ ది డాన్' రెండో, మూడోభాగాలు వెంటవెంటనే వెలుగుచూశాయి. డాన్ నదీప్రాంతపు కొసక్జాతి ప్రజలజీవితాన్ని చిత్రిస్తున్న ఈ నవలాకారుడు అప్పుడిక తన రచనా వ్యాసంగానికి కొంచెం విరామంఇచ్చి, తన ప్రాంతంలోనే 'సహకార క్షేత్రాల' కార్యకర్తగా పని చేయవలసి వచ్చింది. సహకారక్షేత్రాలు ఏర్పరచడంలో, పార్టీనిర్ణయాలను సక్రమంగా అమలుపరచడంలో, సహకారక్షేత్రాలను వ్యతిరేకించే కులక్ల కుట్రలను ఎదుర్కోవడంలో పొందిన విలువైన అనుభవాలు షొలఖొవ్తో 'వర్జిన్ సాయిల్ అప్ టర్న్డ్' ('బీళ్ళుదున్నేరు' పేర విశాలాంధ్ర వాళ్ళు తెలుగులో ప్రచురించారు) నవల రాయించాయి. 1932లో ఆ నవల అచ్చు కాగానే అది మొదటిభాగమేననీ, రెండోభాగంకూడ రాస్తున్నాననీ షొలఖొవ్ ప్రక

టించాడు, కాని ఆపని పక్కనపెట్టి, 'అండ్ క్వైట్ ఫ్లోస్ ది డాన్' నాలుగోభాగం పూర్తి చేయాల్సిన అవసరం వచ్చింది. అది పూర్తవుతూనే రెండో ప్రపంచయుద్ధం ముంచుకొచ్చింది. జులై 1941లో ఆయన రెజిమెంటల్ కమిసార్‌గా యుద్ధంలో చేరి పోయాడు. యుద్ధరంగంనుంచి ఒకచేత వార్తలుపంపుతూ, మరోచేత భీకర ఘర్షణల్లో స్వయంగా పాల్గొంటూ ఆయన నాలుగేళ్ళు గడిపాడు. అక్కడఉంటగానే, డాన్ నదీతీరాన వెషెన్‌స్కాయాలోని ఆయన ఇంటిమీద నాజీబాంబులు పడ్డాయి. ఆయన తల్లి మరణించింది. దాదాపు పూర్తయిఉన్న 'వర్జిన్ సాయిల్ అప్‌టర్న్‌డ్' రెండో భాగం రాతప్రతితోపాటు ఆయన కాయిదాలెన్నో ధ్వంసమైపోయాయి. యుద్ధంనుంచి తిరిగిరాగానే ఆయన 'వర్జిన్ సాయిల్ అప్‌టర్న్‌డ్' రెండోభాగం మొదటినుంచీ మళ్ళీ రాయడంతోపాటు తన యుద్ధానుభవాలకు అక్షరరూపం ఇవ్వడం ప్రారంభించాడు. తత్ఫలితంగా 'ది ఫేట్ ఆఫ్ ఎ మాన్' వంటికథలు, 'ది సైన్స్ ఆఫ్ హేట్', 'దే ఫాట్ ఫర్ దెయిర్ కంట్రీ' వంటి పుస్తకాలు వెలువడ్డాయి. 1959 నాటికి 'వర్జిన్ సాయిల్ అప్‌టర్న్‌డ్' రెండోభాగం పూర్తయిపోయింది.

జీవన సంఘర్షణా కళా, నిబద్ధతా వ్యక్తీకరణా, యుద్ధమూ సాహిత్యమూ కలగలిపి సాగిన షొలఖొవ్ జీవితంలో సోవియట్ రివిజనిస్టు సంవత్సరాలు దాదాపు 'నిశ్శబ్దవర్షాలు'గానే మిగిలిపోయాయి. కొన్నిఉపన్యాసాలూ, వ్యాసాలూతప్ప గత రెండుదశాబ్దాలుగా ఆయన గొంతు మూగవోయిందనే చెప్పాలి. ఈ నిశ్శబ్ద వర్షాల లోనే ఆయన యుఎస్‌ఎస్ఆర్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సభ్యుడయ్యాడు. లెనిన్ బహుమతి, నోబెల్ సాహిత్యబహుమతీ గెలుచుకున్నాడు. ఈ బహుమతులనూ, రెండుదశాబ్దాల మౌనాన్నీదాటి విస్తరించిన ఆయన సాహిత్యవ్యక్తిత్వానికి, సోషలిస్టు వాస్తవికతకు ఆయన అందించిన కానుకలకు సృజన ఆయనకు జోహార్లుతెలుపుతోంది.

పుస్తకస్వీకారం

1. జ్వలనమే (కవితా సంపుటి)- రాధేయ : పే. 46 : వెల : 5 రూపాయలు ప్రతులకు : 1. రాధేయ, అధ్యక్షుడు. సాంస్కృతీసమాఖ్య, పందిళ్లపల్లె, కమలాపురం, కడప- 516 291? 2. ఉమ్మడిశెట్టి సుబ్బరాయుడు, ఉమ్మడిశెట్టి శిల్పా సెంటర్, ముద్దనూరు - 516 380.
2. అణువుపగిలింది (కవితాసంపుటి) - తాతా రమేష్‌బాబు; పేజీలు : 56 వెల : 4 రూ. లు. ప్రతులకు : టి. రమేష్‌బాబు, S/o టి. బసవలింగం, డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, గుడివాడ.
3. పునరుద్ధరణవాద ప్రతిఘటన వర్గపోరాటంలో భాగంగా సాగాలి (ప్రసంగ వ్యాసం)- జస్టిస్ ఒ. చిన్నపరెడ్డి; పేజీలు : 16: వెల : 0.50 పైసలు; ప్రతులకు : మైత్రిబుక్‌హౌస్, లక్ష్మీపేట, విజయవాడ - 10

(4వ కవర్ తరువాయి)

19.	లాల్ బనో గులామీ ఛోడో - బోలో వందేమాతరం - ఎస్. కె.	3-00
20.	కోరస్ - దామెర రాములు	2.50
21.	ఎర్రగాలి - జైరామ్	5.00
22.	మళ్ళీ సూర్యోదయం - సూర్యప్రకాశ్	3.00
23.	లయ - పౌమెట్రీఫోరం, వేములవాడ	3.00

పాటలు :

24.	తెలంగాణ పోరాటపాటలు	4.00
25.	సుద్దాల హనుమంతుపాటలు	4-00
26.	అల్లంవీరయ్య పాటలు	1.50
27.	జననాట్యమండలి పాటలు	3.00
28.	మహాకవికి కవితాంజలి - సాహితీ మిత్రులు, విజయనగరం	2.00

వ్యాసాలు :

29.	కళలు - సాహిత్యం ఎవరికోసం ?	1-00
30.	కళలూ, సారస్వతం ఎవరికోసం ? - మావో	1-00
31.	ప్రజలపాటలు - అనుభవాలు - గద్దర్, రామారావు, వంగపండు	1.25
32.	తెలుగులో కవితా విప్లవాలస్వరూపం - 'కవిసేన'కు జవాబు - - త్రిపురనేని మధుసూదనరావు	1.00
33.	సాహిత్యం కుట్రకాదు, రచయితలు కుట్రదారులుకారు "	1.00
34.	గతితార్కిక భౌతిక మానవతావాదం "	2-00
35.	ప్రజాసాహిత్యం, కళలు ఎలావుండాలి ? - వర్గీస్	2.00
36.	లూసున్ సాహిత్య జీవితం అను : కొ. కు.	1-50
37.	ప్రజాస్వామిక సంస్కృతి - కందుకూరి, గురజాడలదోహదం	3-50
38.	శ్రీశ్రీ చిరునామా - విరసం	2-00
39.	తెలంగాణ విమోచనోద్యమం - తెలుగు నవల వరవరరావు మేలు	50.00
	సాదా	35.00
40.	Raging storm (Poetry anthology) - VIRASAM	15-00
41.	Sword song " Cherabandaraju	10-00
42.	All India League of Revolutionary Culture - Souvenir - 1983	15-00
43.	Hail Revolution (Poetry anthology) AILRC	15-00

పై పుస్తకాలు కావల్సినవారు వాటిధరలతోపాటు పోస్టేజీ కలిపి ఎం ఒ ద్వారా ఈకింది అడ్రెసుకి పంపించండి. పుస్తకాలు బుక్ పోస్ట్ ద్వారా పంపిస్తాం.

SRJANA Telugu Monthly

SRJANA Telugu Monthly March '84 - H/HNK-3
Regd. No. with Registrar of Newspapers 10953/67

మీ ఊళ్ళో గ్రంథాలయంలోగానీ, మీ స్వంత గ్రంథాలయంలోగానీ యీ పుస్తకాలువున్నాయా? లేకుంటే వెంటనే తెప్పించుకోండి.

చదవండి — విరివిగా చదివించండి

నవలలు :

1.	బతుకుపోరు - బి. ఎస్. రాములు		5-00
2.	కొమురంభీము - సాహు, అల్లం రాజయ్య		8.00
3.	అగ్నికణం - అల్లం రాజయ్య		6-00
4.	నాకుటుంబం - టావ్ చెంగ్		4.00

కథలు :

5.	సృష్టికర్తలు - అల్లం రాజయ్య		5.00
6.	భూమి - అల్లం రాజయ్య		7-00
7.	బొగ్గుపొరల్లో - సింగరేణి కార్మిక కథలు		5-00
8	అనామకుడిడైరీ - కె. రాంమోహన్‌రాజు		5-00

నాటికలు, నాటకాలు :

9.	గ్రామాలు మేల్కొంటున్నాయి - చెరబండరాజు		8-00
10.	గంజినీళ్ళు - చెరబండరాజు		1-50

కవితా సంకలనాలు :

11.	ఉద్యమం నెలబాలుడు - శివసాగర్ -	మేలుప్రతి	10.00
		సాదాప్రతి	5.00
12.	పోరాటాల శ్రీరాములు - విరసం		0-75
13.	తుడుం - ఇంద్రవెల్లిపై విరసం సంకలనం		1.25
14.	సముద్రం - వరవరరావు		2.00
15.	రోడ్డుమీదసూర్యుడు - కె, రాంమోహన్‌రాజు		3.00
16.	చర్య - సాగర్		2.00
17.	కొలిమి - సాగర్		2.00
18.	పాటవెన్నెలమీద నడుస్తుంది - అజ్ఞాతసూరీడు		3.00

(మిగతా మూడవ కవర్‌లో)